# రామాయణ రహస్యాలు

## (అహంవేద్మి, సిద్ధాశ్రమం, పర్ణశాల, శబరి)



శ్రీమతి శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ



రచయిత్రి శ్రీమతి శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ

పతిదేవులు (పరమపదవాసులు) శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట రాఘవాచార్యులు అయ్యవార్లతో

అంతర్జాల మాధ్యమం

www.pravachanam.com

# రామాయణ రహస్యాలు

## (అహంవేద్మి, సిద్ధాశ్రమం, పర్ణశాల, శబరి)

పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీరంగ రామానుజ జీయర్ స్వామి వారి

**మంగళాశాసనములతో**




పరిష్కర్త

**శ్రీ మొలుగు రంగాచార్యులుగారు**



భగవద్ భాగవత ఆచార్య కైంకర్యం

శ్రీమాన్ కరి రాధానాథాచార్యులు (లేటు), శ్రీమతి కరి విజయలక్ష్మి దంపతులు, విశాఖపట్నం

# రామాయణ రహస్యాలు

శ్రీమతి శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ

© రచయిత్రి

ప్రథమ ముద్రణ, డిజిటల్ వెర్షన్

**ఆగస్టు, 2021**

**శ్రీమాన్ కరి రాధానాథాచార్యులు (లేటు), శ్రీమతి కరి విజయలక్ష్మి దంపతులు**

**విశాఖపట్నం**

వెల

**అమూల్యం**

సంప్రదించుటకు

**శ్రీ ఎస్.టి.పి.ఎస్.వి. రాఘవాచార్యులు**

9490942884

ప్రింటర్

**ముద్రిక ప్రింటర్స్, విజయవాడ**

# వినతి

**రా**మాయణము వంటి కావ్యములలో నాయికా నాయకులకు ప్రాధాన్యత నిచ్చుచుంటచేత నితర పాత్రల గొప్పదనము మరుగున పడిపోవుచుండును. ఈ విషయము నే నాంధ్ర వచన రామాయణము రచించునాడే నా మనసులోనికి వచ్చినది. అయిననూ ఆ వెనువెంటనే సన్మార్గ దర్శనము, రామానుజ చరిత్రలు వ్రాయుటచేత వానిని గురించి లోతుగా నాలోచించు అవకాశము కలుగలేదు. రామాయణములు ఎన్నో కలవు. వానిని వ్రాసిన వారెందరెందరో కొన్ని రామాయణ ఘట్టములందీ యుపపాత్రలకు ప్రాధాన్యత నిచ్చియున్నను అవి యుపపాత్రలుగానే యున్నవి.

ఇటువంటి యుపపాత్రల మనోవిశ్లేషణముతో కొందరు ఖండకావ్యములు రచియించియున్నారు. వారి వారి రచనలలో నీపాత్రలే నాయికలుగా, నాయకులుగా నున్నారు. ఉపపాత్రలుగా నున్నప్పుడివియే ప్రధాన కథకు పుష్టిని, తేజస్సును కూర్చియున్నవి. వీటి ద్వారానే ప్రధాన పాత్రల మహత్తు, అవతార రహస్యములు వెల్లడి కావలసియున్నది.

రామాయణములోని ఉపపాత్రల మనోవిశ్లేషణతో ఖండకావ్యములు వ్రాసిన వారిలో శ్రీమాన్ గుదిమెళ్ళ రామానుజాచార్యుల వారొకరు. వీరు కవిరత్న బిరుదాంచితులు. జీయర్ స్వామి వారితో దేశ పర్యటన చేసి రామాయణ గానము చేసినవారు. వీరి రచనలు నా మనస్సునకెక్కుటచేత వీనిననేకమారులు మననము చేసితిని. ఇవియన్నియు పద్యకావ్యములు.

పద్యములను చదివి యర్థముజేసికొనలేని వారికై రామాయణమును వచనములో వ్రాసిన నాకు, ఖండకావ్యములను కూడా వచనముగా వ్రాయ వలెనను కోరిక కలిగినది. కవిరత్నగారి ఖండకావ్యములలో 'అహంవేద్మి',

'సిద్ధాశ్రమము', 'పర్ణశాల', 'శబరి' అను ఈ నాలుగు ఖండకావ్యములను వచనమున వ్రాయుటకు పూనుకొన్నాను. ఇవి కవిగారి కృతులకు అనువాదములు కావు. స్వేచ్ఛానుసరణలు మాత్రమే. రామాయణములోని విశ్వామిత్ర ప్రాచుర్యము కథతో 'అహంవేద్మి' వ్రాయడమైనది. విశ్వామిత్ర, రామలక్ష్మణుల గురు–శిష్య సంబంధ కథతో 'సిద్ధాశ్రమము' వ్రాయడమైనది. రామావతార రహస్యమును గూర్చి శూర్పణఖా–రావణాసురుల మధ్య జరిగిన సంభాషణ 'పర్ణశాల'గా ఎన్నుకొనబడినది. రామలక్ష్మణులయందు బోయత శబరికి గల భక్తి వాత్సల్యముల కథ 'శబరి'గా గ్రహించబడినది. ఈ అనువాదముల ద్వారా రామాయణ రహస్యములు, అవతార ప్రయోజనములు తమ తమ సహజ ధోరణిలో ప్రధాన పాత్రల మనోవిశ్లేషణ ప్రవచనము చేయుట ఇందలి ప్రయోజనము.

కవిరత్న శ్రీమాన్ రామానుజాచార్యులవారి ఇటీవల పునర్ముద్రితమైన కొన్ని గ్రంథములను ఉచితముగా బంపి నాయీ రచనకు తోడ్పడిన శ్రీమాన్ గుదిమెళ్ళ బదరీనాథ్‌గారికి ఆశీస్సులు.

కథాగమనమును బట్టి వరుస క్రమము నిర్ణయించినందున నివి అహం వేద్మి, సిద్ధాశ్రమము, పర్ణశాల, శబరి యను క్రమములో వ్రాసి అన్నిటిని కలిపి యొకే పుస్తకముగా కూర్చితిని.

పాఠశాల విద్యనెరుగని, పాండిత్యములేని నాకు అవగాహన చేసుకొనుట లోను, భావమును వ్యక్తీకరించుటలోనూ, భాషలోనూ శక్తి చాలదను విషయము తెలిసినదే. సహృదయముతో నిందలి మంచిని మాత్రము గ్రహించి దోషములను వదలివేయుడని పాఠకులకు విన్నవించుకొనుచున్నాను.

ఈ రచనను సీతాలక్ష్మణహనుమత్సమేత శ్రీరామచంద్ర ప్రభువులవారి పదసన్నిధిని సమర్పించు భాగవత పదదాసి..

**శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ**

శ్రీమతేరామానుజాయనమః

# అహంవేద్మి

**"అహంవేద్మి మహాత్మానం**
**రామం సత్యపరాక్రమం।**
**వశిష్ఠోఽపి మహాతేజా**
**యేచాన్యే తపసిస్థితాః॥**

వాల్మీకి రామాయణము, బాలకాండ 19వ సర్గ, 14వ శ్లోకము

కఠోర తపస్సు అను ఖడ్గము చేబట్టి, క్షత్రియత్వమును భేదించుకొని, బ్రహ్మ ఋషి యను యోగ్యతను తనదిగా చేసుకొనిన కుశికుని మనుమడైన విశ్వామిత్ర ఋషి యడుగో ఆ కనిపించువాడే. త్రిశంకుని మానవ శరీరముతోనే స్వర్గమున కంపినవాడు అతడే. నేడు రాముని శిష్యునిగా గ్రహించుటకై



అయోధ్యకు వచ్చుచున్నాడు, చూడుడు. అతనికి వాకిలివద్ద స్వాగతమిచ్చినవాడే దశరథుడు. అర్ఘ్యమిచ్చినవాడే వశిష్ఠముని. ఆసనమిచ్చినవాడు వామదేవ ఋషి. పూర్ణకుంభ మర్పించినది రాణి కౌసల్య. పాదపీఠ సమర్పణము చేసినవాడు మహామంత్రి సుమంత్రుడు. కరదీపికా ఛత్ర చామరము లెత్తినవారు మిగిలిన రాణులు. కౌసల్యాదేవి యందించిన జలముతో రాజు కౌశికుని పాదములు కడిగి, మెత్తని వస్త్రముతో తడియద్ది, పుష్పములతో పూజించి, ఫలములు నివేదించి, గురుపాద తీర్థము సకల తీర్థ జలమని రాణులతో తానును సేవించెను.

తరువాత దశరథుడు "మహాత్మా! నోరెండిపోవుచుండగా నెడారిలో నమృత జలము లభించినట్లు; దరిద్రునకు నిధి దొరికినట్లు, సంతానము లేనివారికి పుత్రుడు కలిగినట్లు, ఆచార్యా! మీరు వచ్చుటచే మాకు ఆనందము కలిగినది" అని విన్నవించి, నమస్కారముద్రతో ప్రక్కనే నిలచెను. కౌశికుడు లేచి, ప్రీతితో దశరథుని వద్దకు వెళ్ళి, "ఆహా! నేడెంతయో సుదినము, సుప్రభాతము" అనుచు – గడ్డము గిలిగింతలు పెట్టునట్లు రాజును కౌగలించెను. కుతూహలముచే పుట్టిన కన్నీరు కండ్ల నుండి కారుచుండగా – కొంచెము సేపటికి తేరుకొని, రాజు భుజమును తట్టెను. అచటనున్న ప్రముఖుల యోగక్షేమములు విచారించెను. పిమ్మట అయోధ్యాపతితో నిట్లనెను.

"ఏమయ్యా! దశరథ భూజానీ! ఎంతయో కాలమునకు యిల్లు నిండునట్లు, నలుగురు పుత్రుల నెత్తుకొంటివి. నీవును నేనును తరించుటకు ఇది చాలును, బాగున్నది. మరి ఆ పుత్రుల బాలసారె నాడు మాకై ఏమి దాచియుంచితివో కదా!" వాక్చాతురుడైన దశరథుడు "అయ్యా! ఈ రాజ్యమే తమదైయుండగా, మీరు కోరుటయు, నేను దాచి యిచ్చుటయునా? ఎంతమాట! నా పని దీనికి కావలిగాచి యుండుటయేకదా! ఇచ్చుటకు మానుటకు నేనెవడను? ఇక కలిగిన

బిడ్డలా, వారు మీకు సర్వదా సేవకులై యుండగా, నే జెప్పుటతో పనియేమి” అనెను.

కౌశికుడు పకపక నవ్వి “బాగు బాగు, నీ మాటలు మీ వంశకర్త రఘువును స్ఫురణకు దెచ్చినవి. పోలిక లెక్కడకు పోవును? మీ వంశచరిత్ర రోజుకొకటిగా చిగురులు తొడుగుచు, పూయుచు, సువాసనలు వెదజల్లుచు, విస్తరించుచున్నది. అవును గాని – నీవు అప్పుడపుడు ఇంద్రసభకు పోవుచు వచ్చుచు నుందువుకదా! ఆ దారిలో త్రిశంకువును చూచితివా? వాడేమీ మీకు దూరపు బంధువు కాడులే. మీ కోవకు చెందినవాడే. ఆతని కొరకు నేనొక క్రొత్త స్వర్గమును సృజించుట ఎరిగి యుందువు. మీ రఘువులవలె నాకును అడిగినవానికి లేదని యనుటకు నోరురాదు కదా!

“నీవు వశిష్ఠ మహామునీంద్రుని శిష్యుడవు. మంత్రము నడపు వాడా సుమంత్ర మంత్రి. నీకెదురాడని దేవతలు నీ రాణులు కౌసల్య సుమిత్ర కైకలు – కనుక దీపముండగనే ఇల్లు నలుమూలలు చక్కబెట్టుకొనుట నీతి కదా! అన్నియు త్యజించిన నాకేమి కోరిక లుండును? కావున ఎవరికిని వేనికిని చేయి జాపవలసిన పనిలేదు కదా! నీ మాటలలోను సన్యాసికి కోరిక లుండవని ధ్వనింప జేసితివి. రాజా! నీవు నా మనోవాంఛితమును పసిగట్టినట్లున్నావు. ఔరా! మీ కోసలవాసులు గుండె వాసన జూచియే లోని యూహను గ్రహించ గలవారు కదా! దానిని అట్లుంచుము. ఎంతో దూరము నుండి పెద్ద ఆశ బెట్టుకొని వచ్చితిని, పని చిన్నదే, అయినను ఎంతయో శ్రమించిననే గాని ఫలితము సిద్ధించునట్లు లేదు.

“నీ యొద్దకు పనికై నేను వచ్చినంతనే, ఆ పని నాకు చేతగాక వచ్చితినని భావించకుము. మాకు మీ వంశముపై గల యభిమానము వలన నీ యవకాశము నీకిచ్చుటకు సంకల్పించితిని, అంతమాత్రమే. వినుము, ఈ మధ్య

మాయాశ్రమమునకు రాక్షసజాతుల రాకపోకలు పెరిగినవి. మారీచుడు సుబాహువు నను రక్కసులు మా యజ్ఞకుండములందు రక్తము మలము కురియించుచున్నారు. యాగము సాగకున్నది. నాకు వారిని శపింపవలెనని తోచును. ఇంతలో మా మనములో నల్లనివాడు, నల్ల కలువమొగ్గవలె సుందరమైనవాడు, మోముపై తుమ్మెదల వలె ముంగురులు వ్రేలుచున్నవాడు, తామర రేకులవలె సిరులెగజిమ్ము నేత్రములవాడు, ధనుర్బాణములు ధరించి గోచరించును. వాని పేరేదో, ఎచ్చట నుండునో మాత్రము చాలా కాలము గ్రహించలేకపోయితిని.

“వాడెవడా? యను ఆలోచన కొంతకాలము సాగినది. నేను పురుష సూక్తము పఠించుచుండగా వాడెదుట నిలచును. అర్ఘ్యమీయబోగా సూర్యమండల మధ్యవర్తియై దర్శనమిచ్చును. దీనినిబట్టి నేను వాని జాడ దీయలేకున్నను, వాడు నా జాడ యెరిగినట్లు వెల్లడియైనది. వాడు సనాతన పురుషుడని, శృతి శిరసులచే తెలియదగిన వాడని తేలినది. వాడీ భూమిపై నెందో అవతరించి యుండునని జాడలు తీసినది. చివరకు వాడు ఇక్ష్వాకు వంశమందు జన్మించి యున్నట్లు గుర్తించితిని. వాడెవడని యందువా? మన రాముడేనయ్యా. ఆ మహాత్ముడు! నేడిది క్రొత్త యనుభవమే యైనను, వాని వైభవము పూర్వము నేనెఱిగినదే. భూజానీ! వాడే ఆ తాటకాపుత్రులైన రాక్షసుల నిద్దరను సమయ మెరిగి చంపగల వీరుడు, ఆ రాముని నాకీవయ్యా!

“దశరథా! ఈ మాటకే మొగము గంటుపెట్టుకొంటివే. ఇందుకు ఆ రాముడు నీ వాడు మాత్రమేనను భ్రాంతియే. అది వట్టి భ్రాంతి. వాడు లోకులందరిని ఉద్ధరించుటకు అవతరించిన భగవంతుడని నీ వెరుగవు. యోగరత్నముచే సానబెట్టబడుట వలన వాని పోకడ నే నెరుగుదును. సత్య పరాక్రమము వాని సొత్తు. వాడే నా యజ్ఞరక్షకుడై రావలెను. చూచితివా, నేనును భ్రమపడుచుంటిని. యజ్ఞము నాదేమి? యజ్ఞమన్న రాముడే. వాడు రాని యజ్ఞమెట్లు జరుగును?

యజ్ఞభూమిలో ధూముధాములు చేయుచున్న రాక్షసుల తుది గడియలు దగ్గర పడినవి.

"ఆ రక్కసులెవరో తెలియునా? దేవతలందరకు నెవని పేరు విన్నంతనే కంపము పుట్టునో – ఎవరి క్రూరత్వము వారిని స్వర్గము నుండి తరిమికొట్టెనో – ఆ రావణుని ఎరుగుదువు కదా! వాని యనుచరులు. వారిద్దరను చంపుటకు రాముడేగాని వేరెవరును చాలరు. కనుక నీవు వచ్చినను లాభము లేదు. పూర్వ మొకమారు నీవు శంబరాసురునితో యుద్ధమునకు పోలేదా? ఏమి జరిగినది? మా కేకయ రాజపుత్రి సహాయము చేయగా నెట్లో యిల్లు చేరగలిగితివి కదా! కనుక శక్తి చాలని కార్యములు చేయరాకుము. ఆనాటి నుండియే కదా నీవనుకొన్న సమస్తము నామెకు వదలుకొంటివి! ఆలోచించుకొనుము. మీ గురువు, ధీమతియైన వశిష్ఠుడుండెను కదా! ఇందులోని మంచి చెడులను అతనితో నేకాంతమున విచారించుము. పూర్వము నీవొకమారు గాజులు ధరించి స్త్రీవలె దాగుట యెరిగిన ఆ ఋషి, రాముడు నా శిష్యుడైనచో నేమగునో చెప్పగలడు.

"పంక్తిరథా! నా యొద్ద నుండెడి రాముని కేప్రమాదమును రాదనుట సత్యము. అబద్ధమందురేమో, ఇచటనున్న తాపసులందరిని అడిగి చూడరాదా? రామునికి కీర్తి కలిగింతును. అస్త్రముల నిత్తును. ఆకలియు దప్పికయు అలసటయు పోగొట్టెదను. క్రతువు పూర్తియైన పిమ్మట చేతికి సిరినిచ్చెదను. రాముని కంటికి రెప్పను వలె కాపాడెదను. మీ రఘువంశ ప్రతిష్ఠలు శాశ్వతముగా నిలచును. శుభమగును. రాముడొక యింటివాడగును. నేనింతగా చెప్పుచున్నను, బెల్లము కొట్టిన రాయివలె చలనము లేకున్నావేమయ్యా!" అనగా దశరథుడు ముందుగా తన మనస్సులోను, ఆ తదుపరి గురువు వశిష్ఠునితో నేకాంతమునను చింతించెను.

“ఈ ఋషి యాగమేదో తలబెట్టెనట. దానిని కొనసాగనీయక రాక్షసు లిద్దరు తిప్పలు పెట్టుచున్నారట. దీనికై మా ముద్దులపట్టి రాముని పంపుమని తాను వచ్చెనట. పూర్వము శత్రువుల దాడుల నెరుగుదుమే కాని, ఇట్లు మునుల దాడుల నెరుగము. రాముడా? పంద్రెండేండ్లు దాటని పసివాడు. యుద్ధమునకు చాలనివాడు. లేక లేక కలిగి, యీనాటికి కాలము కలసివచ్చి వాడు మా కన్నుల పండువుగా నుండుట, అయ్యో! ఈ కౌశికునికి కన్నుకుట్టినదే! రాముడు ముకుపచ్చలారని పసివాడు. లేత యెండకే వాడి వత్తలగు సుకుమార శరీరుడు. ఈ మునికండ్ల నెట్లు పడెనో? వీనిని అడవులపాలు చేయగా దాపురించినాడు. రాచబిడ్డను అడవుల ద్రిప్పవచ్చెను.

“తాను ఆర్జించిన మహత్వమంతయు దేవతల వెలయాలు మేనకపాలు చేసి, నేడు తనపై పడుచున్న రాక్షసుల నేమియు చేయలేక, లోకుల బిడ్డలు తేరగా నున్నారని, తానొక గొప్ప మునినని గాధిజుడు విచ్చేసినాడు. నా మెడపై గండకత్తెరయై నిలచినాడు. రాముని పంపుటకా – బుద్ధి పుట్టుటలేదు. పంపనిచో నీ మాయదారి ముని శపించునేమో? తాను కన్నబిడ్డలనే శపించిన కర్కోటకుడు – వీనికి జాలి యెక్కడిది? పరికించగా వీనికంటె ఆ పరశురాముడు ఎంతయో నయముగా కన్పించుచున్నాడు. మా గురువు వశిష్ఠుడీతనికి – తన యింటికి వచ్చెనని సద్బుద్ధితో ఆతిథ్యమీయగా నేమైనది? ఈ కౌశికుడాతని యింటికి నిప్పు బెట్టెను కదా! ఆనాటి నృపవేషము మారినను, పుట్టుకతో వచ్చిన బుద్ధి మారునా?

“రాముని నేనెఱుగుదును, వాడు సత్యపరాక్రమము కలవాడు. అట్టివాని తత్త్వము మీరా, గుర్తింపగవారు? రాముడెవరో పరికించి వచ్చితిని. ఆ రహస్య మేదియో మీ కులబ్రాహ్మణుడు వశిష్ఠునే అడుగుమనుచున్నాడు. ఇదెక్కడి పీడ వచ్చిపడెనోకదా! అయ్యో! వశిష్ఠమునీంద్రా! గురుశ్రేష్ఠా! నేనిప్పుడేమి చేయుదు

నయ్యా! రామునీతనితో బంపుమనెదవా? అందుకు నా మనసు ఒప్పుటలేదే! పంపనిచో నీ ముని తన ప్రతాపము చూపకమానడే! ముందు నూయి, వెనుక గోయిగా నున్నదయ్యా! ఋషివర్యా! మాకు దిక్కైన నీవీతరిని ధైర్యము చెప్పవేమయ్యా! ఏదో తపస్వి యింటికి వచ్చెను, ఋషి కదా, కోరికలేమి యుండునని – మాట వరుసకు ఏమి కావలయునో కోరుమంటిని; అంతే తల్లి వేరుతో సహా పాదును పెకలించివేయనున్నాడే! ఓ వశిష్ఠమౌనీ! ఋషియైన వాని కిటువంటి దురాలోచనలు ఉండతగునా?

"నీతో నెయ్యపు మాటలాడుటకు నేడెట్లు వీనికి బుద్ధి పుట్టెనో? ఆనాడతడు నిన్నెన్ని దూషణలు చేసెను? నీతో నెంతగా కయ్యమాడెను! నా హృదయములో నవి యింకను మండుచునే యున్నవి. గురుశ్రేష్ఠా! గడ్డము తెల్లబడినంత మాత్రమున తత్త్వము శుద్ధమైపోవునా? రాకీలములో జన్మించిన రాముని తత్త్వము – మద్యమాంసములు సేవించి మెత్తని పాన్పుపై పరుండి సుఖించు రాజు లెరుగ నేరరట! వారికా తేజస్సు కనిపించదట! నీవు సత్యము గుర్తించి చెప్పుము. అయ్యా! పగవానికై సాక్ష్యము చెప్పవుకదా! నేనే కదా, గాయత్రీ మంత్రకర్తను. ద్రష్టను – అను నహంకారముతో – శ్రీహరి క్షత్రియ వంశములో జన్మించెనని యేకొంచెమో దృష్టి గోచరముకాగా, తాను సూర్యునివైపు బారచూడగా, సూర్యుడే ఆ విషయము తనకు చెప్పెనని – ఆ శ్రీహరియే మా రాముడని – పలుకు వింత విన్నావుగా. తానంతటి ఘనశక్తి సంపన్నత కలవాడైన – తనపైకి వచ్చు రక్కసులను తానే నిర్మింపవచ్చునే! మా రామచంద్రుని వంటి బాలునికై పరుగెత్తి రావేల? ప్రాణయామము పట్టినట్లు మమ్ము ఉక్కిరిబిక్కిరి చేయుటెందుకు?

"తానట – కాననో, కోననో దారుణమైన తపము చేసెనట! దానివలన తనకు కలిగిన యోగదృష్టితో మా రాముని ఒక అమానుష వ్యక్తిగా భావన చేసెనట! మా బాలరాముడు దేవతలకును సాధ్యులుకాని రాక్షసులను చిదుక

గొట్టునట! ఆచార్యా! ఇవి యన్నియు ఎక్కడి మాటలు? మా వంశకరుడైన రఘుమహారాజు కాలము నుండి అందరు త్యాగము వలన ఖ్యాతి గడించగా, – కులగౌరవ హేతువైన ఆ త్యాగము – నా వలన మసకబారిపోవునని దెప్పుట – మీరు వినలేదా?"

"ఆయుధ శక్తి కలదను నహంకారముతో మీపైకే చేయెత్తి దుమికినవాడు కదా! రామభద్రుని పంపనిచో నన్ను బ్రతుకనిచ్చునా? మహర్షీ! నాకై మీరు మరొకమారు మీ బ్రహ్మదండము ఎత్తక తప్పదు" అనగా చిరునవ్వులు చిందించుచు వశిష్ఠ మౌని రాజుతో ననెను.

"రాజా! ఎక్కడ నుండి ఎక్కడకు అల్లుకొని వచ్చితివయ్యా! ఇప్పుడు అంతవరకు పోవలసిన అవసరము లేదు. ఆనాడు గాధిజుడు విశ్వమునకు అమిత్రుడు. కనుకనే ఈ వశిష్ఠునితో జగడమాడెను. నేడు అతడు దీర్ఘదర్శి, భవిష్యము ఎరిగినవాడుగా నిచటికి వచ్చెను. కనుక విశ్వమునకు మిత్రుడు – క్షేమకారియునై యున్నాడు. ఆ ప్రాజ్ఞతతోనే రాముడెవరో, తాను తెలుసుకొని – తృప్తిగా రామస్వామి సేవ చేసుకొని – తానార్జించిన తపస్సు ధారపోయగా నెంచి ప్రేమతో వచ్చెను. రాముని అతనితో పంపుము. ముందు ముందు నీ కుమారున కెన్నియో శ్రేయములు కూర్పగలడని నమ్ముము. విశ్వామిత్ర పదమును విశ్వమునకు అమిత్రుడని సూత్రము చెప్పిన వైయాకరణులే "విశ్వస్యమిత్రమ్" అను క్రొత్త సూత్రము నేడు ప్రవచించుచున్నారు. నీ పుత్రున కొక కళ్యాణము ఘటించుటకై వచ్చి – నిన్ను అర్థించుచున్నాడు – అని గ్రహించవయ్యా!

"దశరథేశ్వరా! ఆనాటి కౌశికుడు కాడు, నేటి కౌశికుడు. ఆనాడతడు నా ధాటికి వెఱచి స్వకులమును మార్గమును త్యజించి, చివరకు నా మాటతోనే సన్మార్గమున బ్రహ్మ ఋషియైనాడు. మాబోంట్ల యీ చర్యలన్నియు లోకక్షేమము కొరకేనయ్యా! అన్ని విషయముల పూర్వాపరములు లోతుగా పరిశీలించి,

అతిలోకము మహత్తరములైన ఖ్యాతినార్జించిన గాధిజుని అంతర్దృష్టి తపః ప్రభావముతో కూడినదై – భూత వర్తమాన భవిష్యదరర్థమున నెల్ల సంపూర్ణముగా దర్శించగలదు.

"నరేంద్రా! ఆలస్యము చేసి కార్యము దాటబెట్టకుము. తరువాత చింతించినను ప్రయోజనము ఉండదు. ఆ ఋషి యొద్ద అత్యద్భుతములైన మహాస్త్ర సంపదయున్నది. దానిని ప్రేమతో రాఘవునికి ఉపదేశించును. ఈ లాభమును దాటిపోనీయకుము. నా మాటలలోని ఆంతర్యము గ్రహించుము. ఇంకను తడవెందుకు? రాముని మునితో పంపుము. రామునకు ప్రేమతో వివాహము చేయు యోచనతో నీవుండగా, అతడు పలికిన మాటల ఆంతర్యమును గ్రహింపుము. ఆతడడిగిన అర్థము నెరవేర్చుము. త్వరలోనే దాని ఫలము నీకు కూడివచ్చును. ధర్మమే రూపుదాల్చి వాడు – ఆ ఋషి – నిశ్చయముగా తలచినచో – భూమిలో నెచ్చటనో పడియుండిన రత్నమును వెలికిదెచ్చి రాముని చేతబెట్టగలవాడు. అంతటి సమర్థునికి మన రాముని శిష్యునిగా చేసిన చాలును, వానికొరకు కొండమీది కోతియు తనకు తానై దిగి వచ్చునని తెలుసుకొనుము.

"కౌశికునికి పూర్వమొకప్పుడు తిండిబెట్టి తగవు తెచ్చుకొన్నానని నీవన్నది నిజమే. కాని యితడు తిండి అవసరముండని యట్లు, మంత్రపూతముగా నమృతము సిద్ధముచేసి, పాత్ర నింపియుంచినాడు. దానిని నీ పుత్రునకు తినిపించును – అంతే – దానితో రామచంద్రుని కింక ఆకలి దప్పులను మాటలే తలయెత్తవు సుమా! ఆహా! రామునిదే అదృష్టము. యజ్ఞమే రాముడు, రాముడే క్రతువు. యాగము, రాముడు నొకటే. రామమహాక్రతువు లోకములో ప్రవర్తిల్లుచుండగా – నా క్రతుసేవ చేయ కౌశికుడు ఏతెంచినాడు. హితమేదో గ్రహించుము, రామభద్రుని ఋషి కప్పగించుము.

“క్రతునాశకు లెచటనున్నను, వారిని హతమార్చెడువాడు రాముడైనందున, నేడీ బుద్ధిశాలియైన కౌశికుడు విచ్చేసెను. భూరమణా, దశరథా! ఎందుకు ఆలస్యము చేయుచున్నావయ్యా? రాముని ఆ ఋషి శిష్యునిగా జేయవయ్యా! ఆ గురువు పూర్వము మానవుని మహనీయునిగా జేసి దివికెత్తెను. ఆ స్ఫూర్తితో ఆ గురుపాదపద్మముల సన్నిధిలో శక్తివంతుడై శిష్యుడిక అయోధ్యావాసులందరిని – గురువును మించి – వైకుంఠమున కెత్తగలడయ్యా! ఆహా! గురువుకు తగిన శిష్యుడు! ఎంత సముచితముగా నున్నది!

“కౌశిక గురూత్తముని వెంట – చిరునవ్వుతో రామచంద్రుడు వెళ్ళుచుండగా నా గమనసంపద చూచుటకు గత జన్మలలో నెంతయో సుకృతము గడించి యుండవలెను. పుత్రుడు దేశమునకు ప్రజకు గురువుకు సేవజేయ వెళ్లిననే కదా తల్లిదండ్రులు, వంశము తరించునది! కౌశికుడు రాముడు గురుశిష్యులై ముందు వెనుకల నడువగా దేవతలు దుందుభులు మ్రోగింతురు. కుసుమ వృష్టి కురియును. మహా ఋషులు దర్శింప వత్తురు. వేరుపడిన జంటలు దగ్గరయగుదురు. నీ త్యాగము స్తుతిపాత్రమగును. అయోధ్యాధిపతీ! రాముని మునికప్పగించవయ్యా!

“అందమనగా నేమనుకొనుచున్నావు? త్యాగమేనయ్యా. రూపము, కీర్తి – త్యాగము వలననే కలుగును. పదవి, అధికారము త్యాగఫలములే. గౌరవమును దాని ఫలమే. త్యాగమేనయ్యా, సిరి, మోక్షలాభమును త్యాగము వలన వచ్చునదే. సర్వము త్యాగమే యైనందున త్యాగమూర్తివై పుత్రుని ఋషివెంట పంపవయ్యా! జరుగగలదానిని ఇపుడు విశదముగా యోగదృష్టిని చూచితిని – అది యొక పరమ రహస్యము. కౌశిక గురూత్తమ కృపచే నీ పుత్రునకు సిరియబ్బు యోగ మెదురుచూచుచున్నది. గురు కృపాదృష్టితో నీ సుతుడెంత భయంకర ధనస్సు నైనను అవలీలగా నెత్తగలడు.

“వెన్నెలలేని చంద్రుడు, కమలములేని కొలను, ప్రకాశింపని రత్నము, వాసనలేని పువ్వు, త్యాగమునకు నోచని ధనము, ప్రతిభ జతపడని కళాకారుడు – వలెనున్న రాముని; సిరిపట్టిననాడు చూడుము! అందుకై మమకారము వదలుము. రాముడు నీకొరకే పుత్రుడై పుట్టెనని భ్రమించకుము. ఆ భ్రమను త్రుంచివేయుము. ఐశ్వర్యయోగము పట్టిన లోభిగా ప్రవర్తించకుము. నిక్కము హితము పలుకు నా పలుకు ఆదరించవయ్యా!

“ఆ ఋషి రాముని తానెరుగుదునని, రామతత్త్వము తనకే తెలియునని, రాముడు దైవీసంపదచే నొప్పువాడని, రాఘవుడు సత్య పరాక్రమోపేతుడని – నా రాముని నాతో పంపవాయని, గడ్డము దువ్వుచు ప్రశ్నించుచున్నాడని – అన్యథా భావించకుము. యోగికి అనుగ్రహమే కాని ఆగ్రహముండదు. ఇది యంతయు హితము కూర్చుటకై చేయు సందడి యని యెరుగుము. ఆతని కోప మెప్పుడో శాంతించినది. కామము అను మాటయే లేదు. గర్వము నశించినది. శాంతి తితిక్షలు పొందినాడు. అంతర్దృష్టితో సమస్తము నెరిగినాడు ఆ ఋషి తపోమహాత్మ్యమును – రాజేంద్రా! ఈమారు పరికించుము.

“ధర్మస్థాపనకై కన్నబిడ్డలనైన త్యజించగల ధైర్యశాలి. వధార్థమై యూపస్తంభమునకు బలిపశువుగా గట్టబడి దీనుడైన పరులబిడ్డ శునశ్శేఫుని, తన మంత్రశక్తిచే జీవితునిగా జేసిన ఆతనిని క్రోధియందువో, కృపాళువందువో చెప్పవయ్యా! పరహితమునకై పూనిన మహాత్ముల ఆగ్రహము – ఆగ్రహ మనిపించుకొనదు కదయ్యా! వారి మేలుకోరి తమ బిడ్డలను తల్లిదండ్రులైనను మందలించరా, దండించరా? విశ్వామిత్రుని కోపమట్టిదే. ఇంద్రియాశ్వముల నెంతయో నిగ్రహముతో బిగబట్టినవాడెట్లు కోపియు క్రోధియు కాగలడో యోచింపుము.

“నేను సూర్యవంశ రాజపురోహితుడను, కులగురువును, మంత్రిని,

హితుడను, వారియందు పుత్రదృష్టి గలవాడను. అట్టి నేను త్రిశంకుని కోరిక విని – వానిని శపించి పంపితిని. వానిని కరుణతో పరికించి, వానికై తన తపోశక్తిని వ్యయించినది కౌశికుడేకదా! కనుక మా ఇరువురిలో నెవడు తామసుడో తేల్చిచెప్పుము. అతిథికి తిండి పెట్టి, వాడు కోరినది ఇయ్యవలసి యుండగా – తిండి పెట్టిన చేరి ఆరకుండగనే – అతడు కోరిన గోవు నీయ నిరాకరించితివి – అట్టి నీవు ధర్మపన్నములు పలుకుటయా – అని నీవు అడుగబోవుచున్నావని ఎరుగుదునోయి, దశరథా!

"ధర్మ సూక్ష్మమును వినుము. ఆనాడు అతడు క్షత్రియుడు. వాడు దానమీయగా బ్రాహ్మణుడు రహించవలెనేగాని – బ్రాహ్మణుడనైన నా నుండి వాడు దానము గ్రహించరాదు కదా! ఆనాడతడు స్వార్థమునకై జీవించినవాడు – నేడో బ్రహ్మ ఋషి – కనుక నీ నుండి రామచంద్రుని పొందుటకు అర్హుడై యున్నాడు. నీవు మరొక నింద జేయనున్నావని తెలియును. 'నీవు అప్పుడును ఇప్పుడును బ్రాహ్మణుడవై యుండి – నీవే కదా అతనిని బ్రాహ్మణుడని అన్నావు – కనుక నీకిప్పుడు కుల పక్షపాతము కలిగి అతనిని సమర్థించుచున్నావు, నాకు చెప్పరాకుము' అని అనదలచుకున్నావు. అట్టి దురాలోచనలు వదలి పెట్టుము.

"కౌశికుని కోరిక – ఈ భరత ఖండమును కర్మభూమిగాను, లోకమున కొక తీర్థప్రదేశముగాను పరివర్తన చేయగలదు. వానివంటి గురువులు తీవ్ర తపోశక్తి కలిగియుందురు! వారికి ఒకప్పుడు గుణావేశము కలిగినను అది లోకహితమునకే ఉపయోగపడును. సాటిలేని బుద్ధి విస్తరణ గల కౌశికుని వైభవము తిరుగులేనిది. ఆ విలువ గ్రహించి దశరథ నరేంద్రా! రాము నాతని వెంట బంపుము. కౌశిక ప్రభావము తెలుపుటకు తగిన పదములు భాషయందు కొఱవడి యున్నవి. అంతటి యోగి – నీయొద్ద చేయిజాపి – రాముని పంప గోరుట నీ పుణ్యఫలమేనయ్యా!

"శిష్యసహితుడై వెళ్లు కౌశికుడు దారిలో రామునే చూచుచు, స్పృశించుచు, రాముని ముద్దాడును, వానిని కౌగలించుచు, లాలించుచు, రాఘవుని శిరస్సు మూర్ఘ్నొనుచు, వాని బుగ్గలు దువ్వుచు, చివరకాతనిని చంకకెత్తుకొనుచు నాదరించును. దాశరథి కెన్నియో పురాతన రాజచరిత్రలు వినిపించును. ఆశీర్వదించును. అపరిమిత అస్త్రములనిచ్చును. దైవమువలె సేవించును. యజ్ఞ దక్షిణగా నింకే సరి సమర్పించునో – వేచి చూచిన నీకే తెలియగలదు. అంతే కాదు, రాఘవుడు నవ్వునప్పుడు, చూచునప్పుడు కూర్చుండగాను, లేవగాను, తన ప్రక్కనే పరుండునప్పుడు – అతనికి ఎవరి దృష్టి దోషములు తగులరాదని – మంగళకర్మలు చేయును సుమా!

"రాముడు నవ్విన, గడ్డము సవరించుకొనుచు మునియునవ్వును. రాముడు తనను చూడగా, మౌని తృప్తి చెందును; రాముడేదైనా అడిగినచో, భళిభళి యని ప్రశంసించుచు ఋషి ఆ విషయము విశదీకరించును; దశరథా! ఆ యోగికి – రామునికి మధ్య గల బంధము నీ యూహకు అందునది కాదయ్యా! రాముని ఆ ముని మున్నెన్నడు చూచియుండకపోయినను – వానిపై ఆశలు పెట్టుకొనుట ఎందుకు అనుకొందువేమో? ఆ మహాత్ముడు – భూత భవిష్య ద్వర్తమానములు తెలియగల మహర్షి. వాటినన్నిటిని యోగదృష్టితో కనుగొని యుండును.

"దైవము ఎట్లుండునో, ఎవరో చూచిన వారెవరుందురు? అయినను పండితుల నుండి పామరుల వరకు, మహర్షుల నుండి హఠయోగుల వరకు వానిని వేయి విధాల వేడుకొనుచున్నారు. అటువంటి అదృష్ట అజ్ఞాత దైవ ఘటనయే వారి వారిని ఆయాచోటులలో కూడునట్లు చేయును. మీ రఘు వంశమునందు అమేయచరిత్ర గల శ్రీహరి పుట్టునని గుర్తించిన ఖ్యాతి – ఇక్ష్వాకుల నాటి నుండియు మీ కుల బ్రాహ్మణుడనైన నాకు లభించలేదు.

దానిని కౌశికుడు తానై దక్కగొన్నాడు. ఆ పరమార్థమేదో తానై గ్రహింపగా వచ్చెనయ్యా, దశరథా! పాపమా ఋషి యెంతో శ్రమించి బ్రాహ్మణుడై వచ్చి యున్నాడు. నీవేమి యిచ్చినను దానముగా గ్రహింపగలడు. నీ పుత్రుని వాని కిచ్చితివా, వానికి తగిన తోడు జతపరచి వెనక్కు పంపగలడు. గాధిజుని దృష్టి కందనిది యేదియు లేదని తెలుసుకొనుము. వాడెరుగని తత్త్వమును నాస్తియే.

"రాముని కేవలము బాలునిగా భావించుట బుద్ధిచాపల్యత వలననే గాని – వాడెక్కడ బాలుడయ్యా? ఇన్ని యెందుకు? రాముని పంపదగునో, తగదో వెళ్ళి కౌసల్య సుమిత్ర కైకలను చాటుగా పిలిచి వారితో చెప్పి చూడుము. దానితో నీ మనఃశ్శల్యము వదలిపోవును."

దానితో దశరథుడు కన్నుల నీరు నించుచు లోనికి వెళ్ళి "ఓ కోసల రాజపుత్రీ! ఇదిగో నిటు రా! దూర్వాసుని వంటివాడు, పెద్ద గడ్డము గలవాడు, జింకపైకి ఉరుకు సింగము వంటివాడు, గాధిజుడునైన విశ్వామిత్రుడు వచ్చి పడినాడు. ప్రమాదమై వచ్చినాడు. చెప్పుచున్నాను వినుము. అతడొక పెద్ద యజ్ఞభారము మోయలేకున్నాడట. దానిని భరించుట కెవరి తలయైన కావలెనట. అందుకై మన రాముని పంపుమని వచ్చెను. వినుచున్నావా? పంపనిచో మన కొంప గూల్తునని గ్రుడ్లు ఎఱ్ఱజేయుచున్నాడు. ఏమి కానున్నదో కదా?

"అయ్యా! వాడింకను బుగ్గలపై బాల్యపు మెరుగులు వదులనివాడు, లేయెండకే వాడిపోవు తీగెవంటివాడు. అట్టివాడు మహర్షుల యాగరక్ష చేయుటయా?" అని యా మునిని ప్రార్థించితిని. దుఃఖము ఆగినది కాదు. అయినను కుదురదు, పొమ్మనినాడు. బుద్ధితక్కువయై గురువు కదాయని, వశిష్ఠుని యభిప్రాయమడిగితిని. ఆతడింకను గుండెపై పిడుగుల బడవేసినాడు. రాముని బంపగా ఆలస్యమెందుకు అనినాడు. ఆ ఋషులిద్దరును యోగమేదో చేసిరట. వారి మధ్య పూర్వపు పగలన్నియు సమసిపోయినవట – ఇంకేమనగలను?

“వారో గురువులు, ఏమియు ననరాదు కదా! ఇరువురును బ్రాహ్మణులు – వారి గొప్పలు వారు చెప్పిరి. వారు ధరణిపైనున్న దేవతలట, యోగులట, పరతత్త్వ మెరిగిన వారట. వారి యాచరణలే శ్రేష్ఠములట తేల్చి సారమేమనగా, రాముని పంపవలెనని. నేనో, రాముని పంపలేను, కౌశికుని కాదు అనలేను. గురువు వశిష్ఠుని మాట తలదాల్చలేను. మనలో మన మాటగా చెప్పుము. దేవీ కౌసల్యా! రాముని పంపుమనెదవా? అందుకు నీ మనసు ఒప్పునా? నీ ప్రాణము నిలచునా?” అనెను.

కౌసల్య “ఆర్యపుత్రా! వశిష్ఠ ముని మన కులగురువు, కులబ్రాహ్మణుడు, మంత్రిసత్తముడు. ఆతని హితమును నిరాకరించుట తగునా? కౌశికునంతటి మహర్షి – మన పుత్రుని శ్రీసమేతునిగా తిరిగి త్వరగానే పంపెదననుచుండ, తిరుగుడు మాటలాడదగునా? మహారాజా! యోగులు కీడు చేయువారా! బాల్యశ్రీతో నొప్పుచున్న మన రామచంద్రుని వాడిపోకుండ త్రోవలో నిద్రబుచ్చి, ఉదయముననే కాల్యకృత్యములు తీర్చుటకు, కౌసల్యాపుత్రా! లేవయ్యా! అని నిద్ర లేపిన చాలును. అంతకు మించిన జన్మ సాఫల్యము ఉండునా? కనుక నా రాముని సమర్పించెదను.

“అచట మీ మధ్య జరిగిన సంభాషణ లన్నియు వింటిని. నీ మనఃశల్యము తెలిసినది. ప్రభూ! కౌశిక మహర్షి వచ్చి మిమ్ము కోరినదియు, దుఃఖించవద్దని వశిష్ఠ మౌని చెప్పిన హితవును విన్నాను. ఇంకను సందేహము లెందుకు? అంతటి మహామహులు మన బిడ్డకు చేటు చేయుదురా? వారా, గురువులు; వారి ప్రభావమా గొప్పది; కౌశికుని ఒక యాచకునిగా భావించి, బిడ్డపై గల ప్రేమ మూలమున తొందరపడినారు. మంచి చెప్పిన గురువును పక్షపాతిగా భావించితిరి. పతిదేవా! వీనిని మించిన యపచారములుండునా?

“స్వామీ! రామభద్రుని నిద్రలేపి, దిష్టి తీసితిని. తలయంటి, తల దువ్వి కూకటి చుట్టితిని. అంగీ, కటివస్త్రము ధరింపజేసితిని. ముద్దాడి చేత విల్లు

బాణములు పెట్టి 'పద బాబూ' అంటిని. అడుగో ఇటే వచ్చినాడు" అని "రామచంద్రా! నన్ను మీ తండ్రిని విడచి, ముని వెంట వెళ్లెదవా?" అనగా రాముడు అంగీకార సూచకముగా చిరునవ్వు నవ్వెను. దానితో రాజు గుండెపై పెద్ద బండ పడినట్లైనది. వాని మనస్సు వికలమైపోయినది.

ఇంతలో సుమిత్రా సతి వచ్చి బంగరు పీఠముపై దశరథుని కూర్చుడబెట్టి "మునిరాజు వెంబడి రాముడు వెళ్లుచుండగా, లక్ష్మణుడింట నుండునా? అతడును అన్న వెంట వెళ్లును. రాజా! అందుకు అనుమతి దయచేయుము" అనుచుండగనే కైక నవ్వుచు వచ్చి "అక్కా, సుమిత్రా! దీనికి ప్రభువు నాజ్ఞ యెందుకే? రాముడనగా లక్ష్మణుడును - అని వేరుగా చెప్పనక్కరయే లేదు కదా! సూత్రమనగా భాష్యము కూడానని చెప్పనక్కరయేమున్నది? అనెను.

రాజు కైకను చూచుచు "కైకా! నీవును రఘురాముని పంపుటకు అంగీకరించుచున్నావా? వాడు మచ్చలేని మాతృప్రేమతో నీకడనే పెరిగెను కదా! ఆ మమకారము నెట్లు వదలితివి? నేనట్లు వదులలేకున్నాను. ఆ విధమేదియో నాకును తెలుపరాదా!" అనగా నామె చిరునవ్వు నవ్వుచు "నరేంద్రా! రామునిపై గల ప్రేమను వదలు టెట్లా అనియా? పది రోజులపాటునకే యిట్లైనచో తరువాతనో? వాడు నా సవతి పుత్రుడు కదా! నా మాట ఆదరించునా? అందుకు యిది పరీక్ష కాకూడదా? ఐనను ఆనాటి మాట ఇప్పుడెందుకు? స్వామీ! కన్నతల్లి కోసల రాజపుత్రి - కుమారుని ప్రేమతో మునివెంట పంపుటకు సిద్ధము చేసినది. మరొక సవతి ఆమె పుత్రుడు లక్ష్మణుని, రాముని వెనుక నిలిపినది. రామభద్రుడా? వెళ్లుటకు తొందరపడుచున్నాడు. నీ కెందుకు ఈ వృధా యాసము? రామలక్ష్మణులను మునివెంట బంపుము' అనెను.

ఈ వరుస సంఘటనలతో దశరథుని మనోవేదన కొంత శాంతించినది. రాముని యందొక దైవశక్తి కనిపించినది. వాని మమకారసారము

తాత్కాలికముగా సడలినది. ఋషిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుని సమీపించి, వాని పాదములంటి క్షమాపణ కోరినాడు. రాముని వాని కప్పగించుటకు చేరబిలచినాడు. దాశరథిని ప్రేమతో దగ్గరకు తీసుకొని, నల్లకలువ మొగ్గను వలె చంకకెత్తుకొని, ఒకమారు, మరొక్కమారు ఆ బుగ్గ కూడ అనుచు కొసరి కొసరి ముద్దులు పెట్టి, హృదయమునకు హత్తుకొనెను.

కండ్ల వెంట వియోగ బాష్పములు కారుచుండగా, గొంతు డగ్గుత్తిక పడగా, రెండవ చంక లక్ష్మణు నెత్తుకొని, ఋషితో "నన్నేలిన స్వామీ! మునీశ్వరా! నీ వడిగిన యర్థమిచ్చుటలో ఆలస్యమైనది. అందుకు అపరాధము చెల్లించవలెను కదా! వీడే రాముడు, వీనితో లక్ష్మణుడును. నీ చేతులతో అందుకొనుము" అనెను.

కౌశికుడు "భళిరా రాజా భళి" అని దశరథుని మెచ్చెను. వశిష్ఠుని నేత్రములు తళతళ మెరిసినవి. రాణులు ముువ్వురు చిరునవ్వు వెన్నెలల గురియించిరి. అంతఃపుర స్త్రీలు అక్షతలు చల్లిరి. ఆకాశము నుండి వీక్షించుచున్న దేవతలు, వానితో పుష్పములు గలపిరి. విశ్వామిత్రుని వెనుక రామలక్ష్మణులు బయలు దేరిరి. కౌశికాగమనము వలన రామతత్త్వము వశిష్ఠ దశరథ కౌసల్యాదులకు వెల్లడియైనది. కౌశికుని 'అహంవేదిత్వము' లోకముల వ్యాపించినది.

**'అహంవేద్మి' సమాప్తము**



# సిద్ధాశ్రమము

'**రం**డు, రండు, ఆలస్యమెందుకు? కన్నులు చెదరు తేజముతో గాధేయుడైన విశ్వామిత్రుడును, అయోధ్యారాజపుత్రులు రామలక్ష్మణులును రాజమహలు నుండి బయలుదేరి వచ్చుచున్నారు. ఆ మహర్షికి ఈ అదృష్టయోగము అనుకొనకుండ పట్టినది. అందులో మనకును భాగము దొరకినది. వారిని దర్శింపరండి. ఇక మనకే కాక, సర్వలోకములకు శాంతి సౌఖ్యములు లభించును, సంతోషముతో రండి. దుష్టనాశనము కొరకును, విశ్వశాంతి కొరకును – ఆ ఋషి మన రాకొమరులను వెంటబెట్టుకొని, ఇటే వచ్చుచున్నాడు. ఈ విధముగా నీ ఋషి విశ్వశ్రేయ కాంక్షి యగుచున్నాడు.

'ఒకప్పుడు అట్టివాడు కాకున్నను, బహుకాలము మనసు పగ్గములను



బిగబట్టి, నిశ్చల బుద్ధితో నే తపస్సు చేసెనో గాని, ఆ పున్నెమిప్పటికి ఫలించినది. ఈ నాడతడు విశ్వమునకు మిత్రుడైనాడు. వీరి పయనము సిద్ధాశ్రమమునకై యుండును. మన ప్రభువును కోరి రామభద్రుని పొందుట యనగా సామాన్య మైన పనియా? సరయూ నదీ నీరముపై నుండి లేచిన కెరటములచే కొట్టబడి చల్లబడిన పిల్లగాలుల వలన నా ఋషి గడ్డము ఊగిసలాడుచున్నది. ఆయన తృప్తిగా చేయుచున్న మందహాసముల కాంతికి వాని మీసములు మరింత తెల్లగా కనిపించుచున్నవి.

'ఆహా రాముడు! పిల్లగాలులకు చెదరి ముంగురులు వాని మొగమున పారాడుచున్నవి. తామరరేకుల వంటి నేత్రములు సిరుల చిందించుచు విశ్వ మోహనముగా నున్నవి. ఆకృతి సంధ్యాకాంతులు రాశి పోసినట్లున్నది. ముని వెంట నడచుచు దర్శనీయుడుగా నున్నాడు. వెనుక నున్న లక్ష్మణుని సువర్ణ దేహచ్ఛాయ యెంత మనోహరముగా నున్నది! ముఖమున మూగిన జుంజురు లను ఒక చేతితో ప్రక్కకు తొలగద్రోయుచు, రెండవదానితో ధనస్సు ధరించి – అన్న పాదచ్ఛాయల వెంట నడచుచున్నాడు.

'ఈ గురు శిష్య సంబంధము చిత్రముగ నున్నది. గురువునకు దాసుడై రాముడు మునివెంట నడువగా, శేషాహి లక్ష్మణునిగా రూపుదాల్చి స్వామి ననుసరించి వచ్చుచున్నట్లున్నదా దృశ్యము. వారు ఋషిశ్రేష్ఠా! మమ్ము నీ దాసులుగా గ్రహింపవే!' యని వెంటపడిరా – యనునట్లున్నది. గాధినందనుడు ముందు నడువగా ముద్దుమొగములతో రాముడు, వాని తమ్ముడు – ప్రకృతి దృశ్యముల జూచుచు వెంట నడచుచుండ – వారి సౌందర్యములు – అయోధ్యా వాసులకు కనులవిందు చేయుచున్నవి.

నగరవీధుల వెంబడి వెళ్ళుచున్న గురుశిష్యులను చూచుటకు వచ్చు తొందరలో పమిటలు జారగా, ముఖములు చెమటలచే తడియగా, అందమైన పిరుదుల భారముచే సన్నని నడుములు అల్లలనాడగా, ధరించిన కాళ్ళ

అందియలు శ్రావ్యముగా ధ్వనులు చేయగా, పురంధ్రీ జనము మేడలపై కెక్కి వివిధములుగా ననసాగిరి.

“మన రాకొామరులు తనను అనుసరించి వచ్చుటకు యీ ముని, అవయవముల బిగబట్టి, శ్వాస బంధించి – తపస్సుతోను, ఉపవాసములతోను నెన్నియో వేల యేండ్లు గడపియుండవలెను. ఎన్నెన్నియో దానములు ధర్మములు చేసియుండవలెను. మరెన్నియో పుణ్యకార్యములు చేసియుండవలెను. మన వశిష్ఠ మౌని చెప్పినది సత్యమే యగును. ఈతడెన్నియో మహామంత్రములతో అస్త్రములు కూర్చి దాచియుంచినాడట. వాటి నన్నిటిని మన రామచంద్రుని కిచ్చుటకే వచ్చెనట. కానిచో తన యజ్ఞభంగము చేయు రక్కసులను హతమార్చుట వానికొక లెక్కలోనిది కాదట!

“అయ్యో! సుకుమారులు సుందరులునైన మన రాచబిడ్డల నిట్లు పాదములు నొవ్వగా నడిపించి తీసుకొనిపోవుచున్నాడే! వీనికిది తగునా? ఈ ముని దర్పముగా తన గడ్డపుకొనలను పైకి దువ్వగానే మన మహారాజు భయపడి, పాదములబడి మ్రొక్కి, మాటాడలేక – పంపుమని యడిగిన వెంటనే – తన బిడ్డలను పంపుటకు ఒప్పుకొని యుండును. కానిచో నీ ఋషివెంట అడవులకు ఏ తండ్రి తన బిడ్డలను పంపును? మూరెడు మీసము, బారెడు గడ్డముతో నీ ముని మన రాజపుత్రుల పాలిటి శనిగ్రహమై దాపురించెనే!

“వీడెంత ఆశాపాతకియో, శీఘ్ర కోపియో వీని గతమే చెప్పును. ఇట్టివాడు ఇంకొకడు కనిపించడు. ఇట్టి వాడు ఇప్పుడొక మునిశ్రేష్ఠునిగా నెంచబడు చున్నాడు. పూర్వ మెన్నివేల యేండ్లో రాచరికము వెలగబెట్టి యుండెనట! ఒక ఆవుకొరకై మన వశిష్ఠ ఋషి నెన్నియో చిక్కుల బెట్టెనట. అటువంటి వాడీనాడు రామచంద్రునికై మన ప్రభువు నెదుట చేయి చాపెననగా – నిందేదియో మర్మము లేదుకదా?

"మన రాజపుత్రులా – కాలుక్రింద మోపి యెరుగని సుకుమారులు. నడువ వలసినదా – ముళ్లు రాళ్లతో నిండిన అడవి బాటల వెంట. ఈ మునియో – ఎన్నియో వేలయేండ్ల నుండి వానివెంట దిరిగి తిరిగి రాటుదేలినవాడు. ముండ్లు మోడులు, రాలు రప్పలు, ఎండలు వానలు, శీతము ఉష్ణములకు అలవాటు పడినవాడు. ఈ మోటువాడు రాచబిడ్డలపై జాలి మమకారము చూపునా? వాటిని కన్నవారియందే గాని – ఇతరులయందు ఎదురుచూడలేము.

"ఈ ముని మాయలమారి. ఏదో పన్నాగముతో వచ్చియుండును. అయినను ఈ బాలురు యజ్ఞ పాయసాన్న మహిమచే కలిగినవారు కావున తలిదండ్రు లీయగలిగిరి. కానిచో తమ కన్న సంతానము నేతలిదండ్రులు మమకారము లేక యీ ముని కర్పించి అడవులపాలు చేయుదురు? 'తమ' యనువారు లేని యీ పసివారి పాటులకు కడుపు తరుగుకొని పోవుచున్నదే!

"కౌశికుడీ పసివారిని అడవులలో నే నదీజలముల ముంచునో? ఏ పడియల నీరు ద్రావించునో? ఏ బట్టల గట్టించునో? ఏ వ్రేళ్లను, దుంపలను, ఆకులను, పచ్చికాయలను దినిపించునో? కానిచో పస్తుల పండబెట్టునో, ఏ మోడులు ముండ్లమీద నడిపించునో. ఏ కటిక నేలలపై పండబెట్టునో? ఇంకను ఏ త్రిప్పల బెట్టునో కదా!

"ఈ సుకుమార సుందర బాలుడా? రాక్షసులను మట్టుపెట్టువాడు? ఈ బాలురా యుద్ధములు చేయువారు? రాజ పరిజనులైన – నిది తగదు – పంప వలదని చెప్పరైరే! రాజైన కాదనక అంగీకరించినాడే! రాణులును మైనపు బొమ్మల వలె మునివెంట వెళ్లు బాలురను జూచియు – చైతన్యహీనలట్లు నిలచినారే!

"మా రాముడు, మా రాముడు అని అహరహము పలవించుచు నెంతయో మమకారము పెంచుకొనిన కైక – వాని ముద్దుముచ్చట లన్నియు తానై తీర్చుకైక – వాని నన్నిటిని త్రెంచుకొని – రాముని వనములకు పంపుచున్నదనగా – నిందేమి యాంతర్యమున్నదో! దీనికి మించిన వింత – రాముని కన్నతల్లి కౌసల్య కోపము తాపము నిరసన లేవియు చూపక – కన్నబిడ్డ నడవులకు

పంపుచున్నది! ఇక సుమిత్రయా? ఆమె ఎటువంటి ప్రేమ వాసనలును సోకని కర్మయోగిని కదా! యన వారి ఆదరాభిమానములకు నోచుకొనని రాఘవులు – అడవులపాలు కాక ఏమగుదురు?

'ఆహా! మన రాజెంత ప్రేమలేనివాడో! పోనీ – తప్పనిసరియై బిడ్డలను ముని వెంట పంపవలసి వచ్చెననుకొన్నను, వారిని రథములపైనో, గుఱ్ఱముల మీదనో, ఏనుగులమీదనో పంపక – అడవిబాటల వెంట కాలినడకను పంపినాడు. రాజునకీ వాహనము లెన్నో యున్నవి కదా! తలచి చూడగా నన్నియు చోద్యములే!

"ఏమమ్మా మీ మాటలు మరింత చోద్యములైయున్నవి. గాలియే ఆహారముగా చిరకాలము తపస్సు చేసిన యీ ఋషి మహత్తు లోకవ్యాప్తమైనది. కొన్నాళ్లు మేనక మాయలో పడినను – ఆ పిమ్మట నిగ్రహము పాటించి బ్రహ్మ ఋషియైన మహాత్మునిపై నిందలు వేయుట మహాపచారము. మీ జాణతనము చాలించుట మేలగును. పాపము మూటగట్టుకొనవద్దమ్మా!

"మునిచంద్రుడు రాజపుత్రులకు దినదిన శుభములు కలిగింతును. పది దినములు నాతో బంపిన చాలును – అనగా మన రాజు వశిష్ఠ గురువర్యునితో నాలోచించెను. అతడు రాజా! విశ్వామిత్రుడు గొప్ప తపోనిధి, సత్వసంపన్నుడు, నీ బిడ్డలకు శ్రేయమగును, పంపుమనగా – గురువాక్యానుసారము పంపెను. ప్రకృతి మాయలో పుట్టిన మన పాపపు కండ్లకు రామతత్త్వము గోచరించునా? ఆ ఋషి త్రికాలవేది యైనందున – బాలుడైనను మన రామునికి రాక్షసులను చంపగల శక్తి కలదని తెలిసినవాడైనందున – రామునకే ప్రమాదము రాదను ధైర్యముతో తీసుకువెళ్లుచున్నాడు.

"యాగానంతరము యజ్ఞరక్ష చేసిన కృతజ్ఞతతో కౌశికుడు సమర్పించు సిరిచేబట్టి రాముడు తిరిగి రావలెను. మనము ముని పంపు ఆ శుభవార్త కెదురు చూతము."

ఇట్లు పురీపురంధ్రులు పలుకు పలుకులు పాముచెవులు గల లక్ష్మణుడు విని, యట్టె నిలువగా, కౌసల్యా సుప్రజారాముడును ఆగి, తన తామరరేకుల వంటి విశాల నేత్రములు ఎత్తిచూచెను. వానిని చూచిన స్త్రీలు వారిపై పూలవాన గురియించిరి. కప్పుర నీరాజనములిచ్చిరి. పేలాలను అక్షతలను విరివిగా జల్లిరి. కన్నుల నానందబాష్పములు జాలువారుచుండగా 'సుఖముగా వెళ్లి శుభముగా తిరిగి రండు' అని ఆశీర్వదించిరి.

కొదమ సింగముల వంటి రామలక్ష్మణులు - మునిని వెంబడించి అయోధ్యానగర పొలిమేర దాటి సరయూ నదీతీరము వెంబడిపోసాగిరి. ఆకాశ సంచారులై దేవతలు స్తోత్రములు చేయగా వినుచు తలలు పైకెత్తి వారిని చూచుచు వెళ్లిరి. ముని వెంబడి బాలకిశోరములు నగుమొగములతో నడచి వచ్చుట జూచిన ఋషిజనులు మనసులలో 'రామయ్యా! రాఘవేంద్రా! నీకు శుభము! లోకములకు క్షేమము కలుగు'నని వారిని దీవించిరి. కౌశికుడు సంతోషముతో మేను మరచి "రామా! జగదభిరామా! జగద్వ్యాపివైన నీవిప్పటికి గదా నాకు చిక్కితివి! ఆహా! నా అదృష్టమిప్పటికి గదా ఫలించినది!

"నేను వేదములు నాల్గింటిని సాంగము ఉపాంగములతో జదివితిని. వేదార్థ సంగ్రహము కావించితిని. వేదాంతులతో నీతత్త్వ చర్చ చేసితిని. ఇన్ని చేసియు నన్నేలిన వీడీ భువిపై జన్మించెనని ఎరుగనైతిని. నా వెనుక వచ్చుచున్న నీవే - నా దైవమవని - శ్రీహరివని - లోకముల సృష్టింపను పెంపను లయింపను సమర్థుడవని తెలియనైతినే. నా తపన యిప్పటికి నెఱవేరినది. నేనిప్పుడు నిశ్చయముగా చెప్పగలిగితిని. నన్ను మించిన ఋషి యీ లోకమున నెందును లేడు. నాలో నీపై దాగియున్న ప్రేమ ఫలించినది. లక్ష్మీరమణా! నారాయణా! దయాసముద్రము నెదలో నింపియున్నవాడా! ఆర్తులను రక్షించువాడా! నీ లీలా వైభవములలో మునిగిన భక్తుల నుద్ధరించువాడా! నీ మాయను నేటికి గదా అధిగమించి నా కన్నులగట్ట జేసితివి.

"రామా నేటికి నీ అవతార రహస్యము తెలిసినది. దానిని హరుడైనను బ్రహ్మయైనను ఎఱుగరు. దశరథునికి తెలియలేదు. ఇహలోక సౌఖ్యములనేగాని నీతత్త్వము తెలియలేదు. వశిష్ఠమునికి కొంత తెలియగలిగెను. నీపై దృష్టి నుంచి నేనెరుగ గలిగితిని. పద్మనేత్రా! జగదాధారా! సముద్ర మంతటి దయకు నిదానమైనవాడా! రాఘవా! రావయ్యా! నావెంట నడచి రావయ్యా! ఇక్ష్వాకు వంశమణీ! క్షత్రియ వంశదీపకా! రావయ్యా! నావెంట నడచి రావయ్యా! దివ్య మహిమ కలవాడా! సద్గుణధామా! ఆశ్రిత కల్పవృక్షమా! రావయ్యా! ఆహా పరమాత్మ నా వెన్నంటి యున్నాడు. ఆహా! ఏమి యీ కౌశికుని భాగ్యము!

"కౌశికా! దేవేంద్రునికి దొరుకని అదృష్టము నీది. బ్రహ్మకు లభించని వాత్సల్యము నీకు లభించినది. రుద్రునకు లభ్యముకాని సేవాభాగ్యము నీది. పరమాత్మ యీ గాధిజుని వెంట నడచు గౌరవపూర్వ మెవనికి కలిగెను? భోగి శయనుడైన శౌరియే రామావతారమెత్తి నన్ను చేరెను గదా! నా తపః కల్పవృక్షము పుష్పించి కాయలుకాచి, పండ్లుపండి – అనుభవమునకు వచ్చెనుకదా!" అని కన్నుల నుండి బాష్పములు ధారలుగట్టి జాలువారుచుండ వెఱ్ఱివానివలె పరువులు పెట్టును. మరల నెమ్మదిగా నడచును. ఒకచో నాగును, ఒకచో కూర్చుండును.

"ఆ భావోద్వేగములో కౌశికుని చేతనున్న యోగదండము జారెను. కమండలము నేలపై బడెను. అయినను వానిని గుర్తింపక మతితప్పిన వాని వలె నేగు మునిశ్రేష్ఠుని విధమును రాముడు గమనించి, పెదవులపై చిరునవ్వు తాండవింప, వానివెనుకనే పరువెత్తెను. "తాతా! ఓ తాతా! మనము పోవలసినది ఇటు, అటు కాదు. ఇటురా! మనదారి యిది. నీ చేదండమును, కమండలమును జారిపోయినవి. పైన ధరించిన కాషాయోత్తరీయము క్రింద పడిపోయినది. ఇదిగో వానిని తెచ్చితిని, తీసుకొనుము" అని చెప్పుచు తన యెదుట నిలచిన రఘురాముని మునిచంద్రుడు చూచి, విస్మయమందెను.

“నాయనా! రఘునందనా! నీవటయ్యా? నా చల్లని తండ్రీ, రారా! నీ ముఖము వాడిపోయినది కదయ్యా! ముంగురులు రేగి ముఖము నాక్రమించినవి. కన్నులు వాడిన కమలములైనవి. అయ్యో! పాదములు కందిపోయెనే! శరీర మంతయు చెమటచే తడిసి ముద్దయైనది. రామయ్యా! ఎందుకురా? ఆ పరుగులు. ఘనచరిత్ర గల మీ సోదరులు నా చెంతనుండ, నా యోగదండ కమండలముల అవసరమేమున్నది. జారిపోయిన పోనిమ్ము. నీవు నాకుండగా వీనితో పనిలేదు కదయ్యా! నిష్ఫలమైన యీ దండము ఇపుడు కఱ్ఱముక్క మాత్రమే కదరా!

“రాఘవా! రాజ్యభారమును మ్రోయలేకను, భార్యాబిడ్డల భారము వహింపలేకయు, పూర్వము తపస్సుకై బయలుదేరితిని. అయినను అచ్చటను నారబట్టల, తపోసాధకములైన దండ కమండలముల, పాదుకల, యీ గడ్డముల బరువు తప్పలేదు. మోసి మోసి విసుగుచెందితిని. ఇక మ్రోయలేనురా! రాజుగా నెన్నియో విహిత కర్మల జేసితిని. యోగమవలంబించితిని. తపోమార్గమున నెంత దవ్వు పయనించితిని. వీనితో నెంతో శ్రమజెందితిని. దాశరథీ! నా పూజలందిన దైవము కరుణించెను. నీవు నా వెంట వచ్చితివి. ఈ భాగ్యము చాలును. వేరు బరువులు వద్దు, నీ సేవ జేసి, చేతులు జోడించి నమస్కరించిన చాలును.”

అని, రాముని కౌగలించుకొని “బాబూ! నేనెంతటి పాపినోయి! చేసిన మేలు మరచి నీకెంత శ్రమ నిచ్చితినిరా! నా కొరకై పర్వులెత్తి వీనిని సేకరించి తెచ్చితివి గదా! సుకుమార సుందరములైన నీ ముఖము కన్నులు నెంతగా వాడిపోయినవో. ఏదీ! నా సామాగ్రి నిటులిమ్ము” అని తీసుకొని, రామచంద్రుని ముఖమున మూగిన ముంగురులను పైకి దువ్వి, శ్రమదీర వాని చెమట బిందువుల దుడిచి, రాముని చంక కెత్తుకొని – తమక మాపజాలక వాని

చెక్కిళ్ల నిటు నటుద్రిప్పుచు, తన ముఖమును రాముని మోముతో జేర్చి నెన్నియో ముద్దుల బెట్టుచుండెను.

ముని గడ్డమును మీసములును గ్రుచ్చుకొని గిలిగింతలు పెట్టుచుండగా రామభద్రుడు కిలకిల నవ్వుచు "తాతయ్యా! నన్ను క్రిందకు దింపుము" అను చున్నను 'ఏవీ నీ బుగ్గల నింకొకమారు చూపరా తండ్రీ!' అనుచు ముద్దాడుచునే యుండెను.

పూర్వము గాధిజుడు ముద్దుల సౌరభమును రుచి చూచియున్నను. ఆ పిమ్మట కొద్దినాళ్లకే నా తీపి వెగటుపుట్టెనట. విమర్శించి చూడగా నవి యొక ముద్దులా? ముద్దులు మూటగట్టు రఘురాముని లేత బుగ్గలపై పెట్టిన ముద్దులు అమృతము క్రిందు చేయునంత మధురముగా నుండెనట. 'ఇన్ని యేండ్లు గాలియే ఆహారముగా తినుచు చేసిన తపోఫలము – నా చిరకాలవాంఛ, నే సముపార్జించిన పుణ్యఫలము, యోగరహస్యము ఇదియే కావచ్చును. నేను తరించితిని" అని ఋషి రామచంద్రుని ముద్దాడుచుండెను.

గలగల శబ్దములతో మణులు మాణిక్యములు రాసులుగా బోసినట్లు, చంద్రుడు తన వెన్నెలల నన్నిటి నిచ్చటనే కురిపించెనా యనునట్లు, కొలని జలముల నిండ తామరలు విరిసినట్లు, పువ్వుల విరజిమ్మినట్లు – రఘురాముడు వాడినను – నవ్వుచునే యుండెను. శ్రీరాముని అట్లు గాధిజుడు ముద్దులచే బాధించుటను మాన్పుటకై లక్ష్మణు డామునియొద్దకు వెళ్లి "తాతా! నాకును ముద్దుల బెట్టవా? ఆలోచించి చూడగా నీకు అన్నమీదనే గాని నాయందు ప్రేమ లేనట్లున్నదిలే" అనగా; ముని "నాయనా! లక్ష్మణా! అదియేమియు లేదురా, తండ్రీ! నాకు నీవును మీయన్న రామన్నయు నొక్కటేరా! తండ్రీ! రారా!" అని రాముని చంక నుండి దింపి లక్ష్మణు నెత్తుకొనెను.

వృద్ధుడు, మునియునైన కౌశికునిపైనే యదృష్ట పవనమో వీచియుండును.

లేకున్న నింతటి భాగ్యము కలుగునా? లక్ష్మణుని కౌగలించి "బంగారు కొండా! ఎండవేడికి ఎట్లైతివో" అని వాని బుగ్గలు నిమురుచు – మమకారము తీరునట్లు, సంతోషము పొంగునట్లు ముద్దాడెను. మరల రామునెత్తుకొని, "రఘువంశ జ్యోతీ! నడచి వచ్చునపుడు దర్భముండ్లు నీ మెత్తని పాదములకు గ్రుచ్చుకొని దబ్బనపు పోటులవలె తీపులబుట్టజేసెనా? అయ్యో! పాదములు పొక్కులెక్కెను గదరా! తండ్రీ! ఇవియే కదా! ఆశ్రితులకు శరణైనవి!

"రాఘవా! ఇవియే పాపసంచయమను నదిని దాటించు తెప్పలు కదా! ఆశ్రయించువారికి కల్పవృక్షము లివియే. అయోధ్యా ప్రజా సమూహమునకు ప్రాణ సమానములివే. ఈ కౌశికుని జీవన ప్రదాతలు నివియే" అనుచు రాముని పాదము లొత్తబోయెను. రాముడు సంభ్రమముతో "తాతా! ఏమి పని యిది? కన్నుల ఆ నీరేమి. నేను నీ రాముడను గానా? కేవలము పాపముల పారద్రోలు శ్రీహరి ననుచున్నావు; నీకేమైన మతిభ్రమ కలుగలేదు కదా! చాలు చాలు. గొప్ప మునివే! నీకేమైన పిచ్చి పట్టలేదు కదా! బాలుడనైన నా పాదము లొత్తెద నందువేమి? మేము నీ వెంబడి వచ్చుటే పెద్ద అపచారమైనది. అయ్యో! నీ మనసీ విధముగా మారిపోయిన దేమయ్యా!" అనెను.

కౌశికుడు "ఏమియు లేదయ్యా! నాయనా! నీ దోషమేమియును లేదు. కాదు, నాకిది యెంతయో ఆనందానుభూతిని కలిగించుచున్నదిరా! ఇది యంతయు నావలన వచ్చిన పొరబాటే. కానిచో, రాజభోగములనుభవించు మిమ్ములను సూదులవలె దర్భమోడులు గ్రుచ్చుకొను దారుల వెంబడి నడిపించి తీసుకొని వచ్చితినే! ఇది నేను చేసిన దోషముకాక మరేమి? నాయనలారా! ఎదుట చూడుడు ఎదుటనొక సరస్సు కలదు కదా! ఇటువంటి పాదములతో నంతవరకు నెట్లు నడువగలరు?" అని రామలక్ష్మణుల నిరువురను చెరియొక చేత నెత్తుకొని నడువసాగెను.

ఆ విధంగా నడచు కౌశికుని ఆకాశమున నిలచియున్న దేవతలు చూచిరి. “ఔరా! ఈ కౌశికుడెంత భాగ్యశాలియో కదా! భగవంతుడీ రీతిగా వీనికి చిక్కెను కదా! భళి! విశ్వామిత్రా! నీ సమానుడీ సృష్టిలో నెవరును లేరు” అని శ్లాఘించిరి. రమాకాంతాపతియైన శ్రీహరి యితర వ్రతము లేవి చేసినను కట్టువడడు. కేవల మాతడు భక్తిభావనకే వశుడు కాగలడు. జగద్భారము వహించు శ్రీమన్నారాయణుడు – ఈ రూపములలో ముని చేతులలో జీలుగు బెండులవలె నగుటలో వింత లేదు కదా. భగవద్విశ్వాసము కలవారికి ఆ పరమాత్మ బరువగునా? నమ్మనివారా భారము వహింప సమర్థులెట్లు కాగలరని పొగడిరి.

“లోకములకు భద్రము కలిగించు రామభద్రా! కౌసల్యాదేవి సద్వ్రతము లెన్నియో చేసి నిన్ను పుత్రునిగా పొందెనయ్యా! ఆమె నీయందు గల పుత్రప్రేమనే విధముగా విడువగలిగెనో? నిన్ను పంపుమని నే నడిగినంతనే ‘నాయనా! మౌనితో వెళ్లుమని పంపినది కదా! ఆమె దీవనలు అమోఘములయ్యా” అనుచు కౌశికుడు రామలక్ష్మణులను, కలువ తామర పూవులంత సులువుగా నెత్తుకొని పోవుచుండెను.

“చక్రవర్తియైన నీ తండ్రి దశరథుడు ప్రజ్ఞాశాలియైనను, రామచంద్రా! నీ మహత్త్వము తెలియడయ్యెను. పుత్రానురాగము వదులడయ్యెను. రామా! నీ కన్నులు తామర మొగ్గలట, అవి ఉదయముతో తెరచుకొని అస్తమయముతో ముకుళించుకొని పోయెడివట. కనుక రాత్రించరులైన రాక్షసుల రాకపోకలు వారి దుశ్చేష్టలు చూడలేవట. బాలప్రాయము వదులని నీవు క్రూరరక్కసులతో పోరజాలవట.

“రామయ్యా! బహు సుందరమై, వర్ణింపదగినదై, ప్రేమను వర్షించునదై, మనస్సుకు ఆనందము కలిగించునదైన నీ నామము – రాఘవా! కాకుత్స్థా, నీలమేఘశ్యామా, సుగుణఖనీ, గుణరాశీ, నిత్యపదము నిచ్చునదై ఎంత తియ్యనిదిరా తండ్రీ! నీలమేఘ కాంతితో నొప్పు రాఘవా! నీ తండ్రి దశరథేశు

డు, అరువది వేలయేండ్ల తరువాత, పుత్రులు లేరను చింతతో పుత్రకామేష్టి యను దివ్యక్రతుము చేయగా నీవు లభించితివి. ఇక నేనో? అనేక వేల యేండ్లు కోపము, కోరికలు, ఆహారము, నిద్ర, నీరు వదలి తపస్సు చేసితిని. నీ కటాక్ష వీక్షణము నాపై ప్రసరించినది.

"రామభద్రా! నీ తల్లులు ముమ్వరును మతిమంతులే. నీ మాత కోసలరాజ పుత్రి నీయందెంతో ప్రేమ కలదే. నీ సవతితల్లియైన కైకమ్మ మహానుభావురాలు, ఎన్నడైనను ఆమె యాజ్ఞ ననుసరించియే వర్తించవయ్యా! అది మొదట దక్షిణతీరము. ఇది పుణ్యస్థలము" అని కౌశికుడు వారినచ్చట దింపి "మీకు ఆకలిదప్పికలను తీర్చునది, శ్రమను తొలగించునది, కోర్కెలను సిద్ధింపజేయునదియునైన మంత్రములుపదేశించెదను. రామచంద్రా! నదీజలముల స్నానముచేసి, ఆచమించి రావయ్యా! ఆలసించకుము" అనెను.

"గురువులు అకారణముగనే ప్రసన్నులగుదురు. శిష్య సంఘమునకు శుభములు కలుగజేయుదురు. ఆచార్య కటాక్షమనగా నిదియే" అని సంతోషముతో రాముడు నదీస్నానము జేసి, ఆచమనము జేసి, చేతులు జోడించి, శిరస్సు కొంచెము వంచి నిలచి, గురువర్యా! మంత్రము ప్రసాదించుము" అని ప్రార్థించెను. కౌశికుడు తెలివి తెచ్చుకొని "అయ్యో! ఎంత మతిహీనుడను. రామా! నీవు పరమాత్మవనియు, దేవదేవుడవనియు తెలిసినను ఆనాడు సభలో పెద్దల సమక్షమున నిన్ను శిష్యునిగా తలచితిని. నా జ్ఞానమేమైనదో కాని నేడు నీకు మంత్రోపదేశము చేయదలచితినే!" అని ఆశ్చర్యముతో కూడిన చిరునవ్వు కలవాడై "రామా! నీవు అఖిల లోకములకు ప్రభువువు. అన్ని మంత్రములు నిన్నే స్తుతించుచున్నవి. మంత్రములన్నిటికిని అధిదేవతవు నీవే. అటువంటి నిన్ను సద్భావనలేక, మంత్రము తెలిసినవాడనను అహంకారముతో, మంత్రోపదేశము చేయుదును రమ్మంటిని. పెద్దలు విన్న నవ్విపోరా?

"రఘురామా! ఎవరు నవ్వినను నవ్వనీ. నీవును మనసున నవ్వుకొనుము. నాకొక పిచ్చి యున్నది. అది నాకు ఆనందము. రావయ్యా! రామయ్యా! కొన్ని రహస్య విద్యలను సంగ్రహించి, నీకొరకై రాసులుపోసి యుంచితిని. వానిని నీకిచ్చునప్పుడు నవ్వుకొనినను పుచ్చుకొనవయ్యా! నీవఖిల మంత్రములు తెలిసినవాడవైనను, నిజముగా ఆకలి దప్పికలు లేనివాడవైనను, శ్రమయనునది యెరుగనివాడవే యైనను – దీవించి పెద్దలైన వారుపదేశించినచో నా విద్యలు తీగలుప్రాకి, పూలుపూచి, కాయలై, పండ్లై, ప్రియశిష్య సంతతికి మధురము లగునురా!

"రామా! పూర్వము నేను అహంభావముతో నేర్చిన విద్యలన్నియును, స్వలాభమను సర్పము మ్రింగివేసినది. అంతులేని శ్రమయే దక్కినది. ఫలితము లేనందున ఆయాసము నందితిని. నేటికి కదా! వాటినన్నిటిని రామార్పణము చేయనుంటిని. పరులకీయని విద్యలకు ఫలమేమి యుండునురా! నాయనా! నా కొరకై శ్రమించి యింత దూరము వచ్చితివి. సుకుమారమైన నీవు ఇట్లైతివి. నీ యాకలి జూడగా నా మనస్సునందు దుఃఖము పొంగి పొరలివచ్చుచున్నది. దానిని గమనించియే ఆకలిని దప్పికను శ్రమను పోగొట్టగలిగిన మంత్రములు – బల అతిబలలను ఈయదలచితిని. వీనిని గ్రహించరా తండ్రీ!

మునిచంద్రుడైన విశ్వామిత్రుడు తనంతతానై బల, అతిబలల నుపదేశించగా శిష్య సహజమగు శ్రద్ధాభక్తులతో నా మంత్రములను పొంది, రామచంద్రుడు "తమ్ముడా! రమ్ము రమ్ము! మౌనిచే నుపదేశించబడిన మంత్రము నీ కుపదేశించెదను" అని వానిని తమ్ముడు లక్ష్మణునుకి ఉపదేశించెను. ఉపదేశమాత్రముచే నవి శుభకరమై వాని ప్రభావమున రామలక్ష్మణులు విగతశ్రములు ఉత్సాహులు, ఆకలిదప్పులు తీరినవారునై ప్రకాశించిరి. వారి సౌందర్యములు యినుమడించెను. శరత్పూర్ణిమ నాటి చంద్రబింబమువలె భాసించిరి. ధీమంతులైన

గురువులు శ్రద్ధాభక్తులు గల శిష్యుల కిచ్చిన విద్యలు ఆధ్యాత్మిక తేజమును కలిగించుట శాస్త్ర ప్రసిద్ధమే కదా!

"రాఘవా! రాత్రి చాల ప్రొద్దుగడచినది. సరయూ నదీ తీరమున నీ తృణశయ్యపై తెలవారు వరకు శయనించుమురా. సుమిత్రానంద వర్ధనా, లక్ష్మణా! నీవును మీయన్న రామచంద్రుని వద్దనే శయనించవయ్యా! మీరు నిద్ర చెందువరకు మీకు జోలపాటలు పాడెదను. లక్ష్మణుడు చెంత నుండ నంతవరకు రాముడు ఏవిధముగా నిద్రించగలడు? రాముని కీయేర్పాటు ఎట్లు తోచినదో? తెలియక చింతించు లక్ష్మణుని విశ్వామిత్రుడు "లక్ష్మణా! నిద్రపోవుట కెందుకు ఆలస్యము" అని హెచ్చరించెను.

రాముడు లక్ష్మణుడు దర్భశయ్యలందు నిద్రించుచున్నవారివలె పరుండిరి. ముని కన్నుల నుండి బాష్పములు కారుచుండ అర్ధరాత్రము వరకు వారిద్దరను ముద్దాడుచు, తన తల వారి పాదముల కానించుచు "తరించితినిరా! రామా!" యని పొంగిపోవుచుండెను. "జోజో, దశరథ రాకుమారా, రామా! జోజో, సర్వలోక శుభంకరా! జో; తపోధనులచే పూజింపబడువాడా! జోజో; స్తోత్ర మాత్రమునకే ఆనందించువాడా! జోజో; లోకశాంతిదాయకా! జోజో; నీ నాభి నుండి జన్మించిన బ్రహ్మచే నుతింపబడువాడా! జోజో; సర్వవిద్యలకు నిలయమైన వాడా! జోజో; దుష్టసంహారా! జోజో; శిష్టరక్షకా! జోజో; రఘునాధా! జోజో; నిద్రించవయ్యా! జోజో; రామచంద్రా నిద్రించవయ్యా! జో; సుగుణములకు నిధానమైనవాడా! జో; నీలోత్పలతనూవైభవా! జో; సర్వలోకములను మోహపెట్టు వాడా! జో; భక్తజనుల కోరికల దీర్చు పారిజాతమా! జో; రామచంద్రా, నిద్రించవయ్యా! తండ్రీ!" అనుచు నిద్రకు లొంగినవాడై కౌశికుడు కటిక నేలపై వ్రాలెను.

ఆ ముని ముఖమునందు అరమూసినయున్న నేత్రములందు ఏదో మందహాస రేఖతో కూడిన తృప్తి తొంగిచూచుచుండుటను – దర్భలపై నుండి

లేచిన రాముడు దర్శించెను. ఆ ముని యోగదండము, కమండలము, పైన ధరించిన శాలువయు జారి అస్తవ్యస్తముగా పడియుండుటను రాఘవుడు వీక్షించెను. చంద్రబింబము వంటి ముఖముపై తుమ్మెదలవలె నల్లని ముంగురులు కదలుచుండగా రాముడు సద్భక్తితోను, ప్రేమతోను, అభిమానముతోను మునిపాదములను పట్టి యొత్తుచుండ, లక్ష్మణుడును లేచివచ్చి "అన్నా! ఈ ముని శ్రమచే అలసి, కటిక నేలపై సహితము శరీరము మరచి నిద్రించు చున్నాడు" అనెను.

రామలక్ష్మణు లిరువురు ముని పాదములబట్టి పిసుకుచుండగా నంతరిక్షమున దేవతలు "ఔరా! ఏమి యీ ముని భాగ్యము! దేవదేవునిచేతనే సేవలు పొందుచుండెను కదా"యని తమ యానంద సూచకముగా వారిపై కుసుమ వృష్టి గురియించిరి.

రాముడు "లక్ష్మణా! ఈ విధముగా ఆదమరచి యీ మునీంద్రుడు నిద్రించి ఎంత కాలమైనదో? వేలాది సంవత్సరములు అన్నము నీరుమాని గాలి పీల్చక తపోనిష్ఠలో నుండి అందరును 'ఆహా' యనునట్లు బ్రాహ్మణత్వము నందెను. తాను రాజుగా నుండి పరాక్రమముతో శత్రువులనెల్ల నిర్జించి, తిరుగులేక దినదినము వైభవము లనుభవించెను. శత్రువులు లేనివాడయ్యెను. రాజులలో మేటి యనిపించుకొనెను. అపరబ్రహ్మగా బ్రహ్మతేజమును ప్రకాశింపజేయు చున్నాడు. గురుశ్రేష్ఠుడైన యీ మహాత్ముని క్షాత్ర బ్రాహ్మణ తేజము లెంతటి మహనీయములో గుర్తించితివా?

"ఇట్టి సద్గుణరాశి, మహాత్ముడు, మనకు గురువుగా దొరకుట చిత్రము. సృష్టిలోనిది అపూర్వము. క్షాత్రబలము నిరర్థకమని స్వానుభవముతో తెలుసుకుని, దానిని వదలి, బ్రహ్మతేజోబలము సాధించుటలో కృతార్థుడైన యీతని సాటియెవరు? ఇట్టి బ్రహ్మతేజోబల సంపద నందిన మహాత్ముడు గురువగుట మన యదృష్టము. తమ్ముడా! శ్రేష్ఠమైన గురుభక్తిచే శిష్యునకు సకల విద్యలును

ఫలితమునకు వచ్చును. గురువులు ప్రేమతో విద్యలు నేర్పుదురు. వారు కృపాళు వులు. గురుకృప యెంతయున్నను, గురుసేవ వలననే శిష్యుని విద్యాపటిమ వృద్ధిచెందును అని చెప్పుట విన్నావా?

"గురువునందు చూపు భక్తిశ్రద్ధలచేత శిష్యుని విద్యలు ఫలితమునకు వచ్చును. మన తండ్రి దుఃఖించుచున్నను, ఈ గురుశ్రేష్ఠుని సేవించవలెనను ఆకాంక్షచేతనే దానిని నిగ్రహించి వచ్చితిని. సపర్యలు చేసిననే విద్యలు ఫలించును. విద్య ఫలితమును పొందుటకు ఇదియే మార్గము. మనము గురువు ననుసరించి రాకున్న విద్యాఫలము లభించెడిదా?

"లక్ష్మణా! ఎన్ని విద్యలు నేర్చినను శిష్యుడు గురువు యెడల లక్ష్యముంచని యెడల, నవి యన్నియు వృధాయైపోవును. పరికించి చూడగా శిష్యుడు శ్రేష్ఠులైన గురువులయందు స్థిరముగా భక్తిశ్రద్ధలు కలిగియున్ననే వాడు నేర్చిన విద్యలు ప్రకాశించును. వేదాంత రహస్యమిదే.

"లక్ష్మణా! ఎన్ని విద్యలు నేర్చినను శిష్యుడు గురువు యెడల లక్ష్యముంచని యెడల, నవి యన్నియు వృధా యైపోవును. పరికించి చూడగా శిష్యుడు శ్రేష్ఠులైన గురువులయందు స్థిరముగా భక్తిశ్రద్ధలు కలిగియున్ననే వాడు నేర్చిన విద్యలు ప్రకాశించును. వేదాంత రహస్యమిదే. గురువుల దయా విశేషము తనపై పారినను లేకున్నను శిష్యుడు – గురువును వదులక, వారియందు నమ్మకముంచి యున్నచో, భక్తితో సేవించినచో – విద్యాఫలము కరతలామలకము వలె పూర్తిగా దర్శనమిచ్చును. గురుభక్తిని మించిన శ్రేష్ఠతర మంత్ర మింకొకటి లేదు.

"తమ్ముడా! ఇది శయనించుటకు దగిన చోటు కాదంటివి. హంసతూలికా తల్పముల దెబ్బ శయనించుటకై వేయుటకిది మహారాజ భవనము కాదు కదా! మనకు తగిన ప్రక్క యిదే. గురువుల వెనుక నుండి సేవజేయు శిష్యులకిదియే తగిన తల్పము. గురువుల సేవింప దరిజేరిన శిష్యులకు సుఖములయం దాశ యుండరాదురా!"

రామలక్ష్మణులు గురుపాదసేవ చేయుచు, ముచ్చటించు కొనుచుండగా తెల్లవారనున్నదని తెలుపు వేగుచుక్క పొడిచినది. వారు చెదరిన ముని జడలను సవరించి, గురు శరీరమున కంటిన ధూళి దులిపి, పాదుకల నాముని పాదముల వద్దనుంచి, ఆ సమీపమున తాము శయనించిరి. లోకప్రసిద్ధి కల సరయూ నదిలోనున్న తామరల నుండి చల్లని ప్రభాత వాయువులు పరిమళములను తెచ్చు విన్యాసములతో – ముని మూసిన కన్నుల దెరచెను. వానికి అరుణోదయ కాంతిరేఖలు కనిపించగా లేచి కూర్చుండెను.

పూర్వదిక్కున పర్వత శిఖరములందు ఉషోదయకాంతి దోబూచులాడు చుండెను. పద్మపరిమళములు అలలు అలలుగా వచ్చి తాకినవి. ఆకాశమున నక్షత్రకాంతులు వెలవెలబోవుచున్నవి. కోళ్లు నిద్రలెండని మానవులను హెచ్చరించుటకో యనునట్లు కూయసాగినవి. తెలవారినదని ముని లేచి, సూర్యవంశములో పుట్టిన రాకుమారులను నిద్ర లేపుటకై వారి యొద్ద నిలిచెను. రాముని నీలకాంతి లక్ష్మణుని స్వర్ణకాంతితో నందముగా మిళితమైన కొత్త వర్ణ శోభను చూచి అట్టె నిలచిపోయెను. "ఆహా! ఏమి వీరి సౌందర్యశోభ" అని ఆశ్చర్యపడెను.

"రామయ్యా! లేవయ్యా, తెల్లవారినదయ్యా! తూర్పున సూర్యోదయమైనది. కుమారా! లేవయ్యా! కౌసల్యా సతికి ఆనందము కల్గించువాడా! ఆమె సత్సంతానమా! దైవసంబంధ కార్యములు నెరవేర్ప వేళాయెనురా తండ్రీ!" అని కౌశికముని పిలువగా రాముడు చిరునవ్వుతో సిరులు వెదజల్లుచు నిద్రలేచెను. తామరలు వికసించినట్లు తన విశాలనేత్రముల విప్పి చూచెను. ఇప్పటి ఈ అద్భుత దృశ్యమును చూచి తీరవలెనేగాని వర్ణింపతరము కాదు – అని మునిశ్రేష్ఠుడు తలచెను. సంధ్యాదులు ముగించి వారు ప్రయాణము సాగించిరి.

రామభద్రా! కామాశ్రమ మిదియేనయ్యా! పూర్వము ముక్కంటి తన మూడవ

నేత్రాగ్నితో మన్మథుని దహించెను. సరయూనది మూడు పాయలును సంగమించిన దిక్కడనే. రామా! మలద కరూశ రాజ్యములివి. ఇంద్రుడు వృత్రాసురుని వధించుటచే కలిగిన బ్రహ్మహత్యా దోషము వలననైన శరీర మలమును విడినచోటు అగుటచే నీ పేరు కలిగినది. రామచంద్రా! ఈ రాత్రి ముని సంఘముతో కలసి యిచట విశ్రమింతము. నీ వీచోట విశ్రమించుదువేని, ఇచటి గొప్ప సరస్సులు తిన్ననైన మార్గములు మహాత్ములు నివసింపదగిన ఆశ్రమములు, జంతువులు తీవలు వృక్షములు మౌనులు పవిత్రులగుదురు. ఈ దేశములు నివాసయోగ్యములు జనసాంద్రములు కాగలవు.

"రామా! అదే, గొప్ప భయమును కలిగించు అరణ్యము. నా ఆశ్రమమున కీయడవి నుండియే పోవలెను. నీ మనస్సు చెదరదు కదా! నీవు భయపడవు కదా! పోనీ, తరువాత చెప్పెదనులే – అదేనయ్యా! నా నోటితో దాని మాట చెప్పుటకే భయమగుచున్నదిరా. అది యొక పెద్ద పిశాచి. కోరిన రూపము ధరించగలది. ఆ యక్షిణి వేయి యేనుగుల బలము కలదయ్యా. వేరొకదారి లేక నిన్నీ దారిని తెచ్చితినిరా! దాని కథ తరువాత జెప్పెదను. రారా తండ్రీ! శ్రీరామరక్ష! బాబూ! తాటకరా అది. నీకు క్షేమమగు గాక!

"నాయనా! చెడు పలుకులు నా నోట జెప్పవలసి వచ్చెను కదా! బాబూ! జడుసుకొంటివా? భయము పోవుటకు మంత్రము పెట్టెదనులే, రమ్ము" అని పిలచుచుండగా ప్రక్కనే నిలచి లక్ష్మణుడు నవ్వుచు "తాతా! రాముడు దేవుడనుచుందువు కదా! నీవు ధైర్యముగా నుండక భయపడెదవే. నీ మనస్సు నందేమైన భ్రమ కలిగినదా? పిచ్చియా? లేక మనఃప్రకోపమా? లేక స్వతహాగా నున్న ఉద్రేకమా! వేదాంత తత్త్వము లోతుగా తెలుసుకొనలేని లోకములో విషయ సుఖముల యందున్న భ్రాంతియా ఇదేమి" అనెను.

విశ్వామిత్రుడు చిన్నగా నవ్వుచు, "లక్ష్మణా! ఇంతయని చెప్పలేని, మనసు నందలి ఆలోచనా ప్రభావమురా ఇది. మీయన్న దేవుడని తెలిసియుండియు –

ధైర్యము వహించలేక – పాడుబుద్ధితో సంశయించితిని. దానితో "రామా, నీకు శుభమంటిని. నిజమును తరచి చూచినచో పొరబడినట్లు తోచుచున్నదిరా. బాబూ! దైవమును యేవిధమైన కోరికలను కోరుట పాపమని సంశయించి శుభములు కలుగవలెనంటిని. కాని, జ్ఞానులు సత్పురుషులు తత్త్వజ్ఞానముచేత వేదాంత తత్త్వ సారమెరిగినవారు, భగవత్సేవ చేయు విధమిదియని చెప్పుటచేత, స్వామికి మంగళాశాసన మంటినిరా!"

"మానవులు తెలియక శ్రీహరిని కోరికలు కోరుటకంటె – తెలిసి శ్రీహరికి భద్రమని కోరుట మనస్సునకు తృప్తిరా! ఈ రహస్య మెరిగి దేనినైనను పుచ్చుకొనుటకంటె ఇచ్చుటలోనే అధికానందమున్నదిరా! తండ్రీ! కోరదగని పురుషార్థములు కోరక, సంయమనము పాటించు శిష్యుడు రక్షింపబడును. శ్రీహరియే సర్వరక్షకుడని లక్ష్మీవల్లభుడే సర్వులకు శుభకారకుడని యెరిగి మంగళా శాసనము చేయుటయే సర్వోత్తమమని మన పూర్వాచార్యులు భావించిరయ్యా! ప్రేమతో కార్యముల నాచరించుమని చెప్పిరయ్యా. అట్టి వివేక సంపన్నతయే ప్రపన్నతరా, తండ్రీ! అట్టి వారి చరిత్రలు భిన్నముగా నుండునురా, లక్ష్మణా!

"నీవేమైన అనుకొనుము, నాకు అటువంటి చాదస్తమున్నది. సూర్య పరంపరలో, ఇక్ష్వాకు వంశమందు దైవమే రాముడుగా జన్మించెనని ఎరిగినవాడను కనుక, నీకొరకుగాని, నాకొరకుగాని యే పురుషార్థములు కోరక, నేనార్జించిన వన్నియు వానికి సమర్పింప పూనుకొంటిని. ఇట్లే అందరును అన్నియు రామార్పణము చేయవలెనని తెలియబరచుటయే నా లక్ష్యమురా తండ్రీ! రామచంద్రా! లోకక్షేమమును శుభమును కాంక్షించి నీకొరకు అయోధ్య వచ్చి, నిన్నిచ్చుటికి తెచ్చితినే గాని, నాకొరకేమియు అక్కరలేదు. నీ మూలముగా నీ భయంకర రాక్షసియైన తాటక పీడ లోకమునకు వదలిపోవలెను. నీచేతనే

తాటక చంపబడవలెను. గోబ్రాహ్మణ సంతతుల భయము తీరిపోవలెను. వారు సుఖముగా నుండవలెను.

గురు వచనము విని, రాముడు వెంటనే తన వింటి నారి మ్రోగించెను. బ్రహ్మాండము పగిలెనా? అన్నంత ధ్వని నలుదిక్కుల వ్యాపించెను. దానిని వినిన తాటక రక్తమాంసముల ముందుకు చిమ్ముచు వచ్చినది. ముని "బాబో, ఇది మీదకు దుముకును' అనుచు దూరముగా తొలగెను. రాముడు "తాతా! స్త్రీ హత్యాపాతకము కలుగునేమో! ముందుగా ఆడుదానిని చంపుటకు మనసు ఒప్పుటలేదు" అనెను. కౌశికుడు "నాయనా, నీ సందేహము ఆ తరువాత నేను తీర్చెదను. అయినను నీకు సందేహమెందుకు? బాబూ! ఇది యజ్ఞములను పాడుచేయునదిరా! రామా! దీని చేష్టలు మాన్పింపరా" అనెను.

రాముడు "ఏమి? ఇది యజ్ఞ విరోధియా? దీనిపై దయ తగదు" అని పూర్వ వ్యామోహము వదలి, ధనస్సు నందు బాణము సంధించి, సూటిగా నా రాక్షసిపై విడిచెను. అది తాటకాహృదయమును ఛేదించెను. అది క్రింద పడుచు, "రామా! ఈ విధముగా తన తల్లి సంహరింపబడుటను మారీచుడు సహింపడని యెరుగుము. నీపై క్రోధము వహింపక మానడు సుమా! నిన్ను దుఃఖపడచేయక మానడు" అనుచు చచ్చెను. తాటక వధ చూచి, కౌశికుడు "రామా! నాపాలిటి కల్పవృక్షమా! ఆశ్రిత చింతామణీ, రఘునాయకా! యజ్ఞభంజకు లెవరైన నీకు శత్రువులేరా! వారు చంపదగినవారే. తండ్రీ! నీవే, నా క్రతు రక్షకుడవయ్యా! నాకు వరమిచ్చిన దాతవురా! ఇదిగో నా చేయి చాచితిని. నీవు చేసిన స్త్రీ వధ వలన కలుగు పాతకమును నాకు దానమీయవయ్యా!"

"రఘువంశ దీపకా! నిజము దాచినను దాగదు. నీవు మానవునిగా జన్మించి ఎంతగా నటించుచున్నను – తాటక వధ మూలమున – నీ దైవశక్తి యెంతటిదో, నీ అవతారతత్త్వమేమో పూర్తిగా తెలియుచున్నది కదయ్యా! నీయందపచారములు సల్పు దోషులైన దానవుల సంహారమే అదియని వెల్లడి చేసితివి" అని

సంతోషముతో కౌగలించి, ముద్దాడి, "నాయనా! నీ వొనర్చిన తాటకా సంహార కార్యము వలన నేడీ యరణ్యము పవిత్రమైనది. కనుక మనమీ రాత్రి యిచటనే ఆగి నిద్రించినచో జనులెల్లరు నీ యడవి నిరుపద్రవమైనదని నమ్ముదురు. నివాస యోగ్యమని వత్తురయ్యా."

"కాకుస్థ వంశరత్నమా! అటు చూడుము, వేల్పులాకాశమున నిలచి నీకు సర్వమంగళములు కోరుచున్నారు. నీకు సర్వాస్త్రము లొసగుమని నాకు అనుజ్ఞ నిచ్చుచున్నారు. దానినిప్పుడే నెరవేర్పవలెను. రావయ్యా" అని రాముని చేరబిలిచెను. వానికి అన్ని అస్త్రముల ప్రయోగ మంత్రములను ఉపదేశించెను. రాముడు వానిని పొంది "గురుశ్రేష్ఠా! నీవు సమంత్రకముగ అస్త్రములిచ్చితివి. వానిని నా మనస్సులో నిలిపితిని. ఉపసంహార క్రియను కూడ ఉపదేశింపవే" అని ప్రార్థించెను. ముని ఆశ్చర్యము పొంది, "ఆహా ఈతడు ప్రయోగ ఉపసంహార క్రియలు రెండును తెలిసిన వాడని ఊహించలేకపోయితినే" అనుకొనెను.

"రామచంద్రా! నీకీ అస్త్రములన్నియును తెలిసినవే. అయినను నీకు వీనిని ఉపదేశించు భాగ్యమును కలుగజేసితివి. ధన్యుని జేసితివి. నన్ను మన్నింపుము. తండ్రీ! నీ మాయ యను వలలో చిక్కితిని. నీకు మంత్రోపదేశము చేయ దలచితిని. అందుకు సిగ్గగుచున్నదిరా! సర్వశ్రేష్ఠ మంత్రముల రూపమే నీవు. ఆ మంత్రముల అధిష్ఠాన దైవమువు. వాని నుపదేశించు ఆచార్యుడవు నీవే. మంత్రము లెరిగిన శ్రేష్ఠుడవు, మంత్రముగా నారాధింపబడు దేవతవు నీవే నని తలచక – నీ మాయలోబడి – నీకే మంత్రోపదేశమొనర్ప సిద్ధమైతిని కదా! బాబూ! నన్ను క్షమింపరా!

"రాఘవా! నీ వాత్సల్య మిటులనే ఉండనీవయ్యా! నీ అవతార రహస్యము వెల్లడి కారాదు సుమా! అజ్ఞానులు ఈర్ష్యాపరులు దృష్టి బెట్టగలరు" అని

దుర్భేధ్యమైన ఉపసంహార మంత్రములను - అట్లే - మంత్రార్థములను సాంగోపాంగముగా రామార్పణము గావించెను. వారు పయనము కొనసాగించిరి.

"రామా! విష్ణువు కొంతకాలము తపస్సు చేసిన సిద్ధాశ్రమమిది. ఆ పిమ్మట అతడే వామనుడై జన్మించి - దీనికి పూర్వఖ్యాతిని సంపాదించెను. కశ్యపుడు సతీసహితుడై శ్రీహరి నారాధించు వ్రతమిచటనే చేసెను. ఇట్లు మహామహు లెందరో తపోవ్రతాదు లెన్నియో చేసి తమ కోర్కెలు సిద్ధింప జేసుకొనిన యాశ్రమ మగుటచే నిది సిద్ధాశ్రమ మను సార్థకనామము పొందినది. ఇది భగవంతునకు ప్రీతిపాత్రమైన చోటైనందున - ఇచట నివశించుటే కర్తవ్యమని, ఇచటనే నా తపస్సు సిద్ధిపొందునని - నేనును యిచటనే నివసించు చుంటినిరా!

"పూర్వము ప్రహ్లాదుని మనుమడైన బలి బలపరాక్రమవంతుడై, రాక్షస వైరియైన యింద్రుని స్వర్గము నుండి తరిమివేసి - తానా స్వర్గపీఠ మెక్కెను. తన దాతృత్వముచే లోకములందు దారిద్ర్యమును రూపుమాపెను. ధర్మబుద్ధితో నతడొక క్రతువు జేయబూనెను." ఋషి చెప్పునది విని రాముడిట్లు ప్రశ్నించెను.. "గురువర్యా! బలి రాక్షసుడు కదా! అతడు యజ్ఞము చేసెనా?" ముని "ఔను. బలి దానవుడైనను విష్ణుభక్తుడు. కనుక హరిప్రీతికై జన్నము చేసెను. కమలాక్షుడైన హరి, లక్ష్మిని హృదయమున ధరించియున్నను - వామనుడై వచ్చి బలిని దానమిమ్మని యాచించెనయ్యా!"

"బలి నిశ్చయముగా హరిభక్తుడే. ప్రహ్లాద సంబంధియే. విష్ణుభక్త పరంపరకు చెందినవాడే. ఐనను దానవ వంశాచారముగా దైవభక్తులైన దేవతలతో విరోధించి సర్గరాజ్యమును సంపాదించెను. దేవాసురు లిరువురును శ్రీహరి సంతానమే. వారొకరొకరితో కలహించి - ఒకరి సంపదలు మరొకరు సంపాదించవలెనని పోరగా - జగత్పితయైన హరి - వారిని మురిపించి - ఆ సంపదను తానే

స్వీకరించి – వారి పోరాటములను మాన్పించును.

“బలి త్యాగ గుణము కలవాడు. అందరిని మెప్పించినవాడు. అతని యజ్ఞ కాలమునకు శౌరి వామనుడై యీ చోటుననే తపస్సు చేయుచుండెనయ్యా! అందుచేతనే యీ చోటు పవిత్రమైనది. ప్రసిద్ధి కలదియును. ఒకరిని చేయి చాచి యాచించుట నీచకార్యము – అనువారు – తెలిసియు, తెలియని వారే. యాచనయే నీచమైనచో – వామనుడైన శ్రీహరి ఆ పనిని ఎందుకు చేసెను? పరుల శ్రేయము కోరువారు యాచించుట త్యాగశీలత చేతనేనయ్యా! కనుకనే దాతల దానగుణమునకు వినియోగము కలుగుచున్నది. సంపద అర్హులకు చెందుచున్నది.

“త్యాగబుద్ధిలేని అధముడిచ్చినది హెచ్చేయైనను దానికంటె త్యాగి యిచ్చిన అల్పమైనను సంతోషము కలిగించగలదు. త్యాగశీలి ఎంతయో యిచ్చినను – అయ్యో, ఇంతకంటె యివ్వజాలకపోతినే యని చింతించుచు ఇచ్చును. లోభియైన వాడియ్యనే ఐయ్యడు. ఏ కొంచెమో ఇచ్చినను – ఆ పిమ్మట – ఇచ్చితినే యని దుఃఖించును.

“రామా! ధర్మబుద్ధి గల గృహస్తు నొద్దకు యోగులు సాధులు మునులు బ్రహ్మచారులు యతులు అభ్యాగతులు కవులు మార్గస్తులు మొదలగువారు వచ్చుచుందురు. గృహ యజమాని వారిని ఆదరించి పూజించును. దీనిని మించిన యాగమింకొకటి లేదయ్యా! రాఘవా! మీ పూర్వులందరు గొప్ప త్యాగమూర్తులుగా పేరుపొందిరి. సాటిలేనివారని స్తుతింపబడిరి. నేనది యెరిగియే – నిన్ను తీసుకొనివచ్చుటకై – మీ తండ్రి దశరథ మహారాజు నొద్ద చేజాచి యాచించితిని. మాయాప్రకృతికి లోనైన లోకులు దీని రహస్య మెరుగలేని వారు. ప్రజ్ఞావంతులు మాత్రమే దీనినెరుగ గలరు.

“లక్ష్మి సంపన్నుడైన గొప్ప త్యాగ గుణము కల మహానుభావుడు బలి.

దాని వలననే అతడు తన విరోధులగు దేవతలకు నిలయమగు స్వర్గమునను కీర్తింపబడెను. ఈ త్యాగబుద్ధి వజ్రాయుధ ధారియైన దేవేంద్రునికి కలదా? బలి వలె పొగడబడు కీర్తి నాతడు పొందగలిగెనా? అందువలన నాతడు స్వర్గ పీఠమున కర్హుడు కాడని - బలి వానిని తొలగించెను. బలి అంతటివాడు. కాని శ్రీహరి యిచ్చిన యెవరి రాజ్యములు వారేలుకొనుచు నుండనీక, బలి ఇంద్రుని తొలగించెను. విశ్వశాసనకర్త శ్రీహరియే. ఆ భారము బలియేల గ్రహింపవలెను? అయినను బలి గొప్పతనమును గుర్తించియే హరి వాని తలపై తన కోమల పాదమునుంచి తరింపజేసెను. సంతానము నెవరి తావులవారి నుంచెను. బలి దాతృత్వపాశమును గట్టిగా జుట్టి పరమపదమీయ గల హరిని తనను కరుణించునట్లు తన చెంతకు లాగగలిగెను. నాయనా! రామా! వాని దెంత అదృష్టమో కదా!

"శౌరి, పరిమళముల వెదజల్లు తన పాదము బలినెత్తిన బెట్టుట జూచిన దిక్కులన్నియును భళి, భళి యని పొగడినవి. త్యాగబుద్ధి గలవారికి హరి సులువుగా లభించగలడయ్యా! భార్గవుడైన శుక్రుడు "రాజా! నీవు చెడెదవు సుమా! ఈ దానము మానుము. స్వయముగా శ్రీహరియే వామనుడై యిటు వచ్చెనయ్యా! నిన్ను మాయలో పడవేసెనయ్యా!" అని యెంత చెప్పినను బలి వినలేదు. "సాక్షాత్ లక్ష్మీపతియే యాచకుడై వచ్చి చేజాచి యున్నాడు. దానము గ్రహించుట కింతకు మించి తగినవా డెవడు కలడని. రాఘవా! వామనుడు అడిగిన యర్థము ఉదకధారా పూర్వకముగా నిచ్చెను.

"రామయ్యా! దైవకృప పొందుటొక అదృష్టము. అది త్యాగముచే కలుగును. దానముచేత తగిన సహచరి లభించును. దానగుణము వలననే ఇహపర సుఖములు కలుగును. బాబూ! దానమును మించినది లేదు. మీ వంశకర్త రఘు మహారాజు ఆ దానమను కల్పలతను నాటెను. అది తీగెలు వేసి విస్తరించి

పూవులు పూచెను. కాయలు కాసెను. అవి తీయని పండ్లయ్యెను. ఆ ఫలము నొకదాని నీయుమని మీ తండ్రి యొద్ద చేజాపితిని. చివరకు త్యాగబుద్ధితో నతడు దానిని నాకిచ్చెనురా!

"రామా! ఈ చరిత్ర వామనునితో ప్రారంభమై యింతవరకు వచ్చినది. వామనుని నాటి నుండి మహిమోపేతమైన యీ చోటుననే నేను పర్ణశాల నిర్మించుకొంటినిరా. తండ్రీ! ఇదియే నా తపోవనము. నా యజ్ఞవాటిక. యజ్ఞ కర్తవు భోక్తవు నీవే కదా! దీనిని పాడొనరింప జూచు క్రూరులను శిక్షించు కర్తవ్యము నీ యందుండుటచేతనే, దాశరథీ! నిను తోడ్కొని వచ్చితినయ్యా. యజ్ఞ నాశకులగు రాక్షసుల వధించి, సిద్ధాశ్రమను ఈ ఆశ్రమపు పేరును నిలుపరా, తండ్రీ!

"రఘుకులశ్రేష్టా! యాగవిఘ్నము చేయుటకు రాత్రించరులైన దానవులు ఇద్దరు చాటుగా నెచటనో పొంచియుండి, వారి యనుచర గణముతో వత్తురు. వారు మారీచుడు, సుబాహుడు ననువారు. సుబాహుని నీ కంటికి అగుపించిన వెంటనే పరిమార్చుము. మారీచుని గూర్చి నే జెప్పబోవునది అవధానముతో వినుము. వానిని చావగొట్టి వదలుము; ఇప్పుడు మాత్రము సంహరించకుము." అని చెప్పి విశ్వామిత్రుడు యాగము ప్రారంభించుటకు ఆశ్రమములోనికి వెళ్ళెను.

ఆశ్రమ సమీపమున రామలక్ష్మణులు ధనస్సులందు బాణములను సంధించి నారి బిగించుచు నిలచిరి. వారు తమ ధనువు నిటునటు త్రిప్పుచు, రాత్రింబవళ్లు నిద్రయు నాహారమును మాని, జాగరూకులై యుండిరి. యాగరక్షణ చేయవలెనను ఉత్సాహముతో నుండెను. యాగమైదు రాత్రులు గడచెను. ఆరవ రాత్రి రెండు యామములును గడచినవి. రాక్షసులు రక్తమాంసములను కుండలతో బోసినట్లు వర్షింపసాగిరి. యజ్ఞ రక్షకుడైన రాముడు తమ్మునితో యాగశాలాద్వారము వద్దకు పరుగెత్తి ఆకాశమున నున్న రాక్షసుల జూచెను.

అందు "అదుగో! వాడే మారీచ దానవుడు" అని గుర్తించి, ఋషి వాక్యమును మనస్సులో తలచి, మానవాస్త్రముతో వానిని పైకెగురగొట్టి దూరముగా సముద్రమున బడవేసెను. చిరునవ్వుతో తమ్ముని జూచి "తమ్ముడా! రాక్షసుల పాట్లు పరికించుము" అని విజృంభించి మిగిలిన దానవులను సుబాహునితో సహా సంహరించి, యాగమును నిరాటంకముగా జరుగజేసెను. విశ్వామిత్రుడు యజ్ఞ కార్యము పూర్తికావించి, రాముని ప్రేమతో కౌగలించి "రామభద్రా! భళి భళి. ఈ యజ్ఞము నీదే. రక్షకుడవును నీవే. యజ్ఞఫలమును నీకే సమర్పితమయ్యా! నీ పేరు విశ్వముండునంత వరకు నిలచియుండునురా! యదార్థముగా – ఈ యాశ్రమమిప్పుడు సిద్ధాశ్రమమైనది."

"దశరథ రాజపుత్రా! నిన్ను విడచి యుండలేకున్నాను. ఏమి చేయుదును? నిన్నిచటకు దెచ్చిన కార్యము నెంతో నేర్పుతో నెరవేర్చితివి. ఇక మిమ్ము అయోధ్యా నగరము చేర్చవలసియున్నది. సరే! అంతకు ముందు మీకు యజ్ఞ దక్షిణ నీయవలెనుకదా! అందుకొరకు మిథిలానగరమునకు పోయి అచట మీకు తోడు లభించునేమో చూచెదను. దొరకినచో జతచేసి పంపుటయే యుక్తము" అనెను.

కౌశికుడు రాజపుత్రులతో మిథిలవైపు సాగిపోయెను.


**'సిద్ధాశ్రమము' సమాప్తము**



# పర్ణశాల

"**సో**దరా! రఘువంశమునందు జన్మించిన రాముడు ఖంచులైన మనవారిని చంపుటచే మన యింటి మీదకే వచ్చినట్లైనదిరా! ఫలములు పుష్పములతో సొగసుగా నుండెడి దండకారణ్యము పాడువడిపోయినది. ఇక మన భాగ్యరేఖ వక్రించినట్లే. ఇటుపై మనకు దిక్కగువారెవరున్నారు? దండకలో నుండిన మునులు చిరకాలము నుండి నోచిన నోములు ఫలించినట్లే కదా! ఆ రాముడు అసహాయుడుగా క్షణకాలముననే మనవారినందరిని – చివరకు చావుకబురు చెప్పుటకైన నెవరు మిగలకుండునట్లు హతమార్చినాడు. చావుతప్పి కన్ను లొట్టబడినట్లు అకంపనుడొక్కడే – ఆడుదానివలె దాగి దాగి ప్రాణముల దక్కించుకొని లంకజేరి చావుకబురు చల్లగా జెప్పినాడు.

"రాముడేదో కార్యము నెరవేర్చుటకై పుట్టినవాడు కావచ్చును. ఏ కారణము



ననో, అడవులబడి వచ్చెను, కాని సామాన్య మానవుడుగా తోచుటలేదు. సుందరము సుకుమారమునైన నీలికలువ వలె కన్పించువాడు, దండకలో నున్న మనవారి నందరిని తానే సంహరించెను కదా! నారచీరలు ధరించి, దుంపలు కాయలు వ్రేళ్లు తిని బ్రతుకుచు గౌతమీ నదీతీరమున నెత్తైన దిబ్బపై నొక పర్ణశాల గట్టుకొని యున్నాడు. జడలకట్టిన జుట్టుతో చూచుటకొక మౌని వలె కన్పించువానికి మన ఖరాదులైన రాక్షసులను హతమార్చుట సాధ్యమా?

"అన్నా! నూతన యౌవన ప్రాయమందు, మెత్తని లేచిగురాకు శోభతో నున్న శరీరమున ధూసర వర్ణముతో ధూళిపట్టియున్న నారచీర గట్టినను సుందరముగా నున్న రాముడు; అనాయాసముగా నొంటరియై రాక్షస నాశ మొనరించెనే! ఆహా! ఎంత పరాక్రమము, ఎంత బలము, ఎంత దర్పము! అని ప్రశంసించుచు – దేవతలు వానిపై సుగంధము వెదజల్లు పూవులను వానగా గురిపించిరి కదా! నల్లనివాడు, ప్రకాశించు శరీరము కలవాడు, అదృష్టరేఖలు గలవాడు, వికసించిన పద్మ సౌందర్యము కాంతులతో కూడిన నేత్రములు కలవాడు, పరికించి చూచిన దృష్టిపాతమునకే వడలిపోవు శరీరశోభ కల రాముడు – రాక్షసులనెల్ల మట్టుపెట్టెనే!

"ఆ సుందరుడు సుందర నేత్రములు కలవాడురా! చిరునవ్వులు రాసులుగా పోయువాడురా! కనుకనే ఒక్క వీక్షణ మాత్రముననే నా మనసును కలవర పెట్టినాడు. వీనులవిందగునట్లు మధురముగా పలికినాడురా! నేను ధరించిన సుందర రూపమును వాడు భ్రమించునట్లు, ఎరబెట్టితిని. వాడు ఎదిరించరాని భుజపరాక్రమము కల వీరుడు; వాడు స్త్రీల మనసులను మోహింపజేయువాడు. వాని శరీరశోభ చూచుట అమృతపానము చేయుటయే. అది యేమి మాయయో, మర్మమో, వానిపై నాకు గలిగిన ప్రణయముతో మనసు పొంగిపోయెను కదా!

"ఆ పురుష శ్రేష్ఠుడెవడో కాని, కోటి మన్మధులైనను వాని కాలిగోటితో

సమానులు కాలేరు. వాని శౌర్యము, శౌర్యదేవతనే నిర్జించగలది. వాని పరాక్రమము నరులెవరియందు కానరానిది. దానవ నివాస ప్రాంతములలో మనుజులు వచ్చి నివసించుటకు ఎన్ని గుండెలుండవలెను? అట్టిచోట, ఆ రాముడు నివసించుట ఎంత చోద్యము! అన్నా! వాని తమ్ముడు లక్ష్మణుడు నన్నల్లరి పెట్టుటకు హాస్యము లాడుచు చేరబిల్చి నా ముక్కు చెవులు సగము వరకు తెగగోసెను. చూచితివా? పుష్ప సౌరభోపేతయైన జనకరాజపుత్రి చూచు చుండగా – నీ చెల్లెలి కీపాటు కలిగినది. దీనిని రఘురాముడు ఘల్లుఘల్లున నవ్వుచు చూచుచుండగా వాని బుగ్గలు సొట్టలు పడినవి.

"సోదరా! ఇదియేదియో పెద్ద మాయగా నున్నది. వాని యింద్రజాలము ముందు రాక్షసమాయలు ఏమాత్రము చెల్లవు. వయసు ముదిరి, అడవిలో చెట్టు మోడువలె, మమకార వికారము లేవియులేక, ఎడారియైయున్న నా మనస్సునందేదియో మధుర భావము కలుగుట దాని ప్రభావమే. ఆ రాఘవుడు మోడున చిగురులు మొలిపింపజేయగలవాడు. నాకేదో మైకము క్రమ్మజేసెను. వాని ముందు మన మాయలేమి చెల్లును? ఇక మన యాటలు కట్టువడినవి.

"లోకమును ఆశ్చర్యమున ముంచి తేల్చు అంతటి బలమా స్వామి కెట్లు కలిగినదో! నీవు వానిని భగవంతుడు కాదందువా? అయినచో వాని ముందొక క్షణము నిలచి చూడరాదా? కట్టు పుట్టము బిగగట్టి నిమిషకాలముననే మనవారి నెల్లరను మట్టుపెట్టిన జగజెట్టి యాస్వామి. సోదరా! వాని పరాక్రమము ముందు మనవారు నిశ్చేష్టులై నిలచిరన్న సత్యమే యగును. దానిని తలచిన కొలది భయమగుచున్నది. వాడెంత మాయలమారియో? కాయ కసరులు మెక్కు మానవుని జూచి, మానవులను కడుపార మెక్కు దానవులు భయపడుట – మాయ కానిచో మరేమందుము? వాడే దానవులను నశింపజేయ నవతరించి యుండునేని, ఈ ఎత్తైన పర్వతమే గోష్పాదమంత సముద్రమున తేలియాడ గలదు. అందుకు సందేహ మక్కరలేదు.

"నీవుగాని నేనుగాని వాని అవతార రహస్యము నెరుగలేకున్నాము. ఆ సుందరరూపి యెవడోగాని మన గుట్టుమట్టు లెరుగుట కీవైపు వచ్చియుండును. వాడిచట నుండుట మనకు ప్రక్కన బల్లెము ఉన్నట్లే. వాడు మనచెంత నుండెనేని ప్రమాదము సిద్ధము. సోదరా! నన్ను ప్రేమతో చేరబిలిచి చెంపలు దువ్వి ఎంత చేసెనో – నా ముక్కు చెవులు చెప్పుచున్నవి కదా! సాగదు. నిశ్చయముగా సాగదు. ఈ సముద్ర ప్రాంతమునందు సోదరా! నీ రాజముద్రాధికారము ఇక చెల్లదు. నా దండకారణ్యవాస నాటకమునకు తెరపడినది. ఇక ఆ యడవులు, కొండలు నీ యధికార పరిధిలోనివి కావు. అయ్యో! నీ దశ మారిపోయినదిరా! దీనితో నీ బంధువులే నీకు విరోధులుగా మారుకాలము దాపురించెను కదా!

"నా ముక్కు చెవుల విషయము వదలుము. లోకములను మోహింపజేయు ఆ రాముని సౌందర్యమంతయు నిక యెవ్వరికిని దొరుకదు. అది యా సీతకే స్వంతము. ఆమెకే దానిని పొందు అదృష్టము. పరుగులు పెట్టి పరుల సొత్తు దొంగిలించుదమనిన అది చెప్పరాని అపకారము కలిగించును. ఆ యాశ వలన యిక్కట్లు తప్పవు. ఇక దానిని ప్రాప్తించని నిధినివలె ఉపేక్షించుటయే శ్రేయము. ఉబుసుపోక, మనసోపక, నేనొక యవకరమును తెచ్చుకొన్నాను. సోదరా! అయ్యో! ఇప్పటి నుండి నా చరిత్ర దుశ్చరితగ పల్లె పల్లెకు ప్రాకిపోవును. నేనొక దుష్టపాత్రకు ఉదాహరణమైపోదును. నా వాంఛలను – ఆ మానవుడు – నా హృదయమునందే పాతిపెట్టినాడు. విరహతాపమును కలుగజేసెను కదా!

"నీవు సోదరుడవు. నీ యెదుట నా పరపురుష వాంఛ వెలిబుచ్చుట సంగతము కాదు. అయినను యధార్థము చెప్పుచున్నాను. నేను నీ వలననే వైధవ్యమందితిని. వయసు దాటిపోయినది. ఒంటరిదాననై దండకారణ్యమున బడి తిరుగుచుంటిని. అన్ని బంధములను వదలితిని. అట్టి నాయెదుట వాడు కనిపించగనే, మోహము కలిగినది. దానిని ఆపలేనైతిని. యవనమున నున్న

అందగాడు భర్తగా దొరకునని ఆనందము కలిగినది. తగినను కాకపోయినను సోదరా! నా పాటు నీకుకాక వేరెవరికి చెప్పుకోగలనురా? నీ యంతటి ఆంతరంగికులు నా కెవరురా?

“ఆ రామునికొరకు కెంతయో మనసు పడితిని. కాని యది ఫలితమునకు రాకపోయెను. వ్రతము చెడెనే గాని ఫలము దక్కలేదు. అంగడి వీధులలో ప్రచారము మాత్రమైనది. నా అంతులేని ప్రణయానుబంధమో చేయి దాటిపోయినది. ప్రక్కదారుల ద్రొక్కిన ప్రణయముల ముగింపు ఇట్లే యుండును. వానిని – ఛీ యని విడచుటయే శ్రేష్ఠము. సోదరా! నేను చేసిన పాపమేమియో కాని, ఎన్ని చిక్కులు కలిగినవిరా! కొందరేమి సుకృతముల జేతురో. ఏ విఘ్నములు కలుగక, వారి ప్రణయానుబంధములు సాగును. ప్రాప్తమనగా నిదియే! అదిలేని ప్రేమ వీధులపాలైపోవును. ఎంతయో పుణ్యము చేసియుండిననే ప్రేమించు భాగ్యము చేతికి దొరకును.

“రఘురాముని లోకమంతయు ప్రేమించును. అందరి మాట యేమియో కాని, వాడు నాకు మాత్రము దొరుకడాయెను. ఫలితము లేకపోయెను. పైగా భయము కలుగజేసెను. ఏడ్చి మొత్తుకొంటిని, కయ్యమునకు కాలుదువ్వితిని, ఇంత చేసినను ఆ పిచ్చి రాముడు నా మనోవ్యథ నెరుగకపోయెను. వాని సొగసు అందరికి కావలసినదే. అది లభించుట మాత్రమెట్లో తెలియదాయెను. కొందరికి అందమే ఆపదల దెచ్చిపెట్టును. సౌందర్యమున్న మనసుకు స్వస్థత లోపించును. అట్టి యందము వైరులకైనను వద్దు. ఒక హద్దును మించిన సొగసు తగదు. అది ఒక అపరాధమగును. దానికి ముచ్చటలు కలుగవలెనను కోరిక జతపడిన – అది కలిగించు చేటు ఇంతయని చెప్పలేమురా!

“సోదరా! నే నెంత దుస్థితి నందితినో చూచితివి కదా! అన్యుల అందమున కాశపడి తెచ్చుకొన్న చేటు ఇది. కాని, ఇది యీ దనుజకాంత చేసిన అపచారము

కాదు సుమా! వాడు సామాన్య మానవుడు కాడు. తన మాయలతో మనసులను భ్రమింప చేయగలవాడు. వాడు మనవారు సంచరించు అడవిదారుల గాచియున్నాడు. వాని తమ్ముడు, సుమిత్రానందనుడునైన లక్ష్మణుడు పగతో నా చెవులు తెగగోసెను. కాని వానిపై నాకేమాత్రము క్రోధము కలుగలేదు. ఎందుచేతనందువా? ఆ రాఘవస్వామి తన కంటి సంజ్ఞలతో మన్మధ బాణములు నాపై ప్రయోగించి చేసిన గాయమున కారామ సోదరుడు నన్ను తాకి, ఆ స్పర్శచే వెచ్చగా కాపుపెట్టెను కదా!

“నిజమునకు లక్ష్మణుడే రూపుదాల్చిన శేషత్వము. అది వానికి జన్మతః వచ్చినదే. వాని మనస్సు దయాభరితమే. అప్పుడప్పుడు సర్పమువలె బుసలు కొట్టును. అది యెట్లు పోవును? సేవాధర్మము పాటించు సద్బుద్ధి కలవాడు. వాడు నా భుజముపై చేయిపెట్టి, దగ్గరకు లాగి, నా ముక్కును చెవులను కోసెను. ఆ స్పర్శతో నా జన్మ ధన్యమైపోయినది. సోదరా! వాడింత దురుసువాడని, దానితో పైకి దుముకబోవునని, వానిది విషస్వభావమని – ముందుగా గ్రహించలేకపోయితిని. దుడుకుతనముతో అప్పుడప్పుడు పెద్దల సూక్తులను పెడచెవిని పెట్టినను, వాడు శేషత్వమునకై సర్వభోగముల త్యజించిన వాడు. వాడు వంకర నడకయేగాక, తిన్నని నడకయు తెలిసినవాడురా!

“ఆ సౌమిత్రి చేతి మాహాత్మ్యము మానవు లెరుగరు. అది ఉపమాన రహితమైనది. దాని మధుర స్పర్శ తగులుటతోడనే, జ్ఞానజ్యోతి యేదో నా హృదయమున ప్రకాశించినది. అన్నా! ఆ అనుభూతి ఇది యని చెప్పలేకున్నాను. గతజన్మ చరిత్ర లేవేవో మనసులో మెదలినవి. వాడు గుండెలు దీసిన బంటు. రాక్షసావాసమైన దండకకు వచ్చి, రాక్షస చక్రవర్తివై, రావణుడవై పేరొందిన నీ చెలియలి ముక్కు చెవుల గోయ సాహసించినవాడు మానవుడే అందువా? ఖరాది రాక్షస హంతయైన వాని యన్న రామస్వామి, నరుడే అందువా? వారి లోగుట్టు ఎరుగ యత్నించవా?

"శత్రు విద్రావణా! రావణా! నేను తెలుసుకొనిన మరియొక సంగతి వినుము. నిన్న వికసించిన పుష్పములతో శోభగానున్న దండకాటవీ ప్రాంతమున ఎచ్చటి నుండియో క్రొత్త సుగంధమొకటి నలువైపుల వ్యాపించినది. అది నా ముక్కునకు తగులగా, దాని నెగబీల్చి చూచితిని, అది మానవ సుగంధమని గుర్తించితిని. ఎంత పీల్చినను తనివి తీరనట్లున్న ఆ వాసన – వాయువుచే కదల్చబడి పూవుల బరువుతో నిటునటు ఊగుచున్న చెట్లు, కాలముగాని కాలమున పూచిన సుమముల సౌరభమునుకాదు, వానిమించిన సుగంధమేదో అది. దానితో వనమంతయు నిండిపోయినది.

"ఎవడో, ఆ అపూర్వమైన సువాసన తన చెంత నుండగా దానిని వాయువులో రాసులుగా గ్రుమ్మరించుచుండవలెను. నేను వానిని చూడకున్నను, నాకట్లు తోచుచున్నది. అట్టి పురుషోత్తముడెవడో తనకు తానై యీ వనమున ప్రవేశించనిచో, ఇతరు లెవరిందుకు సమర్థులు? రావణా! నే జెప్పెడి దానిని అవధానముతో వినుము. మనము ఇంకను నలుగురిలో నభాసుపాలు కాకముందే దీని మర్మమును తెలుసుకొనుము. అంతేకాదు, దండకలో పూర్వము తెల్లగా నున్న పూలన్నియు నేడు నీలవర్ణముగ మారిపోయినవి. రా అన్నా! నాకేదియో సందేహము కలిగినది. ఎవడో నీలమేఘము వంటివాడు, నీలి కలువ వన్నెవాడు, మన వాడకు వచ్చియుండునని తలచి, అంతటి మహత్త్వ సంపన్నుని చూడగోరి దారులవెంట బడితిని.

"దండక నేడు పూర్వమున్నట్లుగా లేదు. నేడు అందములన్నియు నచటికే చేరి నాట్యమాడుచున్నవి. ఇంకొక వింత వినుము. అచట సింహములు వ్యాఘ్రములు కొండలలోను గుట్టలలోను నివసించెడివి కాదా! ఇప్పుడెంత వెదకినను ఒక్కటియు కనిపింపదే! మరియొక వింత, తమ చూపులలోనే విషమును చిందించుచు, బుసలుగొట్టుచు ఎచట చూచినను కనుపించు

దండకలో, నిప్పుడొక సర్పమైనను కనిపింపదే! అవి యన్నియు నేమైపోయినవి? ఈ వింత వినుము. ఏనుగులు, వాని సహజ శత్రువులైన సింహములు – ఏ కారణముననోగాని ఒకే పొలములో మిత్రులుగా సంచరించుచున్నవి.

"సోదరా! పిల్లులు ఎలుకలు కలసి సరసములాడుచు తిరుగుచున్నవి. ఎవడో గొప్ప మహత్తు కలవాడు దండకలో ప్రవేశించియుండనిచో నివి యన్నియును సంభవములగునా? ఈ అసంభవములనెల్ల జూచుచు నేనెట్లు దండక యందుండగలనో చెప్పుము? అచట నుండిన మన రాక్షస సమూహమున నొక్కడును; క్రొత్తగా నొకడు దండకలో నడుగుపెట్టెనని గుర్తింపకపోయిరే! అచట క్రొత్త వ్యక్తులు ప్రవేశించిరనియు, వారు మానవులనియు తెలుసుకొని, గుండెలు బాదుకొనుచు దుఃఖముతో పరువుపెట్టి నేను చెప్పువరకు నొకడైన గుర్తించెనా? వారి మత్తువదలెనా?

"నీవెరుగుదువు కదా! గౌతమీ నదీతీర భూములందు పూర్వమెన్ని మున్యాశ్రమములుండెడివి! అందొకటియైన నేడు కానవచ్చుట లేదు. నదిని దాటుటకు పూర్వము చక్కని మార్గమేదియో ఉండెడిది. ఇప్పుడది మేటవేసినదో ఏమో? కనిపించుట లేదు. దండక యంతయు క్రొత్త క్రొత్తగా మార్పులు చెందుచున్నది. అచట పెద్ద జంతువుల జంపి వాని మాంస రుచి మెచ్చుకొనుచు భుజించుదానను. మనుష్యుల జంపి వారి రక్తము త్రావుచు నానందముతో నాట్యమాడు చుండెడిదానను. అట్టి తావుల నిపుడు గచ్చపొదలు మొలిచినవి. ఈ మార్పు లన్నిటికి నేదియో కారణ ముండియుండునని తోచుటలేదా?

"దండకాటవీ మార్గములందు, పొదరిండ్లను, పర్వతములందు, కొండ చరియలందు చెట్ల గుబురులందు రాత్రులు విహరించుచు, తూర్పున ఏకచక్ర రథము నెక్కిన సూర్యుడు ఉదయించు వేళకు – ప్రకృతి సౌందర్యము చూచుచు నదీతీరము చేరితిని. నది తెచ్చిన యిసుకతో నేర్పడిన దిబ్బలపై నడచి వచ్చు

చుండ – ఎవరివో అందములొలుకు పాదముద్రలు కనిపించినవి. వానిని చూచి ఆశ్చర్యముతో కొయ్యబారి నిలిచితిని. ఏదియో భూతము మన రాక్షసులను బాధించుటకై సంచరించుచున్నదిరా! నేను చెప్పుచున్న దానిలో నొక అక్షరమైన కల్లలేదు సుమా!

“తడిసి మెత్తగానున్న ఆ పాదముద్రలందు పద్మరేఖలున్నవి. అనగా నవి ఎవరో మహాపురుషునివై యుండును. వాడచటకు వచ్చియుండవలెను. వాడొక దేవతామూర్తియై యుండునని తోచినది. ఆ పద్మరేఖ లెంతో సుందరముగ మెరియుచున్నవి. వానినుండి శ్రేష్టమైన వాసనలు వచ్చుచున్నవి. నేను ఉప్పొంగిన మనసుతో వానిని కన్నులకు అద్దుకొంటిని. పవిత్ర పురుషుడెవడో వచ్చియుండ వలెను. వాని పాదోదకమే గౌతమీ నదియందు పారుచున్నది.

“సోదరా! నేనా యానవాళ్లను పట్టి పట్టి చూచితిని. ఎవరో మువ్వురు నదీ జలముల స్నానమాడి, ఒకరికొకరు ఎడమెడముగా నడచి వెళ్లినట్లు తెలిసినది. దానితో నాకొక సందేహము కలిగెను. “చిరకాలము నుండి నాకీ దండకా వనముతో గల అనుబంధము ఈనాటితో తీరిపోయినదా? ఋణము తీరిపోయినదా?” పద్మరేఖలున్న పాదములవాడు ముందు నడచుచున్నట్లా గుర్తులు చెప్పినవి. ఒక మందయాన మెల్లగా నడుగులు వేయుచు వాని ననుసరించి వెళ్లినది.

“ముందు నడచువాడామె మగడు కావచ్చును. ఆమె వాని మగువయై యుండును. వారిది అనురూపమైన జంటయై యుండును. వాడు సువర్ణమైన ఆమె దాని తావి యగును. వాడు మేఘమైన ఆమె మెరుపగును. వాడు పూవైన ఆమె దాని తావి యగును. రావణా! నీకు వానిని చూచు నదృష్టములేదు. ఉండియున్నచో నామె పాద సౌందర్యము – మోడున చిగురులు వేయించి, తీగలు ప్రాకించి, సువాసనలనిచ్చు కుసుమముల పూయించునవని – ప్రశంసించి యుందువు.

"అన్నా పాదముల గుర్తులబట్టి, వాడెవడోగాని మహా సాహసి యనిపించెను. తన చూపులతో విసము జిమ్ము రెండవవాడు వారిని వెన్నంటి వచ్చినట్లు తోచును. వారు ఆ ప్రాంతమున కెన్నడో వచ్చిరి. వారెవరో తెలుసుకొన యత్నించుచు నక్కి నక్కి పాదముద్రల నంటి వెళ్లితిని. దూరమున నొక యరటి తోట యందొక ఆకుటిల్లు, దాని సమీపమున సుందరమై చల్లని నీరు గల నీటిపట్టు, దాని యందు వికసించిన పద్మములు కలిగిన ప్రశాంత ప్రదేశమది. దాని చెంతకు వెళ్లి చాటున నుండి సర్వము వీక్షించితిని.

"దాని సౌందర్యమేమని చెప్పుదును! పొందికగా గట్టిన ఆకుటింటి కిరువైపున పందిళ్లకు ప్రాకించగా, నవి లెస్సగా పూలతో శోభించు తీగలు. ఆ ప్రాంతమున పూలు కాయలతో ఫలవృక్షములు, వానిపై నుండి కమ్మగా కూయు కోయిలలు, హాయి కలిగించినవి. చుట్టు పచ్చికతో పచ్చగా నేల ఎంతయో సుందరముగ నున్నది. ఆ శోభ అంతకు పూర్వమెరుగని ఏదో వికారము నా మనసుకు కలిగించినది. అంతమంది రాక్షసులకు నిలయమైన ఆ ప్రాంతములో వారు అంత చక్కని స్వప్నగృహము నెట్లు నిర్మించిరో కదా? నిజముగా నా దృశ్యము గొప్ప కళాఖండమే. నేను వారి నివాసమును గుర్తించితినని వారెరిగి యుండరు. వేలాదిగా దానవులట నుండిరని వారికి తెలిసియుండదు. నేను వారికిది తెలియజెప్పిన ముప్పేమి?

"అన్నా కండ్లు కలయందుకు సార్థకమా దృశ్యమును చూచుటయే. నేనొక్క అంగలో ఆశ్రమ సమీపమునకు చేరితిని. ఆ మానవుడును భార్యయు దగ్గరగా పర్ణశాల యొద్ద కూర్చొని యున్నారు. వారికొకింత దూరమున రెండవవాడు కోసిన పూలను మాలగా గ్రుచ్చుచుండెను. వారు ఇంద్రుడును ఇంద్రాణియు గావచ్చును. శివుడును పార్వతియునై యుండవచ్చును. రతీమన్మథులై యుండవచ్చును. కానిచో లక్ష్మీ నారాయణులు కావచ్చును. వారి సౌందర్యము

రాశులు పోయవచ్చును. గంపల కెత్తవచ్చును. వారు ఇరువురా, ఒక్కరా యను నంత అన్యోన్యముగా నొకచోట నుండగా జూచిన నాకు రంపపుకోత బెట్టినట్లయ్యెను. దానితో నా దానవీ రూపము వదలితిని.

"నా మాయలో నన్నే ముంచుకొంటిని. సంపెంగ వంటి ముక్కు, శ్రీకారముల వంటి చెవులు బింబసదృశమైన ముఖము కల నవయౌవ్వనాంగిగా మారిపోయితిని. మదనుడు విడువక ఒకదానివెంట మరొకటిగా బాణములు ప్రయోగించి రెచ్చగొట్టెను. నేనా స్త్రీ పురుషుల జేరి, మానవుడా! నిన్ను నేను భర్తగా వరించితినంటిని. వాడు నన్ను చిరునవ్వు లొలికించుచు పలుకరించెను. నాకట్టి భాగ్యము లభించినది. నా కాంక్ష నెరవేరుననుకొంటిని. నా జన్మ తరించునని తలచితిని. నా జీవితలత చిగురులు తొడుగు ననుకొంటిని. అన్నా! నా పాటును పరిహసించకుము. నన్ను ఏవగించుకొనకుము. నిందించకుము. నా జీవితమున కెంత యదృష్టము పట్టిన దనుకొంటిని.

సోదరా! వాడు నాపై విసరిన మందహాసము వంటిది వాని భార్య యెన్నడును చూచియుండదు. దాని ప్రభావమును చవిచూచియుండదు. ఈ దైవ్యాంగన నోములు ఫలించినవి. అది నా ధనాగారము. ఎంతయో కాలము దాగియుండి బయటపడిన అదృష్టము. వికసించిన పూలతో బహు సుందర కల్పలత వలె మురిపెముగ నున్నది. ఆ సుందరుడు "ఓ చక్కనిదానా! ఇదిగో నా చెంతనున్న యీ సీత నిన్ను చూచి అసూయపడుచున్నది. నాకు నీపై రవంత ప్రేమ యున్నను లాభము లేదు కదా! యని చింత కలుగుచున్నది. ఇంతకును సుందరీ! నీ వెవరవు? ఎక్కడ నుండుదానవు? చెప్పు"మనెను. నేను "మీ రెక్కడనుండు వారిచ్చటికి వచ్చితి"రని ప్రశ్నించితిని.

"క్రింది పెదవిని పైపంటితో నొక్కిపట్టి, చిరునవ్వుతో వశీకరణాస్త్రము వానిపై ప్రయోగించితిని. చూచుటకు వాడు మెత్తగా కనిపించినను వాని హృదయము

పాషాణమురా! వాడు నాకు లభించకున్నను చిత్ర విచిత్రముగా నాటకమాడెను. వాడు అయోధ్యలో నుండువాడట. ఇందుమతీ పుత్రుడైన దశరథుని పుత్రుడట. జానకియైన సీత వాని భార్యయట. చెంతనున్నవాడాతని తమ్ముడు సౌమిత్రియైన లక్ష్మణుడట. పినతల్లి కైక కోరికపై భార్యా సోదరులతో వచ్చి దండకలో నుండిన మానవుడట – ఇట్లు వాని గృహఛిద్రముల నేకరువు పెట్టినాడు.

"రావణా! ఇప్పటికైన వాడు చెప్పిన దానిలోని మర్మమెరిగితివా? శంబరాసురునితో పోరునాడే – దండక రాక్షసావాసమైనదని, కైక గుర్తించనది. ఈ రాముడు యుద్ధవిద్యా నిపుణుడైనందున, నీ దండకము మూలమట్టముగా నాశనము చేయునను ఉద్దేశించి, వీని నీ యడవికి ఆమెయే పంపినదని తెలియుటలేదా? అన్నా! తెలిసితివా? తాటకను చంపినవాడు వీడే. తాటకా పుత్రుడైన మారీచుని ముందు ముందు పనికివచ్చునని ఎరగా విడచి, సుబాహుని కూల్చిన దితడే. గౌతమ పత్ని అహల్యా శాప విమోచకు డితడే. శివధనస్సును మిథిలలో ముక్కలుగా చేసినది వీడే. వీడిపుడు యీ దండక జేరెనన్న యిచ్చటి మునులను మననుండి రక్షింపనే కదా!

"కొంతకాలము క్రిందనే మన చారులు యీ వనమున మానవులు తిరుగుచున్నారని చెప్పిరి. కాని వారు వీరేయని ఇప్పుడే తెలిసినది. సంభాషణ వలన వాని జన్మరహస్యము తెలియవచ్చినది. వీడు దండకలో ప్రవేశింపగనే, దానవ బాధావిముక్తుల జేయుమని, యిచటి మునిసంఘము ప్రార్థించినది వీనినే అయియుండును. వారిని కాపాడెదనని – దానవులను నాశనము చేయుదునని ప్రతిజ్ఞగా నొకడు మాటయిచ్చెనని వింటిని. ఆ శపథకర్త యీతడే అయి యుండును. ఈ విషయములనే మన వేగువారలు విని, గుండెలు బాదుకొనుచు వచ్చి, నాతో జెప్పిరి. రావణా! ఇక నీ పరాక్రమమును గురించి చెప్పుకొనకురా! అని గతకాల వైభవమైపోయినదని తెలుసుకొనుము.

"నీవు వాని యెదుట బడకుము. ఇక నీవు లంకలోనో, మారువేసములతోనో

బ్రతుకవలసినవాడవే. వీడే విరాధుని జంపి, పెద్ద గోయి త్రవ్వి పూడ్చిపెట్టిన వాడు. సందేహము లేదు. మానవ రూపధారియై వచ్చిన శ్రీహరి యితడు. నీ తప్పు యింకను తెలిసి రాలేదా? బ్రహ్మచే వరములు పొందునప్పుడు – అల్పుడని – మానవునిచే చావు లేకుండా కోరకపోయితివి. రాక్షసజాతికి ముప్పు దెచ్చిపెట్టితివి.

"అన్నా! నేనెల్లప్పుడును చారచక్షువునై యుంటిని. ఒక చారుడు నాతో జెప్పిన విషయమిది. ఒక నాడీ రాముడు భార్యతో మాట్లాడుచు "సీతా! నేను సాధువులైనవారికి, మునులకు అభయమిచ్చితిని. నా జీవితమును వారికొరకే వినియోగింతును. నీవుగాని తమ్ముడుగాని యెవరు అడ్డుచెప్పినను నా ప్రతిజ్ఞ విడువను" అని చెప్పెనట. మన చారులు మరికొందరు కామరూపులు, చిలుకలు పక్షులవలె పర్ణశాలయందుండి, వారి ప్రసంగముల ద్వారా, వారు మానవావతారము లెత్తిన విధమును, వారి ప్రతినలను, వారి చేష్టలను, కార్యములను, తీరులను ఎప్పటికప్పుడు నివేదించుచువచ్చిరి. వారు వీరే యని యిప్పుడు తెలిసివచ్చినది.

"తానే మోక్షమార్గము జూపు పరంధాముడనని, దైత్యాంగననైన నాకు నిజ స్వరూపమునిట్లు ప్రదర్శించెను. దూరముగా నాలోచించక వాని మాయా మోహమున చిక్కువడితిని గదా! నాకు తన సాలోక్యమిచ్చి, మంచి మాటల జెప్పిన వాని చర్యయంతయు రాక్షస వంశనాశనమునకైన పన్నుగడ యని గుర్తింపనైతిని. ఇంచుక మందుహాసముతో నీవెవ్వరి దానవని పలుకరించగనే నా మనసు మోహముతో పొంగులు వారినది. వాడొక స్త్రీతో గలసి యుండెనని స్ఫురింపదయ్యెను. వారిలో రెండవవాడు – వాడే లక్ష్మణుడు. ఛీ! వాని పేరు పలుకుటకే తలవంపు కలుగుచుండెను కదా!

"ఏమైనను, సోదరా! యథార్థము గుర్తింపవలెను కదా! ఆ మానవులు తమ శౌర్య పరాక్రమములతో సర్వలోకముల సాధించగలరు. "రావణ

కుంభకర్ణులనువారున్నారు. వారు నా సహజన్ములు. వారి వెనుక మరియొక సోదరుడున్నను, వాడు మా కోవకు చెందనివాడు. వానిలో మా యంశ లేశమును లేదు. వాడెప్పుడు దైవమును ధర్మమును పట్టుకొని వ్రేలాడుచుండును. స్వశక్తిపై యాధారపడడు. స్వధర్మమును అలక్ష్యము చేయును. మిగిలిన యన్నల లక్షణములు వాని కేవియు రాలేదు. వాని పేరు చెప్పిననే పాతకము కలుగును. నీవు అడిగినందున చెప్పక తప్పదు కదా! వాని పేరు విభీషణుడు" అని చెప్పితిని.

"నేనీ మాట జెప్పుచుండగా, వాడేదో నెమ్మదిగా గొణిగెను. అది 'అభయము, వాడు నా సొత్తే' అని నాకు వినిపించెను. విభీషణుని గురించి వాడింకను అడుగగా, వాడు ప్రాణసంకట స్థితి ప్రాప్తించినను ధర్మము తప్పి నడువడని స్పష్టముగా జెప్పితిని. రావణా! నాకొక విషయము తోచుచున్నది. విభీషణుడు మన యింటనున్న పాషాణ విషము మనకు నిరుపయోగి. అయినను పరులు వానిని మంచివానిగా భావింతురని, రాముడు వాని నాదరించునని తోచుచున్నది.

"అన్నా! మన రోజులు మారినవి. ఇది నిశ్చయము. ఇక నీ పోషక వర్గముననే వైరములు పెరిగిపోవును, నీ మార్గములను వారు మెచ్చరు. వానిని అసహ్యించుకొందురు. నీయందు ద్వేషభావము ప్రబలును. వారు నిన్ను ద్వేషించి, దానహంతయై వచ్చిన రఘురామునే ప్రశంసించినను ఆశ్చర్యపడనక్కరలేదు. నీకు భద్రమగుగాక! వేయింకండ్లతో కనిపెట్టి యుండుము. దానవజాతి కేదియో విపత్తు రానైయున్నదని తోచుచున్నది.

"రాముడు నాతో పరిహాసమాడెనని, లక్ష్మణుడు నా ముక్కు చెవుల గోసెనని, వెంటనే వెళ్లి ఖరదూషణ త్రిశరాదులైన మనవారితో జెప్పినంతనే వారేమనిరో యెరుగుదువా? "ఆ రాఘవుడు మనపైకి వచ్చెనా? వానిచే మేము నశించుదమని అనుకొన్నాము" అనుట కోయబడగా మిగిలిన యీ చెవులతో వింటినిరా! ఇక నీ వారనుకొనుచున్నవారిలో నిజముగా నెందరు నీవెంటనుందురో కదా! నీ

సహచరులలో పెక్కుమంది రామతత్త్వ మెరిగినవారున్నారు. వారింకను ప్రచ్ఛన్నులై యున్నారు. ఒక్కడును ప్రత్యక్షముగా చెప్పుటలేదు. ఉదాహరణ కొక్కని జెప్పెదను. వానిచే చావుదెబ్బతిని వానినే స్మరించుచు వానిని దర్శించిన వాడు ఒకడని చెప్పిన చాలునా?

"అన్నా! ఆ రాముడు, నాలో వలపు రగులజేయగా, వెఱ్ఱిగా నాతని మాయా వాగుర జిక్కి, వానిని వాని తమ్ముని ఎంతయో బ్రతిమాలి, నిరాశజెంది కినుకతో, రామపత్నియైన సీతను భక్షింప వెళ్లితిని. వాని తమ్ముడు వేగమే వచ్చి, ఎందుచేతనోగాని నా తలగోయక, ముక్కు చెవుల మాత్రమే కోసెను. వాడు నా తలను కోసియుండిన వారు, మనము ఆడు నాటక ప్రదర్శనమునకు తెరపడి యుండెడిది. నాటకము పూర్తియైయుండెడిది. రావణా! ఇక నీవు రంగప్రవేశము చేయుము. నాటకమున రెండవ అంకమునకు తెర యెత్తుము. దీనిలో నీ పాత్ర పోషింపుము.

"నా హృదయమందు దుఃఖము గూడుకట్టియున్నది. అన్నా! దానిని తొలగించుమురా! అందుకు తగిన విధానము నాలోచింపుము. నాకా రామునితో ప్రేమానుబంధము కొనసాగుటకు ప్రతిబంధకమై జనకరాజపుత్రి సీత యున్నది. నాకీ సవతిపోరు మాన్పుమురా! పంతము పట్టి వచ్చితిని. దానిని చెల్లింపుమురా! నా హృదయ శల్యము తీర్పవా? ఆ తెంపరియే మా ప్రేమానురాగములను సాగనీయకున్నది. నీవు ఉపాయము లెరిగిన వాడవు. వానిలో నీ సాటి యెవరును లేరు. నా సవతిపోరు తప్పు నుపాయమాలోచింపుము. ఆమెను రాముని నుండి దూరము చేయుదునని నే పట్టిన పంతము చెల్లింపుము.

"రావణా! నీవు నాకంటె పెద్దవాడవు. అయినను నీ హృదయమందలి యాలోచనలను తెలుసుకొన గలను. దాపరిక మెందుకు. విప్పి చెప్పెదను. నాకా రాముడు మగడు కావలెను. నీకా సీత కావలెను. నాకు సీతా ప్రతిబంధము, నీకు రామ ప్రతిబంధము తొలగవలెను. నేను రాముని కోరినట్లే, నీవు సీతను

కోరుకొనుము. మనము మన కోరుకొన్నవానిని పొందినను పొందకున్నను మేలే! మన వలపులు ఫలించినను ఫలించకున్నను రాక్షసయత్నము చేయవలెను.

"సోదరా! సీతారాముల జంట నేత్రపర్వమైనదే. దానిని విడదీయ జూచుట దోషమే, సందేహము లేదు. అయినను రామునిచెంత నా సీత కూర్చొని యుండుటను నే నోర్వలేకున్నాను. రాముని పార్శ్వము నుండి జానకిని దూరము చేయవలెను. అప్పుడు రామస్వామి నావాడగును. నీవా జానకిని తీసుకొనిపోరా! మానవులైనను చక్కనివారు కనిపించిన వారిపై అనురాగము కలిగియుండుట దోషమెట్లగును? వారిని కోరుకొనుట, ప్రేమించుట తప్పు కాదు. అట్టి వలపు ఫలించినను ఫలించకున్న మేలే. ఒక విధముగా ఫలించని వలపే గొప్ప యగును. ప్రేమించి – ఎదుటివారి వలపు చూపునకై నిరీక్షించుటలోనే ఆనందమున్నది.

"నా విషయమే తీసుకొనుము. రామస్వామిపై విపరీతమైన అపేక్ష ప్రదర్శించితిని. వాడు దానిని త్రోసివేసెను. తామసించి నా ముక్కు చెవుల గోయించి త్రోసివేసెను. అయినను వానియందలి అభిమానము నాలో తొలగిపోయినదా? పైగా నేనాతని శౌర్యప్రతాపము లోకములలో ప్రచార మొనర్చుటలో ఆనందము పొందుటలేదా?

"నేను రాముని వలచి పరాభవింపబడితిని. నీవు జానకిని వలచి, ఆమెను పొందుటలో విఫలుడవై నశించినను మేలే. అది శ్రేయమే అని తలపుము. ఈ వలపులు నేడు కాకున్నను మరొకప్పుడైన సత్ఫలితమిచ్చును. రఘురాముని కథలో రావణ శూర్పణఖలను భూమికలు నిలిచిపోగలవు. వానిని పేర్కొనక యెవరును రామకథ నెరుగజాలరు." శూర్పణఖ కథనము ఆగిపోయినది. రావణుడు ఆనందముతో గలగల నవ్వి యిట్లనెను.

"చెల్లెలా! నీ భాగ్య మీనాటికి ఫలవంతమైనది. నా కాలమును దానితో కలసివచ్చినది. అన్న చెల్లెళ్లమైనందున అవి కలసివచ్చినవి. సేవ్యులైన ఆ దంపతులకు నే జేసిన సేవ ఫలించుచున్నది. నాకు మంచి వార్త దెచ్చితివి.

నాకు గతస్మృతిని కలుగజేసితివి. పూర్వము సనత్కుమార మౌని చెప్పిన పలుకుల యర్థము విశదమైనది. ప్రజ్ఞావంతుల మాటలు ఊరకే పోవునా? వృథా యగునా? జనకరాజ పుత్రితోను, సుమిత్రానందనునితోను కలసి రామచంద్రుడు దండకకు వచ్చినాడని, అమృతతుల్యమైన పలుకులు నా చెవుల బోసితివేమో చెల్లెలా! ఆనాటి నుండి యీనాటి వరకు నా మనసు వానికొరకే యెదురు చూచుచున్నది. నేనీ నాటికి రామస్వామికి జ్ఞాపకము వచ్చియుందును.

"రాముడు పువ్వుల వంటి నవ్వులను నీపై రువ్వినాడు. తన పలుకులు చూపుల ద్వారా అమృతము నీపై గ్రుమ్మరించెను. నీవును, మన కుటుంబమునకు ఖ్యాతిదెచ్చు తమ్ముడు విభీషణుని గురించి భగవంతుడైన రామునితో అభయమిచ్చునట్లు చెప్పితివి. ఇక మన వంశమునకు విభీషణు డొక్కడే చాలును. వానికిక మంచి రోజులు వచ్చును. విభీషణుడు సన్మార్గగామి యని ప్రాజ్ఞులాడు మాటలు – ఈనాటికి ఫలితమునకు రానైయున్నవి. సమీప భవిష్యత్తులో జరుగబోవు రామ రావణ సంగ్రామము నాటికి విభీషణుని ధర్మబుద్ధి పూర్తిగా వెల్లడియగును చూడుము.

"ఈ భాగ్యము చాలును. నీవు రామప్రభువుతో వాడు దానవ చేష్టలు లేనివాడని, ధీమంతుడని, ధర్మవర్తియని చెప్పితివిగదా! మనలో మన మాటగా జెప్పుచుంటిని. వినుము. ఆ ప్రభువు నీతో మాట్లాడెను. లక్ష్మణస్వామి ముక్కు చెవుల గోయుటకైనను నిన్ను తాకెను. ఆ జానికియో? నీకు సవతి గదా! నీకు యింకేమి కావలెను? రఘురామ ప్రభువును వలచి నీవు ధన్యురాలవైతివి. నేను నా జన్మను హరించుటకై ఎరపెట్టెదను. అందుకు భూపుత్రిని దెచ్చి తరించ వలెను. ఇంతకు, ఆ తాటకాపుత్రుని ఆయువు చెల్లిపోగలదు. ఈ మహా నాటక సూత్రధారిగా నీ రావణుడు రంగప్రవేశము చేయగలడు.

"సోదరీ! మారీచుడు సిద్ధాశ్రమమున యజ్ఞకాలమున స్వామిచే నుపేక్షింప బడెను, కాని యీమారు తప్పిపోలేడు. ఆ యుపేక్ష యిందుకొరకేనని తెలియు

చున్నది. ఈ రావణుడును రామప్రభువు చేత జచ్చుటకై వేచియున్నాడు. దీనికై నే ననేక మార్గము లన్వేషించితిని. ఇప్పుడు మార్గము లభించినది. రామపత్నిని దొంగిలించెదను. చెల్లెలా! నీ మాటలు మంత్రములై కార్యసిద్ధి నీయగలవు. నీకొక మహారహస్యము చెప్పెదను సావధానవై వినుము. పూర్వము నా నివాసము స్వామి నివాసమైన వైకుంఠమే. మేమిద్దరము అన్నదమ్ములము, స్వామి సేవకులమై – ద్వారముల గాచి యుండెడువారము. మహానందముగా తృప్తిగా దినములు గడచుచుండెను.

“జయ విజయులని పిలువబడుచు, భక్తితోను, అవధానముతోను ఉంటిమి. ఒకనాడు మౌనులు నల్వురు వచ్చి లోనికి పోవుచుండగా మేము మంచి మాటలతోనే ‘ఇప్పుడు సమయము కాదు, లోనికి పోరాదు. వేరొక మారు రమ్మంటిమి’. వారిలో నొకడు గడ్డము మీసములు గలవాడు, చంకలో యోగదండ మున్నవాడు, పాదుకలు గల పాదములు జాడించుచు – ఎఱ్ఱనైన కండ్లు గిరగిర ద్రిప్పుచు ‘మీరు మమ్ములను పోనీయక వెళ్లగొట్ట జూచుచున్నారే, మీ పాడుబుద్ధికి ఫలితమనుభవింపుడు’ అని తన కమండల జలము నరచేత బోసుకొని, ‘మీ యవినయమున కేడుజన్మల శాపమీయ దలచియు కరుణించితిని. మూడు జన్మల కాలము రాక్షసులై యుండెదరు. ఏడ్చినను మొత్తుకొనినను ఫలము లేదు. పొండు’ అనెను.

“మహాత్ములైన పెద్దలు సామాన్యులుగా కనిపింతురే కాని, వారు అమోఘ వచనులు, తపఃశక్తియుతులునై యుందురు. దయ కలిగిన నాదరింతురు. వారి కోపము ఎండుకట్టెల నగ్నివలె కాల్చివేయును. ఎంత భుజబల శౌర్యబలము లున్నను ఏమియు ప్రయోజనముండదు. తాపసుల శక్తి ముందెంతవారైనను తల వంచవలసినదే. వారి శాపఫలముగా రాక్షసులమై హిరణ్యకసిప హిరణ్యాక్షులమై చిరకాలముండి శాపాంతము పొందితిమి. రెండవ జన్మలో రాక్షస ప్రభువులుగా రావణ కుంభకర్ణుల మైతిమి. ఇదియే మా జన్మ రహస్యము.

"ఎన్నదగిన దేవతావంశమున బుట్టిన మాకు రాక్షస జన్మము రాచపుండు వలె సంక్రమించినది. దీనికి వైద్యుడా కమలనయనుడే. ఆ శౌరియే శస్త్రచికిత్స జేసి యీ వ్రణబాధ నివారింప గలవాడు. ఆ శుభగడియ యెప్పుడు వచ్చునో! ధర్మాధర్మముల గుర్తించలేని రాక్షసజన్మ మెత్తుటచే, జ్ఞానము నశించినది, కండ కావరమెక్కినది, ఘోర పాతకముల రాసులు పోసితిని. బలహీనులైన మనుజు లేమి చేయగలరను తృణీకార భావముతో వారిని అలక్ష్యము చేసితిని. వారి నుండి మరణము లేకుండ వరము కోరనైతిని.

"చెల్లెలా! ఆ మహాత్ముడెప్పుడు వచ్చునో? ఆయన దర్శనముతో మా బాధ లెప్పుడు తీరునో? ఈ రాక్షస జీవితము నుండి ముక్తి యెప్పుడో? అని యెదురు చూచి చూచి, వేసారి, భవిష్య మెరుగగోరి – సనత్కుమారు మునీంద్రుని దర్శింప నేగితిని. ఆ ముని – దేవరహస్యమును – రావణా విను మని చెప్పెను. శ్రీహరి మనుజుడై భూమిపై జన్మించి, భార్య సీతతోను, తమ్ముడు లక్ష్మణునితోను దండకావనమునకు వచ్చును. తానొక జింక రూపమెత్తి, తాటకా తనయుడైన మారీచుడు – భూపుత్రి జానకిని మోహపెట్టును.

"పరమాత్మయైన రాముడు సీత కోరికకు అంగీకరించి – పట్టితెచ్చుటకా మాయామృగము వెంట పర్వెత్తును. వాని వెంబడి వాని సోదరుడు లక్ష్మణుడును వెళ్లును. అప్పుడు నీవు జానకిని హరించి లంకకు చేర్చెదవు. అప్పటితో రాక్షస జన్మమున నీ పాత్ర ముగియును" అని చెప్పగానే నాశ్చర్యము చెందితిని.

"సోదరీ! ఎంత చిత్రము! కమలనయనుడా శ్రీహరి. మన్మథ మన్మథుడు. దేవదేవుడు. మానవ జన్మనెత్తునట. వరములు కోరునప్పుడు ఎవరిని హీనులని నేను వారినుండి మరణము లేకుండ వరముల గోరియుండలేదో – ఆ హీన మానవ జన్మనెత్తునట! జగద్రక్షణకై నీచ వరాహరూప మెత్తినవాడు, హీన మానవ జన్మనెత్తుటకు అభిమానపడునా? కోటిసూర్యప్రభా సంపన్నుడా వైకుంఠుడు – నేను ఉపేక్షించిన మానవ జన్మమెత్తుటను ఆలోచింపగా, నేను నిర్జింపబడుట

వానిచేతనే యని రూఢియగుచున్నది కదా! మంచిదే, అంతటి మహాత్ముడా శౌరియే స్వయముగా విచ్చేసి యీ దానవ జన్మము నుండి విముక్తి ప్రసాదించుట కంటె కోరదగిన దేముండును?

“ఆ లక్ష్మీపతి ఎన్నటికి కనిపించునోయని, ఎప్పటికి – ఇంకెప్పటికని ఎదురుచూచితిని. రానందున విసిగి వేసారితిని. నేడు, రేపు అని యిరువది కన్నులతో నెదురు చూచితిని. వానిని రప్పించుటకై వాని కభిమానపాత్రులు సాధుజీవులునైన మునులను బ్రాహ్మణులను బాధించితిని. విసిగిపోయి నిరాశ జెందితిని. ఈ స్థితిలోనున్న నాకు – నాకు ముక్తి ప్రసాదించుటకా హరి యవత రించెనని తెలిసి ఆశలు చిగురించెను. కాని వాడు రానందున హతాశుడ నైతిని. నా భటులను యాగములు ధ్వంసము చేయుడని నియమించితిని. ఆ కాలముననే వాడు విశ్వామిత్ర యాగరక్ష జేసి భూపుత్రిని పెండ్లాడెనమ్మా!

“మునులను బాధించినను, బ్రాహ్మణహింస జేసినను, యజ్ఞముల పాడొనర్చినను ఆ రాముడు రాలేదని క్రోధము వహించితిని. దానితో జానకిని హరించుట, ఆమెను దుర్భాషలాడుట వంటి అపరాధములు చేయదలచు చుంటిని. ఇతర దుష్కార్యములు చేసినను వేగిరమే రాని లక్ష్మీపతి, భార్య నపహరించి తెచ్చిన తక్షణమే రాకమానడు. పరుల సొత్తు హరించినను పరులను బాధించినను తొందరపడక పోవచ్చును, తన శ్రేష్ఠమైన సొత్తు నపహరించిన రాక ఆలసించునా? భూపుత్రి నపహరించు శక్తి నాకు కలదా? ఐనను యిది ప్రచ్ఛన్నముగా సాధించవలయును. ఇందుకు మారీచ సహాయమే శరణ్యము.

“సాక్షాత్తు లక్ష్మియైన సీతను – మహాపతివ్రతను – లోకమాతను దొంగిలించుట సాధ్యమైన పనియేనా? ఆమెనే విధముగా తీసుకొనిపోగలను? మార్గము సుగమముగా కనుపించుటలేదే. ఆమెకు లంకలో ప్రవేశించ వలెనను అభిలాష లేనిచో నది అసాధ్యము. ఆమె అనుకూలముగా స్పందించిననే సాధ్యము. ఆ తల్లి నా తలపును సాధ్యము చేయునను విశ్వాసము కలుగుచున్నది.

నేను సద్వంశములందు జన్మించిన స్త్రీల నెందరినో బలవంతముగా లంకకు తెచ్చి నిర్బంధమున నుంచితిని. ఇది యా శ్రీనాధుడెరుగనిది కాదు. అతడు పేక్షించినను సీత జాత్యభిమానముచేత – వారిని చెర నుండి విడిపించవలెనను వేగిరపాటుచే, లంకకు వచ్చుటను సుగమము చేయునని నమ్ముచున్నాను.

"రాముడు నిన్ను చేరబిలిచి సల్లాపము లాడెనను కినుకయు, నీవద్ద 'మా వదినె మంచిదికాద'ని లక్ష్మణుడు పలికెనను క్రోధమును సీతకు తప్పక కలిగి యుండును. అవి యామె హృదయమున నుండుటచే లక్ష్మణుని పరుషములాడి నొప్పించియైనను దూరము చేసి, రాముని వదలి లంకకు రానిచ్చగించునని ఆశించుచున్నాను. ఇది ఆంతరంగికమైన పరమ రహస్యము ఆదిలక్ష్మి భగవంతుడైన పతిదేవుని వదలి ఒక సేవక భక్తునింట నుండగలదను రహస్యమది. కానిచో పతివ్రతారత్నమా జానకి – నేనో, పాపులలోకెల్ల పరమ పాపిని. ఆమెను కదల్పగలనా? సనత్కుమార ముని వాక్యము రిత్తయగునా? కాదు – కాజాలదు. ఇది జరిగి తీరును.

"సోదరీ! నీపై ఒట్టుపెట్టి చెప్పుచున్నాను. రాముడు సామాన్య మానవుడు కానేకాడు. ఆ ఆలోచన నాకు లేదు. ఆ పరంధాముడు నా యిహ సంచయముల తొలగించి పరమపదమీయగల నారాయణుడు. కాని వానిని దర్శింప వెళ్లుటకు కాళ్ళు సాగుటలేదు. వాని కెదురుపడి నిలువ గల గుండెదిటవు లేదు. వాని వద్దకు పోక దూరమునుండియే తొంగి చూచెదను. నేను మానవ భక్షకుడనుగా జన్మించితిని. ముల్లోకములను జయించిన కీర్తినందితిని. నాయీ చేతులతో కైలాస పర్వతము నెత్తిన బలవంతుడను. ఇంతటి వాడనైనను దొంగనై సీతనెత్తుకొనిపోవు దుష్టుడనగుదును.

"ఆ రాముడు శతకోటి మదనుల దివ్యము శుభకరమునైన, వైభవమును నీకు జూపినాడు. వాడు లీలగా నీకు చిక్కినట్లు తోచును. వానియందు నీకు గల వలపు నేడు గాకున్నను సోదరీ! రాబోవు జన్మమందైన ఫలించి తీరును.

దీనిని మనమధ్య మాటగా నుంచుము. ప్రాచుర్యము కానీయకుము. హరి మాయ గ్రహింప సాధ్యముకాదు. అది నేను జానకిని తీసుకొనిపోవ వీలు కల్పించగా, నా మనసున పౌరుషము రగిలించి, రఘురాముడు తానై లంకలో ప్రవేశించును. నన్ను సంహరించును. దానితో నా రెండవ రాక్షస జన్మము తీరిపోవును. ఆపై నింకను మరొక జన్మ మిగిలియుండును.

"ఈ రావణుడు ప్రదర్శించబోవు అంతిమ రంగము యొక్క అర్థము నా జానకీరాములు ముందుగా గుర్తించి, నాకు మార్గము సుకరము చేయుచున్నారు. నేను ముందుగా నాదిలక్ష్మితో లంక ప్రవేశించెదను. తరువాత రాముడు జానకి కొరకు లంకాప్రవేశము చేయును. ఆ దంపతుల రాకచే లంక పవిత్రమగును. నా సమస్తమును వారికి సమర్పితమగును. సోదరీ! శూర్పణఖా! నీవు పవిత్ర చరిత్ర గలదానవై పర్ణశాల యొద్దనే జానకీరాముల దర్శించితివి. లక్ష్మణుని స్పర్శాభాగ్యము పొందితివి. ఇహలోకమందే నీకీ భాగ్యములు లభించినవి. నాకును ఆ ముువ్వురిని సేవించు నదృష్టము కలిగినచో, నా కథకు స్వస్తి చెప్పెదను" అని రావణుడు తన రెండు చేతులు జోడించి పర్ణశాల దిక్కై నమస్కరించెను.

**'పర్ణశాల' సమాప్తము**



# శబరి

## సాక్షాత్కారము :

భళిరా! భళా! ఏమా శరీర సౌష్టవము! ఏమా దేహకాంతి! ఎవరయ్యా వారు? మెరుపు వంటి కాంతితో శ్యామలవర్ణముతో ముద్దులొల్కుతు ఆనందము కలిగించువాడు! ధూళిగప్పి, జుంజురులవలె ముఖమున వ్రాలు జడలు బంగరు మేనిఛాయ కలిగి దర్శనీయుడైయున్న, ఆతడెవరో? దేవతామూర్తులు కారుగదా? భవ్య పంపాతీరము నుండి వచ్చు వారెవరోకదా! శ్రేష్ఠ సర్పరాజముల వలె భుజముల వ్రేలు ధనస్సులతో, మొనలుదేరిన ఖడ్గములతో మెరిసిపోవుచున్నారు. దగ్గరకు వెళ్లి నిదానముగా వీక్షించిన గాని వారిని గుర్తింప వీలుకాదు. చూడగా వారు రాజపుత్రులు కారుగదా?

ఔరా! ఇది యెక్కడి అందము. నల్ల కలువల కాంతులను గేలిచేయుచున్న



చక్కని నీలవర్ణముతో అవయవ శోభ – ఎంతటి విరాగులనైనను మోహపెట్టజాలి యున్నది. అట్లు ముందు నడచుచున్నవాడే వారిలో పెద్దగా తోచును. వీరియందు రాజఠీవి తొంగిచూచుచున్నది. ఎంతటి శత్రువునైనను నిర్జించగల శౌర్యము ప్రస్ఫుటముగా నున్నది. వీరి వేషములే వీరు వీరులని తెలుపుచున్నది. అట్టి వీరి ముఖముల విచారరేఖలు కనిపించుచున్నవే! ఇది నమ్మశక్యము కాకున్నది. లోభ మోహములను ఆశను వదలిన వీరికి విషాదమా? అది స్త్రీ లక్షణము. పురుషశ్రేష్ఠుల దరిచేరనిది. వీరి దెటువంటి సమస్యయో కదా!

వారి పద్మనయనములు దీనత్వము పొందినవే! కన్నీటి ధారలు చెక్కిళ్ళను దాటి నేలకు జారుచున్నవి. అందెంతటి బాధయో? అడుగుతీసి అడుగు పెట్టుటయే కష్టముగా నున్నది. ధనస్సులనే ఊతకఱ్ఱలుగా మార్చుకొన్నారు. ఈవైపునకే వచ్చుచున్నారు. త్రోవయంతయు దర్భముండ్లే కదా! అవి పాదములకు గ్రుచ్చుకొని బాధించుచున్నవేమో? ఇది క్రూరమృగ సంచారభూమి. ఎప్పుడేది మీద పడునో తెలియదు. పైగా క్రూర రాక్షస విహారభూమి. మనసున కోరిక లేకున్న దుఃఖముండునా? అది యేదో మహత్తరముగా నీ యువకుల బాధించు చుండవచ్చును. కనుకనే మృగములగాని రాక్షసులగాని గుర్తింపని ఏమరుపాటున నున్నారు.

వెంటనంటి వచ్చు ఆ రెండవవాడు, తన నెదిరించు యెంతటి వానినైనను పిండిచేయజాలిన వానిగా కనిపించుచున్నాడు. వాని హృదయమున కేమి యాఘాతమైనదో, పాపము కన్నీరు గార్చుచున్నాడు. వాని బంగరుమేని ఛాయ శుష్కోపవాసములచే కాబోలు, వన్నె తరిగి యున్నది. దేహము శుష్కించినది. వాని ఉత్తరీయపు కొంగున నేదో ముల్లె యున్నది. అవి వేరేమియు కానక్కరలేదు. వాని యీ విచార కారణమేమై యుండును? ఎంతగా నాలోచించినను తెలియ రాకున్నదే!

అడుగుబెట్ట వీలులేకయు, కాలు ముందుకు వేయునుత్సాహము లేకయును పాదముల గదపు శక్తిలేకయు; ఆ ముందు వెళ్లువాని పాదములు తడబడుచున్నవి. వెనకవాడు వీని కెంతటి బంధువోగాని, తన చేతి నాధారముగ నిచ్చుచున్నాడు. వీరి గమ్యమేదియో? వీరెవరో? ఎక్కడివారో? ఈ చోటునకు వచ్చిన కారణ మేదియో ఇంతటి సుందరులైన వీరు ఈ అడవిని సంచరించి ఆపదలపాలై యుందురా? ఏ రాక్షసుడు చూచిన వారిని బ్రతుకనిచ్చునా?

వీరి చేతుల నాయుధములున్నవి. కనుక ఆ భయముండదు. కాని ప్రమాదముల నిలయములగు యీ వనముల యింకేల రాదలచిరో? వీరి నెచ్చటనో చూచినట్లున్నది. ఆ స్మృతి యేదో మనసున నున్నను విశదమగుట లేదు. వీరిని వెంబడించి వెళ్లిన ఆ వివరములు తెలియగలవు. ఎదుట నది యేదో పర్ణశాలగా నున్నది. ఆవలనున్నది పంపా సరోవరము కావచ్చును. ఆహా! స్ఫురించినది. వారు రాముడును, లక్ష్మణుడును. వారిచటికి రాగలరని బోయెత యైన శబరికి తెలిసియుండును.

"సర్వజగద్రక్షకుడగు శ్రీహరి – యింతకుముందు తానున్న చిత్రకూటమును వదలి, యీ శబర స్త్రీ యింటికి వచ్చుట యనగా సామాన్యమా? ఆహా! ఏమి వాని కరుణ! ఏమి వాని వాత్సల్యము! ఈ ఆనందము హద్దులు లేనిది. ఎంత భాగ్యము! దాసులకు కల్పవృక్షమా! మా చింతలు మాన్పవచ్చితివిగదా! ఇంత శ్రమపడి వచ్చి దర్శనభాగ్యమిచ్చితివి కదా! రాఘవా! నిన్ను చూచి యెన్ని సంవత్సరములైనదో? చాలకాలమున కిచ్చిన పునర్దర్శన మిది. నీకై యెదురు చూచి చూచి కండ్లు కాయలు కాసెను కదరా! చిత్రకూటము నిన్నును మీ తమ్ముడు లక్ష్మన్నను చూచియు చూడనట్లున్నది. గతస్మృతుల మాట యట్లుంచుము. రామభద్రా! భద్రమా?

"రామయ్యా! నీ శరీరము నీ విధముగా శ్రమతోను ఉపవాసముల చేతను

శుష్కింపజేసినను నీ సొగసు సుంతయైనను తగ్గక యిప్పటికి మెరుగగుచున్న దయ్యా! ఈ చక్కదన మెవ్వరి కుండునయ్యా! చక్కనివాడు చిక్కినను సొగసరియే కదా! నీ సవతి తమ్ముడు భరతుడు రాత్రింబవళ్లు నీకొరకై కన్నీరు నించుచు శ్రమ జెందుచున్నాడు. నీటినైనను ముట్టడు. నీ పాదుకలపై తన తలనుంచి దుఃఖితులపై జాలి తలపవలదా?

"రామచంద్రా! బొత్తిగా నలిగిపోయితివి కదా! భోగము లనుభవించుచు నుండవలసినవాడ వెంతలో మారిపోయితివి. సాధు రూపము వచ్చెనయ్యా! నిన్ను ఇట్లు చూడలేకున్నానయ్యా! ఏమి జరుగుచున్నదో గ్రహింపక పరాకేలను? నీ నారవస్త్రము జారుచున్నది. కొంచెము బిగించి కట్టుకొనుము. నీ జుట్టు జడలు జడలుగా నీ ముఖముపై ముసిరినది. దానిని తొలగద్రోసుకొనుము. తలకు బిగించి కట్టుకొనుము.

"అయ్యో! రామయ్యా! నీ రొమ్ముపై ఆ గాయము లేమిరా? క్రూరులైన నరభక్షకు లొక్కుమ్మడిగా నీపై తలపడి చేసిన బాణప్రయోగముల గుర్తులై యుండును. ఎంత పెద్ద గాయములు! రక్తము గూడుకట్టెను కదా! ఎంతటి ధీమంతునికైనను ఈ గాయముల జూచిన జలజల కన్నీరు మున్నీరగునురా! నీ వాలకము చూడగా నివారింపరాని విపత్తేదియో సంభవించినట్లు తోచుచున్నది. నీ తరచైన నిట్టూర్పులు, పెదవులు వణకులు అందుకు తార్కాణములై కనిపించుచున్నవయ్యా!

"నీ మన్మథ రూపము ప్రకాశించు సౌందర్యము, యిట్లు మారిపోవ కారణ మేమిరా? అయ్యో! తండ్రీ! లక్ష్మన్నా! నీ శరీర శోభయు తరిగిపోయినదయ్యా! మీలోనెంత మార్పు వచ్చినది. లక్ష్మణా! మీ యన్న శోభ తరిగిపోయినదేమయ్యా! శత్రువుల నుండి పరాజయము కలిగెనా? వారు దుఃఖము తెచ్చిపెట్టిరా? మీ స్థితి మీ చెంపలపై నున్న కన్నీటి చారికలే తెలుపుచుండెను కదా! శత్రువు

వలననైన తిరస్కార మెవనికిగాని భరింపరానివే. లక్ష్మణా! ఆగుమాగుము. రఘు వంశదీపకుడైన మీ యన్న రాముడు, ఈ లేయెండకే తామరతూడువలె వడలిపోయినాడు. ఒక్కింత శ్రమదీరగా నా చెట్టునీడ కూర్చుండ గలడేమో? నాయనా! ఇప్పటి కిట్లున్నారు. మిమ్ముల జూచి నా మనసు క్షోభచెందుచున్నది. రేపటి కెట్లుందురో? ఎట్లు చెప్పగలము?

"నాయనా! రామచంద్రా! రేపటి సంగతి యనగా జ్ఞప్తికి వచ్చినది. అయోధ్యలో మరునాడు నీ వధిష్టించవలసిన యువరాజ్య సింహాసనము నీది కాలేదు. రాజ్యలక్ష్మి నీ భుజము నుండి జారిపోయెనుకదా! ఆ విధానము గుర్తున్నది కదా! ఈ రోజువలె రేపటి దినము ఉండదని తెలిసినది కదా! కాలచక్రము నిలువదు. పరిభ్రమించుచునే యుండును. దాని తత్త్వమెవరికిని అంతుబట్టనిది. మిమ్ముల జూడగా నా కేదియో వెలితిగా నున్నది. తండ్రీ! కారణమేమిరా? ధనుస్సా? సర్ప సమానమై యున్నది. ఖడ్గమా? మిలమిల మెరియుచునే యున్నది. లోపించినదేది?

"ఆ, ఆ, తెలిసినది. మాటల సందడిలో అడుగ మరచితిని. జానకి యేదిరా? రామయ్యా! మీరిద్దరు ముందు నడచివచ్చి యుందురు. పాప మా సుకుమారి నడువజాలక మధ్యలో నెచటనో నిలచి యుండును. ఆమె నట్లు దిగవిడచి వచ్చుట తగునా? అసలే యిది రాక్షసులు సంచరించు భూమి కదా! విషయము చెప్పక మౌనము పూనెదవేలరా? లక్ష్మణా! మీ వదినె దారితప్పినదేమో? వెళ్లి చూడరా, తండ్రీ! కదలక నిలచి కన్నీరు కార్చెద వేలనయ్యా! నీకును మీ వదినెకును మాట పట్టింపు వచ్చెనా? దానితో మనసులు మారెనా? కదులవేమి?

"ఈ ముండ్ల దారులబడి నడచి వచ్చితిరి. బాబూ, రామా! అదేనయ్యా, యీ శబరి ఆశ్రమము. రామా! ఓ లక్ష్మణా! రండు రండు. అచటనే మీ దుఃఖములు వెడలగ్రక్కెదరు గాక! సీతనేమి చేసితిరో చెప్పుదురు గాక!

## పంపా సీమ :

అదియే శబరి నివాసము. ఆ యాశ్రమము చెంతనదే రాముడు కూర్చొని యున్నాడు. భార్యావియోగముచే కలిగిన విరహబాధ హృదయము నందగ్ని జ్వాలవలె వ్యాపించి బాధించుచుండ, పంపా సరోవర జలముపై కెరటములను గాలులు తాకి నీటి తుంపరలను లేపగా, వాటివలన చల్లబడిన గాలులు మెల్లగా వచ్చి వానిని తాకి తాపమును తీర్చుచున్నవి. అరగన్నులతో శూన్యమునే చూచుచు జింక చర్మముపై కూర్చుని యున్నాడు. సరోవర నీటిబిందువులు సూర్యభగవానుని ఉషోదయ సేవకై సిద్ధముగా నున్న బంగారు పూలవలె కనిపించుచున్నవి. సూర్యకిరణములు వానికా శోభను ప్రసాదించినవి. సూర్యుడు వానిని రామసేవకై నియోగించినాడో యనునట్లవి శ్రీరామ పాదద్వయముపై వచ్చి వ్రాలుచున్నవి.

ప్రాతఃకాల పంపా సరోవర శోభ వర్ణనాతీతము. ఆకాశమున నొక సూర్యుడు ఉదయపర్వతముపై నాసీనుడై యున్నాడు. పంపా తీరమున సూర్యవంశజుడైన రాము డాసీనుడై యున్నాడు. ఆకాశమున నాతడు ఎఱ్ఱని కాంతుల పరచుచుండ పంపా సరోవరముపై నీతడు నీలకాంతుల బరచుచున్నాడు. దానిని చీకటిగా భావించి, రాత్రి యైనదని కలువలు వికసించినవి. రాముని రాజీవ నేత్రముల జూచి కొలనులోని తామరలది పగలని భావించి విచ్చుకొనియున్నవి. నిట్లు పంపా సరోవరము ఒకేమారు విచ్చిన కలువలతోను, కమలములతోను ఆశ్చర్యము గొలుపుచుండుట చిత్రము కదా!

బోయత శబరి – అదే – శ్రీరామున కెదురుగ స్థిరముగ కూర్చుని నోటితో ఫలముల గొరుకుచు, తల యిటునటు నూగుచుండగా, పెదవుల గదలించు చున్నది. ఏమియో చెప్పుచున్నది. సుమిత్రా సుతుడు ముక్కుపై వ్రేలుంచి, అది గొప్ప యపచారమని భయపెట్టుచున్నను, ఆమె దానినేమైన కనిపెట్టునా, వినునా, పట్టించుకొనునా, లక్ష్యపెట్టునా? విను విను మని సంజ్ఞ చేసి చెప్పినను

శ్రీరాముడు వినుటయు వట్టిమాటయే. రాముడు తన చేయి చాపగా, నామె తాను కొరికి చూచిన పండ్లు వానిచేత బెట్టెను. ఆమె యెంతో ఆప్యాయతతో పెట్టగా రాముడెంతో ఆదరముతో గైకొనెను. ఎంతటి అపేక్షయో కదా!

ఆమె చేసిన తారకమంత్ర జపసిద్ధి పొందినది. జప సమయమున నామె భావమున రామరూప సౌందర్యములు ముద్రితములైనవి. ఇపుడామె వానిని ప్రత్యక్షముగా చూచుచుండుటచే తన్మయత్వము చెందుచున్నది. భావావేశపూరిత యైనది. రామునియందు తదేకదృష్టి నిలిపి, గద్గద స్వరముతో నేమియో పలుకుచుండెనేగాని, అర్ఘ్యపాద్యము లిచ్చుట మాత్రము మరచినది. "తండ్రీ! రామయ్యా! దండక నుండి యింత దూరము వచ్చుటలో దారియందు దర్భలు, ముండ్లు గ్రుచ్చుకొని గాయములైన నీ పాదములు వాచినట్లున్నవి. ఏవీ, వానిని చూపుము. ఎంత బాధనందుచుంటివో కదా!" అని యామె తన చీర చెరగును నోటబెట్టుకొని ఊది, వెచ్చగాజేసి, వెచ్చగా వానికి కాపుబెట్టసాగెను.

ఆమె "రాఘవా! నీ పవిత్ర పాద నిధి నాకీనాటికి కదా లభించినది!" అని వానిని కండ్ల కద్దుకొనుచు, హృదయమునకు హత్తుకొనుచు, స్తోత్రము చేయుచు, నమస్కరించుచు, ఆనంద బాష్పములచే వానిని తడుపుచు, నిట్టూర్చుచు, ఆ నిట్టూర్పుల వెచ్చదనముచే మరల పాదముల తడి యార్పుచుండెను. "రామచంద్రా! తరింపజేయు నీ యీ పాదద్వయము పట్టుకొను భాగ్యము, భిల్లులుగా జన్మించిన మాకే ముఖ్యముగా కలిగినది. ఆనాడు నీ వడవికి బయలు దేరగా నీ పాదములు మొదట పట్టుకొను అవకాశము గంగాతీరమున మా గుహునకే కదా లభించినది? ఇది వారి నోముల ఫలమురా తండ్రీ!"

"మేము చేపలు పట్టువారము. నీవు అంతకంటె నేర్పుగా మా హృదయ మీనములను వలలేకయే పట్టితివి కదా! అజ్ఞానులమైన మాకు నీ పాదము లంటి తరించు మార్గము జూపితివి. అది నీవు మాకు చేసిన మహోపకారము.

నీ దయాగుణము వాత్సల్యము సాటిలేనివి. ఈ బోయజాతికి నీ దయకంటె వేరేమియు నక్కరలేదు. ఆదికాలము నుండియు నీ, మా చరిత్రలకు లోకము లెరుగని బంధమేదియో నిలచియున్నది. మేము భగవంతుని స్మరించి – భగవద్దాసులమై – స్వామి సేవకే అంకితమైనాము. తండ్రీ! మన మధ్య గల యీ సేవానుబంధము గుర్తించవలెనన్న ఏ వాల్మీకియో దిగి రావలయును. ఏ ఆదికావ్యమో వ్రాయబడవలెను. రామయ్యా! మాపై కటాక్షముంచుమురా!"

"చేపలకంపు భరింపలేక, ఎవరును మా యొద్దకు చేరని జన్మలు మావి. అన్నెము పున్నెము నెరుగని పక్ష్యాదుల జంపు కులము మాది. జీవ – సాధుజీవ హింసా జీవనులము మేము. అట్టి పాపులమైన మా జాతిని చూడవచ్చి – నీవై వచ్చి – వారి కాలింగన భాగ్యము ప్రసాదించి, శ్రీకరమైన నీ పాదసేవ చేయు నదృష్టము కలిగించినవాడవు. ఇంతటి కరుణారస మింకెవరు ప్రసరింప జేతురురా, తండ్రీ! మాకు వేదవిహిత కర్మల నాచరించు నదృష్టము లేదే! తపస్సు చేసి తరించు నాచారమును లేదే! యజ్ఞ యాగాదులు తెలియవే! స్వామీ! అవియేవి లేకపోయినను మాకు నీ దయా వీక్షణమే జ్ఞానము, భక్తి, తపస్సు, కర్మ, ఉపాసన, యాగము. మాకు సర్వము నీ దాస్యమేరా తండ్రీ!

"లోకముల వెలిగించు చల్లని చంద్రకాంతివంటి శరీరశోభతో వెదకుకొనుచు వచ్చి యీ దాసురాలిపై దయ ప్రసరింపజేసితివి. దానివలన గదా! పవిత్రనైతిని. రామస్వామీ! నేను నీకొరకై వెదకుచున్నను, నిన్ను కనుగొనుట నావంటి భిల్లస్త్రీకి సాధ్యమగునా? నా కగుపించువాడవా? నీ దయయే దానిని సుసాధ్యము చేసినది. ఎంతవారికిగాని నీ కటాక్షము కలుగని నాడు, జపతపములు, నియమనిష్టలు మొదలగున వెన్ని చేసినను అవి నిష్ఫలములే యగును. మార్గశ్రమకోర్చి, శ్రమతో సోలినను, దండక నుండి యింత దూరము, ధనస్సు నూతకఱ్ఱగా పట్టుకొని – యీ దాసి నుద్ధరింప వచ్చితివి కదా!

"రామయ్యా! వయసు పైబడినది. చూపు మందగించినది. తలకు వంటికి

కంపము కలిగినది. కంటికి కునుకు వచ్చుటలేదు. అసలు నిద్రనే మరచి పోయితిని. పాదములు తొట్రుపడుచున్నవి. ఇన్నిటిని భరించుచు నీవద్ద నేమేవియో విన్నవించుకొనవలెనని యీ విధముగా కనిపెట్టుకొని యున్నాను. ఓ దయాసముద్రా! నీ శ్రమను కష్టములనే చూచుకొనెదవా? నా గోడు ఆదరముతో విందువా? ఈ దాసురాలికి గురువులు మతంగ మహర్షులవారు. వారు తమ యోగప్రభావముతో వీక్షించి చెప్పిరి, "బోయతా! శ్రీరఘు రామచంద్రుడు చిత్రకూట ప్రాంతమునకు విచ్చేసియున్నాడు. వాని వెంట తమ్ముడు లక్ష్మణుడును భార్య సీతయు నున్నారు. అల్పకాలముననే రామ సందర్శన సేవాభాగ్యములు నీకు ప్రాప్తించును. దానితో నీ జన్మ తరించిపో గలదు" అని చెప్పిరి.

"ఇప్పటికీ విధముగా నా నిరీక్షణ ఫలించినది. మా గురువులు చెప్పి వెళ్లిన నాటి నుండియు నే జేసిన పుణ్యము మార్గముగా, నిద్రాహారములు మాని, పంపా సరోవరజాలము మాత్ర మాహారముగా – నిన్ను జూచు నాసతో కొనప్రాణములతో వేచియుంటినిరా. నా నిరీక్షణ ఫలింపజేసి, తండ్రీ నీవు వచ్చితివి. నా గురువర్యుని పాదసేవ దీక్షగా జేసిన ఫలముగా – రామయ్యా! ప్రత్యక్షమైనావు. నన్నేలిన దేవరా! నిన్ను సేవింపవలెనను కోర్కియే సంపద. దాని వలన పాపసంచయము లన్నియు పటాపంచలైనవి. పద్మనేత్రా! నా తండ్రీ! రామచంద్రా! నీ వీక్షణ మాత్రముచేతనే మోక్షలాభము కలుగును కదా!

"నా గురుదేవులు తమ తపోశక్తి వలననే నిన్ను సేవించి తృప్తినందిరి. అజ్ఞానిని, మార్గమెరుగనిదానను. వారి వాక్యమునే నమ్మి నీ కొరకు వేచి యుంటిని. పంపానదిపై నుండి చల్లని గాలి సోకిన అది నీ చూపేనని భ్రమించు చుంటిని. సరోవర కమలముల జూచి నీ నేత్రములని తలచితిని. దూరమున కనిపించిన మేఘమును జూచి నీవేయని తలచితిని. ఉరుమగా విని నీ గంభీర

కంఠస్వరము వింటి ననుకొంటిని. దాశరథీ! ఈ అవయవములు ప్రకృతి సంబంధులై భ్రమలు కలిగించి మోసబుచ్చినవి. ఆ మలినములు నశించునట్లు, దోషములు తొలగునట్లు, నీ శరీర శోభను చూడదగిన దృష్టినిచ్చితివి. నీ రాకయే నా పుణ్యము. నీ దర్శనమే నా సార్థకత. నీ కరుణయే నా యజ్ఞము.

"నీ రాక యెప్పుడో? నిన్నీ కన్నుల నెన్నడు చూతునో? నీ పాద ద్వయముపై నా శిరముంచు రోజెన్నడు వచ్చునో? ఎప్పుడెప్పుడు? ఇంకెప్పుడు? నా కోరిక తీరుట ఎప్పుడు? అను నాలోచనలతో సతమతమగుచున్న నాకీనాటికి కనిపించి, నా కోరికలు సఫలము చేసితివిరా తండ్రీ! ఆశ్రయించిన వారిని కరుణించు గొప్ప వాత్సల్యముండుటచేతనే, ప్రయాణశ్రమను లెక్కించక, యీ దాసురాలికి నిన్ను సేవించు అవకాశ మిచ్చితివి. నా జీవితము సార్థకమైనది. ఈ పంపా సరము నీ ప్రసారణ వలన జనించినదే. అదే నాకు నివాస స్థలమైనది.

"నీకై ఎదురు చూచుచు, లేళ్లను పిలచి నీ కథలు చెప్పితిని. చిలుకలకు నీ నామముపదేశించితిని. అవి యా నామజపము చేయుచుండగా వినుచు కాలము గడపితిని. మబ్బు కనిపించినంతనే, నీవనుకొని స్వాగతము చెప్పితిని. నా మనసు నెమలియై నాట్యమాడినది. మా గురుదేవులు యోగదృష్టితో చూచి నీ రూపునెట్లుగా వర్ణించిరో, అది అట్లే ఉన్నది. శతకోటి మన్మథుల మించు సౌందర్య పుష్టి అట్లే ఉన్నది. నీ గుణము చరిత్రయు నట్లే యున్నవి.

"నీ సుందర శరీరకాంతి, నీ వయస్సు, నీ వైభవము, నీ సొంపు, నీ దయా వీక్షణములు, ఎప్పుడు నెచ్చట నెవ్వరు పొగడరానంతటి నీ మహిమ, చిరునవ్వుతో కూడిన నీ భాషణములు, తండ్రీ! రామచంద్రా! యోగదృష్టిచే వీటి నన్నిటిని తెలుసుకొని, మహిమోపేతులైన నా గురువులు నాకు చెప్పిరి. మా గురుమూర్తి యెంతటివాడో! అంతటి మహాత్ముని పాదములను సేవించ నారంభించినప్పటి నుండియు – నీ గుణశ్రవణము స్తుతుల వలనే నా చెరవులకు

పండువ యగుచుండెడిది. దాని వలన నిన్ను సేవింప నపేక్ష జనించినది. అదియే నా శరీరము నింతవరకు నిలిపి యుంచినది. కనుకనే నిన్ను దర్శించు నదృష్టము కలిగినది.

“రఘునాయకా! పంపా సరోవరము నుండి వికసించిన తమ్మిపూలు కోసి తెచ్చి, అవి నీ కన్నుల సొంపుతో సరివచ్చునా యని పరిశీలించి, వానిని నీ నేత్రములుగా సంభావించి; వానిని నా కన్నుల కద్దుకొనుచుంటినయ్యా! వానిని హృదయమునకు హత్తుకొనుచు దినములు వెళ్లదీసితినయ్యా! ఎక్కడనయ్యా నీ నివాసము, ఎట్టిదయ్యా నీ నడవడి, ఏమిటయ్యా నీ కథ. నీ శౌర్య సుగుణసంపద లేవయ్యా! ఏవయ్యా, నీ కిష్టమైన కార్యములు, ఎంతటిదయ్యా నీ యందము! వానితో నా పోలిక నక్కకు నాగలోకమునకు పోలిక చెప్పినట్లు కాదా? అట్టి హీనురాలైన యీ శబరిని వెదకుచు వచ్చితివి కదయ్యా! ఎంత వింత?

“రామభద్రా! నా పున్నెముల రాశీ! కరుణాసముద్రా! బంగారుకొండా! ఏదిరా నీ పాదముల నొకపరి నా హృదయమున నుంచుకొననీ. ఆహా! ఇక చాలును. రఘువీరా! ఈ శబరి పుణ్య కల్పవృక్ష మిన్ని నాళ్ళకు పుష్పించి ఫలముల నిచ్చెనురా! నాయందు వాత్సల్యముంచి నా యీ పర్ణకుటీరమునకు దయచేసితివి. కాని నాకు పూర్తిగా సంతోషము కాలేదు. పచ్చగా సీతా సహితుడవై విచ్చేసిన ఎంత సొంపుగా నుండెడిది! పోనీ నీవైన వచ్చితివి. మంచిదే. కాని నా మనసున తృప్తి కలుగలేదయ్యా!

“నీవు జానకితో కలసి జంటగా నీ యాశ్రమ భూమికి వత్తురని, ఉసురులు బిగబట్టి నమ్మకముగా నుంటినిరా! మధురమైన ఫలములను చెట్లనుండి ఎంచి కోసి తెచ్చి గంపలనిండ బోసియుంచితిని. వచ్చిన నీవైన, నాకొరకైనను ఏమియు సాపడవైతివి కదా! చిత్రకూట పర్వత శిఖరిపై పంచవటి యందు సీతా సమేతముగా నీవు కొంత కాలముండగా చూచిన మౌనులెంత ధన్యులో! ఆ

సమయమున నీ దాసురాలైన శబరి యిచ్చట నున్నదని ఎరుగవా? తెలిసియు నశ్రద్ధ వహించితివా, రామయ్యా!

"రమాపతీ! లక్ష్మి వంటి సీతతో కూడి యీ బోయెత నివాసము పవిత్రము చేయుదువని అపేక్షతో రాత్రింబవళ్లు కనురెప్ప వేయక ఎదురుచూచితినయ్యా! నా అదృష్టమింతే. ఆమె రాలేదు. దానికి నీవేమి చేయగలవులే. ఈ బొందిలో ప్రాణములుండగా, సీతారాముల జంటను చూచు యోగము ఈ బోయెత నుదుట వ్రాసిలేదేమో కదా! మా గురుదేవులు "శబరీ యిచట నీకు రామదర్శన మగును" అని చెప్పినందుననే నేనిట నుంటినయ్యా. జవసత్వములు వీడినవి. నోట దోసెడు నీరు పోసినను యిముడకున్నది. ఎప్పుడీ బొందిని వదలి పక్షి యెగిరిపోవునో? ఈ శబరి మిమ్ము జంటగా చూడగలదా?

"చూడవయ్యా! పంపా సరోవరము నుండి చల్లని గాలి సుగంధయుతమై వచ్చుచున్నది. దానితో పోవు ప్రాణము వెనుకకు వచ్చుచున్నది. నీవును చల్లగా సీతాయుతుడవై వచ్చి యీ కుటీరమున నివాసముగా నుందువనుకొంటిని. నా యాశ నిరాశయైనది. నే జేసిన పంపా స్నానములు, నా తపస్సు, సేవలు – సర్వము నేమైనవో కదా! నీకేమి అనిపించుచున్నదో, నీ మేని భూషణము లన్నియు తీసియున్నను, నీ చేతుల ధనుర్బాణములు ఖడ్గము లేకున్నను, నీ శరీర శోభ కేలోపమును ఉండదు. అయోనిజయైన సీత, నీ అర్ధాంగి, మా తల్లి, జానకి క్షణకాలము నిన్ను వదలి దూరముగా నుండునేని, నీ శోభ నిశ్చయముగా తరిగిపోవునురా తండ్రీ! నీ యదృష్టము వక్రించునురా!

"ఆ జనకరాజపుత్రి క్షణమైన వీడక నీచెంత నున్నచో ఆ ప్రకాశము, ఆ తేజము దేవతలకైనను చూడ శక్యము కానిదై యుండును. ఆ ప్రకాశమును వీక్షించు నదృష్టము యీ దాసురాలికి లేకపోయెను కదా! అది నే చేసిన వాచాదోష ఫలమో లేక నా తపస్సునందున్న దోషమో? కానిచో, నే చేసిన భగవదపచార

దోషము కావచ్చును. రామయ్యా! ఈ సంగతిని నీవు కొంచెము నిదానముగ నాలోచించి చూచితివా? లేక ఎవరినైన నడిగి తెలుసుకొంటినా? నిన్ను సీతా రాముడని, సీతాకాంతుడని, జానకి పేరుముందు పెట్టి పిలుచుటకు హేతువేమి? నీ పేరునకు ముందు నీ భార్య పేరు నుంచుటకు గల రహస్య కారణమేమయ్యా!

"నాయనా! రామభద్రా! నీవు దైవమవు. కనుక నిట్టి గోప్యమైన వానిని పదిమందికి తెలుపరాదు. ఎవరైన జపింపదలచినయెడ 'సీతారామ' యందురే గానీ, రామసీత యనరు కదా! ఇప్పుడైన దాని విధ మట్లెందుకు విధింపబడి యున్నదో యధార్థము గ్రహించితివా? మిథిలలో నున్న శివధనస్సు నెత్తి కదా, నీవు జానకిని పెండ్లాడితివి. ఆ ధనువును నీవు గురునాజ్ఞచే కుడిచేత నెత్త గలిగితివి. దాని నంతకుమునుపే, జానకి తనంత తాను ఎవరి యాజ్ఞా, బలము, సహాయము లేకనే; ఎడమచేత నెత్తెను కదా! వీనిలో నెడమచేత నెత్తుటయే ప్రజ్ఞ కాదా? కనుకనే ఋషులు సీతకా ప్రఖ్యాతి కలుగజేసిరయ్యా!

"జనకరాజ పురోహితుడగు శతానందుడు యీ విషయమును గురించి చెంత నెవరును లేని సమయమున, గాధిజుడైన విశ్వామిత్రునితో మౌనీంద్రా! కుడియెడమల యీ జంటలో విల్లు ఎడమచేత నెత్తుటచే, జనకరాజ పుత్రిక – దశరథ రాజనందనునికన్న మిన్నగా కనబడుటలేదా? ఏమనెదవు? అనగా; గాదిజుడు అనుసంధానము చేసి సమాసమున ముందు జానకి పేరుపెట్టెను. జానకీజాని, సీతారాముడు, సీతాపతి – అను సమాసము లాతని కూర్పులేనట. రామయ్యా! అందుచేతనే ఋషి నియమానుసారము – మాయమ్మ సీతమ్మ పేరుముందు వచ్చుచున్నదట.

"మునిశ్రేష్ఠులు నా గురువులునైన మతంగ ఋషి భూత భవిష్య ద్వర్తమానము లెరిగినవారు. తమ యంతర్దృష్టితో దీనినెరిగి ప్రేమతో నను బిలిచి, యీ విషయము నాతో జెప్పియున్నారు. మాటల మధ్య ప్రస్తావ వశమున వచ్చినందున

నీతో జెప్పితిని – మన్నింపుము. రాఘవా! నీ దర్శనమునకు నోచుకొన్నను, తల్లి జానకిని జూచు ఆనందయోగము నాకు లేదాయెను. పోనిమ్ము. నీ దర్శనమైనది కదా! దీనిని సేవించిన అదృష్టము చాలునులే. నా ప్రాణమున కూరట గల్గించితివి. నాకు చివరి ఘడియలలో దగ్గరనున్న ఆప్తుడవయ్యా!

రామయ్యా! నీ కొరకెన్ని యేండ్లెదురు చూచితినో! నీవు కనిపించనందున నెంత దుఃఖించితినో! నీ వనవాస కాలమంతయు గోదావరీ ప్రాంతమున దండక యందే గడపి అయోధ్యకే తిరిగి వెళ్లెదవేమో? నని నీ సుందర ముఖ సందర్శన యోగము లేదేమోనని, యెంత భయపడితినో కదయ్యా!

"స్వామీ! వయసున చిన్నవైనను నీ యనుభవము గొప్పది. రఘువంశ శ్రేష్ఠా! ప్రియమైన వస్తువేదైన కనిపించనిచో నా బాధ యెంతటిదో నీకు తెలియదా? లోకముననే యొక్కడు నీకొరకు బాధనొందినను చూచి భరించగలవా? ఏది యేమైనను తండ్రీ! ఎంతటి వారికిని పరమ దుర్లభమైన నీ సందర్శన భాగ్యమిచ్చి నన్ను తరింపజేసితివి. దండక నుద్ధరించి యీ దిశకు రాక – అచటనే వనవాస కాలమంతయు వెచ్చించి, స్వపదము చేరియుండిన – ఈ మొండి కట్టియ గోడు వినుట తటస్థించునా? ఈ నీ దాసురాలికి తన చేతులమీదుగా నీ ఫలములు సమర్పించు భాగ్యము పట్టియుండెడిదా?

**ఉచ్ఛిష్టము :**

రాఘవా! మాటల మధ్య 'ఫలమ'ను మాట వచ్చి జ్ఞాపకము వచ్చినది. నిన్ననే యీ ఫలము కోసితెచ్చితి. నేను రుచి చూచితినిలే. దిగులు మానుము. గుండె దిటవు చేసుకొని, నీరసము తగ్గునట్లు – పిండి తీసిన యీ ఫలరసమును కొంచెము ఆరగించరా! రామయ్యా! మా తండ్రివికావా! నీకొరకై యీ తియ్యని ద్రాక్షపండ్లు తెచ్చితిని కొన్నియైనను తినరా బాబూ. నీకు వేళకు అన్నియు నమర్చుటకు జనకరాజ పుత్రి జానకి దగ్గరలేదు కదా! ఇక సోదరుడు

లక్ష్మణుదున్నను, వాడు గాలి మేసియైన జీవించగలవాడు. ఆకలి దాహ బాధలు వదలించుకొనిన వానికి పరుల యాకలి యెట్లు తెలియునురా?

"రామన్నా! వాడు జన్మతః భోగియే. పాపమిపుడు వాని భాగ్య సంపదలు తొలగినవి. రాత్రింబవళ్లు చెట్టునో పుట్టనో పట్టి తిరుగుచు ప్రొద్దులు పుచ్చుచున్నాడు. ఎంత జాలియోగాని - పగబట్టిన పామువలె నిన్నెల్లపుడు వెన్నంటి యుండును కదా! అతని సేవాభావము విచిత్రమైనది. అతడు నీ సోదరుడేయైనను, అతడుండెడిచోట్లును మారినను, అతని స్వభావము మాత్రము మారలేదు. నిన్ను పట్టుకొని వ్రేలాడుట, ఇతరుల చూపులు నీకు సోకకుండునట్లు వెయ్యి కళ్లతో నిన్ను కాపాడుట వాని స్వభావములు కదా!

"తండ్రీ! అట్లు ఊరక బేలచూపులు చూచెదవేలరా! నిన్నగాక మొన్న కోసి యుంచిన యీ పండు చక్కగా ముగ్గి పగిలినది. ఎంత తీయగానున్నదో! బాబూ! సాపడరా! పుల్లగా నున్న నీకు బెట్టుదునా? అందుకు నా మన సంగీకరించునా? ముందు కొంచెము కొరికి చూచియే తెచ్చితినిరా! మధురముగ నున్నవిరా! ఈ దాసురాలిని నమ్మవేలనురా? బాబూ! ఈ ఫలము తినకుము. వడలిపోయినదిగా కనిపించుచున్నది. పారవేయుము. మరియొక పండిది" అని శబరి కొరికి చప్పరించి చూచి, దానిని రామునిచేత బెట్టి "నాయనా! మొగమాటపడక ఆరగించరా!" అనుచుండగా, లక్ష్మణుడు కంగారుపడుచు రాముని చేయి పట్టుకొని వారించుచు నిట్లనెను.

"అన్నా! ఈ పండు తినకుము. ఇది యామె కొరికి యెంగిలి చేసినది." రాముడు మందహాసము చేయుచు "సోదరా! దూరదృష్టితో లెస్సగా చూడుము. ఈమె గురువువద్ద నెంత కాలమో శిక్షణపొంది, గురుసేవ చిరకాలము చేసిన ధన్యురాలైన శబరి. ఆమె యిచ్చిన యీ ఫలపు విలువ యింతయని నిర్ణయించ గలమా? వేయి జన్మలకైన నిట్టి ఫలము పొందగలమా? నే జేసిన తపఃఫలముగా

నీ ఫలము ఈనాటికి దక్కినది కదా! ఎంత మాట యంటివి! ఎప్పుడును కోపమును, రోషమును ముందుచెంగున మూటగట్టి నట్లుందువు. ఈ శబరి సమర్పించిన ఫలమును ఆనాడు భరతుడు నన్ను జూడరాగా, వాడు రాజ్యమును దోచుకొనవచ్చెనని తప్పుగా దలచితివి. ఇవి యన్నియు నపరాధములని తోచుట లేదా?

"ఇది మహర్షి మతంగుని తపఃపుణ్యములు రాశిపడినచోటు, విషయ వాసనలు దరిజేరని పవిత్రభూమి. దీని హృదయము యోగీశ్వరులకును అంతు చిక్కని షడక్షరీ అమృత సరస్సు. ఈ వనము తపోవాసనలతో నిండినది – దేవాతాకాతారము. ఈ వనభూమిలో విహరించు చిలుక యీ శబరి. చిలుక కొరికిన పండు మధురము ఆస్వాదయోగ్యమునగునే గాని ఎంగిలి పండనిపించు కొనదు కదా! దానిని అందుకొను భాగ్యవంతు లెంత ఘనులో కదా!

"తమ్ముడా! యోగబల ప్రభావమునొప్పు ప్రదేశమిది. దానిని వీక్షింపుము. మతంగ ముని దీనిని వదలి వెళ్లి యెంతో కాలమైనది. ఆనాటి ఆరవేసిన నారచీరలు చెట్లను వ్రేలుచునట్లే యున్నది. ఈ చోటున పూచిన పూవు లెన్నటికిని వాడిపోవు. ఈ శబరి యదృష్టమింతయని యెవరును చెప్పలేరు. అయ్యో! శబరి వస్త్రముగా ధరించిన జింకతోలు బొంతురేగి ధూళిగప్పి యున్నది. జుట్టు జడలుగట్టి సంస్కారమునకు నోచుకొనలేదు. తన జీవితమును ఆమె తపస్సుకు, నియమమునకు, సేవకు ధారపోసినది. చూచుట కిట్లు కనుపించు శబరి గొప్ప జ్ఞానరాశి కదా!

"ఇది రహస్యము, తేలికగా తీసుకొనరానిది. దీనిలోని అంతరార్థమును గ్రహించక తొందరపడుచుంటివి. నా తత్త్వమును విడమరచి చెప్పుచున్నాను. గ్రహించుము. శబరి – "రామా! యీ పండు నేను కొరికి తెచ్చితిని. నీ కొరకు తెచ్చితిని" అని అపేక్షతో పెట్టిన యెడల దానినీ రాముడు సంతోషముతో

గ్రహింతును. ఆమె అన్యదైవతా స్మరణచేయని అంతరంగ భక్తురాలు. ప్రపన్న హృదయ. ప్రపన్నుల విషయములో ఎంగిలి యేమిరా లక్ష్మణా! తెలుసుకొనుము, అందరి యాత్మలందును నేనే పరముడనై యుందును. ఇతరుల సంగతి అటుంచుము. నా విషయములో మాత్రము ఎంగిలియను పదము లేనేలేదు. అందరి యాత్మలయందు ఆత్మగా నుండు నాకు – జ్ఞానమే ఆత్మ – అని తెలుసుకొనుము. నా మతమున ఎంగిలియను పదమునకు తావులేదు.

“తమ్ముడా! నీవును ముందు ముందు గురుపీఠ మెక్కవచ్చును. నేవచించిన యర్థము తెలుసుకొనుము. శత్రువుల యింటి అన్నమైనను ఎంగిలి చేసిపెట్టిన గోరుముద్దలనైనను – అవి ప్రేమతో పెట్టినచో – ఆనందముతో స్వీకరింతును. నీ పిచ్చి పిచ్చి సంభాషణలు ఆపుము. ఇక యిట్టి మాట లాడబోకుము. ఈ నీ మాటలు వినినచో, శబరి మనసు నొచ్చుకొనును. చివుక్కుమనును. నీకు అనుభవములేని మాట యిది. ప్రపన్నులైన వారి కులములు, గుణములు వేరుగా నుండునురా! ఈ శబరి తరించవలెను. ఇచ్ఛతో శ్రేష్ఠ గురు పాదముల నాశ్రయించినది. వానినే తాను చరితార్థ యగుటకు ఊతకఱ్ఱలుగా చేసుకొనినది. ఆమెను వేరుగా జూచుట – జాతు లెంచుట అపచారమగును. ఇట్టి వారి విషయమున కులగోత్రముల నిర్ణయించ వీలుకాదు. ప్రపన్న హృదయయగు శబరిని నిందావాక్యములను గోతిలో పడవేయకురా, లక్ష్మణా!

“మోక్షాపేక్షతో గురుపాదములు పట్టినది. అట్టి శబరికి జాతి కులముల వంటి తేడాలను విధించుట – విరోధమగును. దీనికి కారణ మేమున్నది? గురువుల మార్గమునే అనుసరించి తాను నడచినది. గురు కటాక్షమను గట్టి కొమ్మను పట్టుకొనినది. ఇదియే కదా చరమ రహస్యము. జ్ఞానము కర్మ యనునవి బురద వంటివి. వానిని పూసుకొనిన యతులు లక్షలాదులుండినను చరమరహస్య నిష్ఠులకు సాటిరాజాలరు.

“నీవు శబరియందు చూపిన భేద బుద్ధి హద్దులు దాటిపోయెనని చెప్పుట

కాదు. యెటువంటి వారికైనను – ఆచార్య కటాక్షమే సద్గతి నిచ్చును. శిష్యులేమి చేయుచుందురు? తమ ఆచార్య మార్గమునే అనుసరింతురు కదా! దాని ప్రకారమే దేహయాత్ర సల్పుచుందురు. నీవు బుద్ధిమంతుడవు, లక్ష్మణా! శబరి వంటి శిష్యురాలు ఎందరికి లభించును? ఆలోచించుము. గురువులు మెచ్చుకొనునట్లు, వారియందు మహత్తరమైన భక్తితో కైంకర్యము చేసి, ఇహసుఖములపై నభిలాష వదలి, ఆచార్య కటాక్షము పొందిన శ్రేష్ఠ వ్యక్తి యీ శబరి. స్వయముగా చేయు తపస్సు వంటివానికి – గురువర్యులకు చేయు పరిచర్యకు – తేడా లేకుండునా?

"శిష్ఠులైన వారి సేవ చేసినది. వారినుండి శాస్త్ర పద్ధతులు వినినది. వానికి తోడుగా బ్రహ్మచర్యము నెంతో దీక్షతో పాటించినది. ఇంతటిదైన శబరి, ఇంతటి మహాత్మురాలు, నాకు ఎంగిలిపండ్లు తెచ్చునా, లక్ష్మణా? మనసు నందంతట నన్ను గురించిన భావనలే నిలిపి యుండుటచేత, శరీరమును మరచిపోయినది చేసెడు పని పాపమా? పుణ్యమా యను విచక్షణ యెరుగనే యెరుగదు. అవి తెలిసియున్నచో తాను కొరికిన ఫలము సమర్పించునా? ఆమె యిచ్చినను నేను స్వీకరింతునా? అట్టి శబరి కొరికిన పండు, నేను తినగోరినను లభించునా?

"తమ్ముడా! లక్ష్మణా! ఇట్టి వానిని పరులు వినిన చుల్కన చేసి మాట్లాడెదరు. శబరి యిచ్చిన ప్రసాదము అమృతమే. అది అందరకు ఊరకనే దొరుకదు సుమా! ఎక్కడి దండక? ఎక్కడ పంపా సరోవరము? దీని కొరకే కదా – ఇంత దూరము శ్రమించి వచ్చినది? ఆమె కొరికినదే యిచ్చినను – యిటువంటి పరమ రహస్యములు – గోప్యముగా నుంచవలసినవి. మీరు అనదగదు సుమా! సౌమిత్రీ! ఇది చాలును. జాతి మతము గుణముల జోలి నాకెందుకు? అవి యేమైపోయినను పోనీ, ఆచార్యుడెవనికి – వీడు నావాడని – రక్ష కట్టునో?

అదియే చాలును. ఆ పిమ్మట ఆ రక్షాధారి సర్వభారములు నాయంతటట నేనే వహించెదను.

"ఆచార్య సేవ యనగా, నా యొద్ద మోక్షధనము దాచుటయే. అట్లు దాచబెట్టిన ధనమును - దాతలకిచ్చుటలో నే నెన్నడును చిక్కులబెట్టను. నీ చర్యలు చూచినను, ముఖవైఖరి చూచినను - నీవును - ఎప్పుడో ఒకప్పుడు ఆచార్యత్వము వహింపదగిన వాడవనిపించుచున్నది. ఇందుకు ఆశ్చర్యపడనక్కర లేదు. నీ నడక గూఢమైనది. నిన్ను చూచుచుండగా, శేషత్రైక మాధుర్యము - నీ స్వరూపముగా తోచుచుండును.

"లక్ష్మణా! జరిగినదాని యర్థము తెలియకున్నావు. ఈ విషయమంతయును వైష్ణవ సంప్రదాయ దివ్యార్థమై యున్నది. నాకును శబరికిని మధ్య నెంగిలియను మాటయే లేదు. శాస్త్రార్థము చేయువారలు - ముఖ్యార్థమునకు బాధ కలుగునప్పుడు లక్ష్మణ చేయుచుందురు. అదిగో శబరి చూచుచున్నది. ఇక చాలింతము.

"అవ్వా! నీ సుకృతము ఫలించినదా? నీవు చిరకాలము నుండి కోరునది లభించినదా? గురుపాద సేవలను గుట్టలు పోసితివి. నీ పరమార్థమేదో కనుగొన్నావా? నీ స్నానపానాదుల కెవ్వనివలన గాని విఘ్నములు కలుగకుండ నెరవేరుచున్నవా? నీ పరిచర్య వలన ఆనందమైనది. నీ ఉపశాంతి వాక్యములు మర్యాదకే అయినను నా ఆకలిని దాహమును వానితో తీరిపోయినవి. నీ ఆదరణచే నా మనసులోని వ్యధ కూడ శాంతించినది. ఇక నాకే కొరతయు లేదు. ఓ శ్రమణీ! నాకు పరిపూర్ణ తృప్తి కలిగినది.

"లోకములచే స్తుతులు పొందిన నీ గురుశ్రేష్ఠుల చరిత్ర విన్నాను. నీ ప్రభావమునకును ఇచటి యీ ప్రకృతి శోభకును ఆనందము కలిగినది. నీ

సపర్యలు పొందితిని, మంచిదే అనుకొన్నానుగాని – నా యిల్లాలు మాత్రము నిన్ను చూడరాలేకపోయినది. ఏమి చేయవచ్చును? పాడుభూతము వలె మాకొక రక్కసి దాపురించినది. అది నాపై మోహముతో పైబడు సమయమున – అక్కడకు వెళ్లుమని మా లక్ష్మణుని చూపితిని. అట్లు యీ కీడును నేనై చేజేతుల కదిలించితిని. ఇది యంతయు సీతయెదుటనే జరిగినది.

"అసలే అది చుప్పనాతి. దానికితోడు శరీరవాంఛతో పశువైయున్నది. దానితో – ఎప్పుడు నెవరితో హద్దుమీరి నవ్వనివాడను – దానిని హాస్యము పట్టించితిని. ఇటువంటి మహా విషపానము చేసిన ఫలము అనుభవించ వలసినదే. లక్ష్మణుడైనను ముందుగా నామెను కసరిపొమ్మనిన బాగయ్యెడిది. అదియును జరుగలేదు. మేమిద్దరము నొకరిని మించి మరియొకరము కొంపకు చేటు తెచ్చితిమి. ప్రక్కనే యిల్లా లుండెనను స్పృహ కూడలేక – అయ్యో! ఆ రాక్షసితో సరాగమాడగా పూనుకొనిన నాకు – సిరి యెట్లు దక్కునమ్మా? ఆ చుప్పనాతితో చిక్కులమాట యటుంచుము – సీతయే దక్కకపోయినది కదా!

"ఆ రాక్షసితో పరిహాసమాడిన కారణముచేతనే – చూచుచుండగనే – పర్ణశాలను వదలవలసి వచ్చెను. రాత్రింబవళ్లు దుఃఖములో మునిగితిని. ఇది కుటుంబపు గుట్టు కదా! నేనెవరికి చెప్పరానిది – పరులు వినరానిదియు కదా! నా మనఃప్రశాంతి కొరకు – నీకు కాబట్టి చెప్పితిని. మొదట గోటితో పోవు పనియైనను యిప్పుడు గొడ్డలికి కూడ అసాధ్యముగా మారినది. ఆ పాపిష్టిదానితో పరిహాసములు సులువుగా పోవుటకు బదులుగా, యీనాటికవి ఎంతెంత కష్టముల దెచ్చినవో చూచితివా? ఓ శ్రమతీ విన్నావుగా!" రామచంద్రుని రాజీవ నేత్రములు అశ్రుకణములతో నిండిపోయినవి. దానితో బోయెతకు తత్తరపాటు కలిగినది.

## యోగాగ్ని :

ముందుకు వంగి, ముద్దులు మూటగట్టు రఘురాముని కండ్ల నుండి వెడలు బాష్పములను చేతులతో తుడిచి, వాని ముఖముపై మూగిన జడలుగట్టిన జుట్టును ప్రక్కలకు త్రోయుచు, తండ్రీ! ఎందుకు నాయనా! విచారము? ఆ శూర్పణఖ మీ కొనరించిన అపచారమేమున్నదయ్యా! ముద్దులొలుకు జగన్మోహనమైన నీ రూపము చూచి మనసాపలేక, తాను కొంచెము హద్దు మీరినదే యనుకొందము, దీనిలో నామె దోషమేమున్నది? నిరీహులైన వారిని కూడ మోహమున ముంచెడు మత్తుమందేదో నీ యొద్దనున్నదట కదా? కానిచో నామెకు ఆపరాని యంతటి మమకారము కల్గియుండెడిదా?

“అనురాగము పొందియో, వైరమూనియో, శిక్షలు పొందియో కాక భయము వలననో – రాక్షస జాతి – నీయందే ఏకైక భావన నుంచి తరించుచున్నది. నీవలననే అక్షయ పుణ్యలోక ప్రాప్తి వారికి లభించుచున్నది. మార్గములు వారివి నావి వేరైనను, గమ్యమొకటేనయ్యా! ఆమె రక్కస జాతిలో పుట్టియుండవచ్చును. ఆ జాతికి అనుగుణమైన పనులనే చేయుచునుండవచ్చును. నీపై ప్రత్యక్ష వైరము పూని యుండవచ్చును. అయినను ఆ దానవి శూర్పణఖతో సమానులు – నీవారనుకొన్నవారిలో నెవరున్నారో చెప్పవయ్యా! అటువంటి రక్కసి వలననే కదా, నీకు విశ్వమందంతట వ్యాపించిన ప్రసిద్ధి కలిగినది!

“మీరామె ముక్కును చెవులను తెగగోసి పంపితిరి. ఆమె భోరున మొత్తుకొను నప్పుడు కూడ – మిమ్మొక పొల్లుమాటయైన పలికినదా? పైగా నీ రూపమును, యౌవన వైభవమును స్తుతించినది. ఆమె రక్కసి కావచ్చును. చివరకామె కీర్తనయే నిన్ను రక్షించునురా, రామా! యౌవనవతులలో, అందగత్తెలలో నారాక్షసితో సమాను లెందరుందురో చెప్పుము. మీనుండి తీవ్ర పరాభవము పొందియు, మిమ్మే స్తుతి చేయుటేగాక, మీ పరువు ప్రతిష్టలు లోకమున చాటుటకు –

ఎంత ప్రీతి యుండిన సాధ్యమగును? దానితో నందరు మిమ్ము సెబాసని మెచ్చుచున్నారు కదా!

"ఏమూలనో – నీ యెదుటబడక – దాగియున్న రక్కసులను వెలికి లాగి తెచ్చి, నీ బాణ జ్వాలలపాలు చేసినది. నీ యవతార లక్ష్యము నెరవేర్చుటకు తోడుపడినది. నీవు మెచ్చెడు మునిశ్రేష్ఠులలో నీ విధముగా నీ లక్ష్యసిద్ధికి తోడైన వారెవరైన నున్నారా? ప్రజలామెను దుష్టురాలని దూషింపవచ్చును, కాని సత్యమేమో నీకు తెలియదా? రామయ్యా. దేవతలు నిశ్చేష్టులై చూచుచుండగా, కచ్చ బిగించికట్టి – పదునాలుగు వేల దైత్య సమూహమును క్షణకాలములో బూడిద పోగులుగా మాడ్చివేసి, జానకి బిగికౌగిలి కానుకగా పొందిన వీరుడవు కదా! ఆ శూర్పణఖయే లేకున్న ఇంత కీర్తి, ఇట్టి బహుమతి లభించియుండెడివా, చెప్పవయ్యా?

"ఏమయ్యా రామయ్యా! నీవు సీతను అడవులకు తెచ్చుటకు నిరాకరించగా, నిన్నామె స్త్రీ రూపమున నున్న పురుషుడవని రెచ్చగొట్టి నీ యంగీకారము పొంది, వనికి వచ్చెనని విన్నాను. అట్లన్న భార్యయే – నీవొక్కడవే – ఖర దూషణాది రాక్షసులను వధించగా – కలిగిన గాయములకు తన బిగి కౌగిలి వెచ్చదనముచే కాపుబెట్టుట, శూర్పణఖ వలన సాధ్యపడినదే కదా? ఆయదృష్టము శూర్పణఖాప్రసాదము కాదా? ఆమె తన భంగపాటు మూలమున సీతను వదలి రాఘవుని కొక్కనికే సేవలు చేయువారందరకు పట్టు గతిని – లోకమునకు చాటి చెప్పినది. అంతేకాని నీకు అపఖ్యాతి తెచ్చిపెట్టలేదు. నరహంతకియైన శూర్పణఖయే లేకపోయినచో, నీ భుజశక్తికి శౌర్యప్రతాపములకు నింత ఖ్యాతి లభించియుండెడిదా రామయ్యా?

"కండ్ల కరువు తీరునట్లు నిన్ను చూచినది. నీ మనోహరరూప వైభవమును కీర్తించినది. నీపై ప్రేమగీతము లల్లి పాడినది. నీ భుజాల బలమను అమృత

సరస్సులో మునిగినది. ఆ రక్కసి మించిన ధన్యురాలు పురుషోత్తమా! రామా! ఎచ్చట నున్నదిరా? ఆహా! ఆమె యెంత తపస్సు చేసినదో కదా! అసాధారణ రూపురేఖలతో జగత్తును మోహమున ముంచు నిన్ను మోహించుట దోషమైనచో రామచంద్రా! నీ ప్రేమపాత్రులెవరో చెప్పుము? నేను యథార్థము చెప్పుచున్నాను. నాపై కోపించకురా! ఎవరు ప్రేమ చూపినను, కోపమూనినను, మంచి చేసినను, సదభిమాన ముంచినను – వాటి కన్నిటికి నీవుగాక పాత్రులెవరురా?

"నీ శ్రమవర్గమునకు చెందిన రాక్షసస్త్రీ నీ మోహజలధిలో మునిగి నీవద్దకు చేరుట గొప్ప విషయమే. నీకంటె లోక మోహనుడెక్కడ నున్నాడు? ఎక్కడ కామ మోహము లుండునో, కోపమును అచటనే యుండునురా, రామయ్యా! నీవు అడవుల దిరుగుచు నింత దూరము పడివచ్చిన కారణమదే కదా? నీ రాకలోని ఆంతర్యమది కాదా? రక్కస జాతిదే అయినను, నీపై అనురాగమును చూపినది. ప్రత్యక్షముగా ముఖాముఖిగా నీవు సరసముగా పలికిన మాటలు వినినది, నీవు శిక్షింపబూనగా దోయిలిబట్టినది. ఆహా! ఆమె యెంత తపస్సు చేసియుండెనో! రఘువంశశేఖరా! నీ గుణస్మృతి పరంపర ఆమెకు వలె వేరెవరికి దక్కినదిరా?

"దయాసముద్రా! ఆ రక్కసి కోరికను రాబోవు జన్మలోనైనను తీర్చవయ్యా! ఏ జాతిలో పుట్టినను, నీ మోహనరూపమును వలచివచ్చినది. అందుకే సంతోషించుమురా! ఆమె నీకు కలుగజేసిన కీర్తికి ప్రతిగా రఘువంశభూషణా! ఆమెకేమి యిచ్చినను ఋణము తీరదురా! ఆమెవలె రాక్షసులే నీ కీర్తి ప్రచారకులై యున్నారు. మారీచుని మాట యేమి? వాడెంతటి యధముడైనను కానిమ్ము, తన దృష్టి స్థిరముగా నీపైననే ఉంచెను. నారబట్టలను బిగించి కట్టెను. తపస్విగా మారిపోయెను. ఇటువంటి సంస్కారము, నిశ్చలబుద్ధి, దీక్ష గల మును లెందరున్నారో చెప్పవయ్యా!

“అంతిమ స్మరణచేత ముక్తి లభించునని కదా పెద్దలు చెప్పిరి. రాఘవా! ఆ మారీచుడు మృతినందు సమయమున నీ మూర్తిని తన కండ్లతో దర్శింప గలిగెను. నిన్ను జగజ్జనని సీతను, నీ సోదరుడు లక్ష్మణుని నోరు నొచ్చునంత బిగ్గరగా తలచెను. అంతకుమించి మోక్షసాధన మేమున్నది? వీనిని మించి, వాడు పిడుగువంటి నీ బాణపాతమున జచ్చెను. ఇది యెంత వింత? వానికి మోక్షము పదిలమైనది. అంతకు మించినది – కోరదగినది – వేరేమున్నది? వేదవిహిత కర్మలాచరించువారు నీ దయాపాత్రులౌదురు గాని, రజోగుణ ప్రకోపముచే తనువు మరచి, నిందితమైన కర్మలు చేయువారికేది దారి? సన్మార్గవర్తులు కాక, నిన్ను స్మరించకపోగా, నీ మీదకే కత్తినెత్తు జాతి యది. వారు మోక్షమందు మార్గము నీవే తెలుపుదువు కదా!

“స్వామీ! ఎంత వెదకినను దేవర మహత్వ మెట్టిదో తెలియరాదు. నీవీ యడవులబడి తిరుగుట యెందుకో, అంతకంటె తెలియదు. నీవు చేయు కార్యముల మర్మము దేవతకే తెలియనిదై యుండగా, అద్భుతమైన నీ చర్యల నెరుగుట నాకు సాధ్యమా? యాగరక్షణ కాలమున చంపక మారీచు నెందుకు విడచితివో తెలియదు. వానిని జలరాశిలో నేల త్రోసితివో అర్థము కాదు. ఇప్పుడు యీ రాక్షసి శూర్పణఖను చంపక, ముక్కు చెవుల మాత్రమే కోసి ఎందుకు విడచితివో తెలియదు. మహాత్మా, దీనినైన తెలియజేసెదవా?

“చుప్పనాతి శూర్పణఖ నిన్ను జూచిన వేళావిశేష మెట్టిదో గాని; నీ నేర్పును, నీ భుజశక్తిని, నీ కరుణా విశేషతను మన్మథ సమానమైన నీ రూపమును, దాని వలన లోకమెరిగినది. రఘువంశోత్తమా! అందుకు ప్రతిగా నామెకు నీకు దోచిన శిక్షయో రక్షయో విధించవయ్యా! ఇంతకు పూర్వమే నీవు వధించిన కబంధుడెవడు, రాక్షసుడే కదా! వాడు దేవాంతకుడు. అటువంటివాడు నీ పరమాద్భుతమైన రూపదర్శన మాత్రమున మారిపోయెను. అది వాని

శాపాంతము చేతనా? లేక నీ కరుణాదృష్టి పాతము చేతనా? నా కెట్లు తెలియునురా!

"ఏదియేమైనను నీకు రాక్షసజాతిపై గొప్ప మమకారము కలుగుట మాత్రము వాస్తవము. దానివలన, వారికి నీ కుల ధనమునైన నీయగలవయ్యా రామయ్యా! నేను సత్యమే పలికితిని. ఇది మా గురువర్యుడు మతంగస్వామి సేవా మాహాత్యము వలన తెలిసిన రహస్యము. దానిని నీకు విన్నవించితినయ్యా! ఇదేమిరా తండ్రీ! ఇప్పటిదాక గుర్తింపలేదే. నీ వ్రేలికి రామనామ ముద్రగల ఉంగరమున్నదే. అన్ని సొమ్ములను లాగుకొనిన కైక దీనిని నీ వ్రేలిని ఉండనిచ్చినదా? నాకేదో సందేహముగ నున్నది. అడవికి బయలుదేరువేళ నన్ని సొమ్ములను వంకెకు తగిలించితివి. ఇది నీ వ్రేలికెట్లు వచ్చినదో కదా!

"కైక నీ కటకములు, కుండలములు, కిరీటము, చీకటిని కూడ వెలుగుగా మార్చగలవి, ధగధగ మెరిసెడివియునైన హారములు లాగుకొని, నారబట్టలు చేతబెట్టినది కదా! ఆ సమయమందు నీ చేతినున్న ఉంగరమును చూడకుండెనా? నాకేదో సంశయమగుచున్నదిరా రాఘవా! నారబట్టలు గట్టి దుంపలు వ్రేళ్లు ఆహారముగా, జడలు చర్మములు ధరించు నీకు వ్రేలికి ఉంగరముండ తగదు. కాని, రమణీయమైన యీ వస్తువు నీ చేతి కెందుకు వచ్చినది. సుందరి సీతా విరహాగ్నినిది చల్లబరచునా, రామయ్యా!

"ఇది నీ వ్రేలిని అయోధ్యలో బయలుదేరు సమయమునకు లేదు. మధ్యలో ఎప్పుడు సంక్రమించెనురా? నాకిట్లు తోచుచున్నది. మీ దంపతుల ప్రణయ ప్రసక్తిలో తప్పులో ఒప్పులో జరిగి యుండును. దీనిని మీమధ్య పందెముగా పెట్టగా, అరణ్యవాస కాలమున నీవు గెలుచుకొనియుందువు. అదిగో నీ ముఖమున చిరునవ్వు వెలసినది. అది పెదవిపైకి దిగి నాట్యము చేయుచున్నది. విరిసిన మల్లెపూవు పచ్చని ఆకుల మధ్య దాగియుండలేనట్లే – నీ ముఖమున

చిరునవ్వును దాగియుండజాలదు. ఇన్నాళ్లకీ సొగసు కనిపించినది. నా యదృష్ట వశమున చూడగలిగితిని. నేనూహించినది సత్యమే యని తెలుపుటకు ఈ సరసము ప్రదర్శించితివిలే, తండ్రీ! రామయ్యా! జానకీ విరహ తాపముతో చిక్కి సగమైనావు. ఇప్పుడీ యుంగరము నీ వ్రేలికి వదులైపోయినది. జారిపోవు నేమో జాగ్రత్త. ముందుముందు నీ కిదియే శరణ్యము. ఇదియే నీ జీవము నిల్పునది. ఇదే చేయిజారిన యెడల, బ్రతుకంతయు వ్యర్థమైపోగలదురా!

"అదే ఋష్యమూక పర్వతము. అచటకు పొందు" అనుచుండగనే, శబరి శరీరము యోగాగ్నిలో కాలిపోవుచుండెను. పొగలు చిమ్ముచుండెను. రామ లక్ష్మణులు నివ్వెరపడి చూచుచు నిశ్చేష్టులైరి. ఆకాశము నుండి చూచుచు దేవతలుండిరి.

**'శబరి' సమాప్తము**

